
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 144
బుధవారం 14-8-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

వజ్రాభరణాల వేడుక!



క్యారెట్‌కు రూ.5000 తగ్గింపు

రూ.62000 రూ.57000

ముఖ్యమైన విషయం! దయచేసి ఆలోచించండి!

సరైన క్లారిటీ, కలర్ మరియు తగిన సర్టిఫికెట్ కలిగిన వజ్రాభరణం మార్కెట్‌లోనే అత్యంత తక్కువ ధరకు లభించేటప్పుడు, ఎందుకు ఎక్కువ ధర వెచ్చించి కొనాలి? ఉదాహరణకు చెప్పాలంటే, మీ లలితా జ్యువెల్లరిలో ఓ డైమెండ్ నెక్లెస్ కొంటే, తద్వారా మీరు ఆదా చేసిన డబ్బులతో డైమండ్ చెవిపోగులను ఉచితంగా కొనగలరు.

ఇతర షోరూం మాదిరిగా తరగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!

నాణ్యత సర్టిఫికెట్

షోరూంవాళ్ళు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను ఇవ్వడం లేదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అంతర్జాతీయస్థాయి నాణ్యత సర్టిఫికెట్ ఇస్తున్నాం.

కలర్ & క్లారిటీ

E-F కలర్‌గ్రేడ్ మరియు VVS 1 & VVS క్లారిటీ వజ్రాభరణాలనే విక్రయిస్తున్నాం. G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను విక్రయించడం లేదు.

ఎక్స్ఛేంజ్ పాలసి

వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్, బంగారు నగలుగా అయితే 90%, నగదుగా 85% బైబ్యాక్.

FREE & FLEXI

11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!

బంగారం ధర పెరిగినా మీకే లాభం, తగ్గినా మీకే లాభం

100% తరుగు లేదు

అన్ని బంగారు నగలు, అన్‌కట్ వజ్రాభరణాలు మరియు వెండి వస్తువులకు వర్తిస్తుంది.

చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 / రూ.5000
రూ.10000 / రూ.15000 / రూ.20000 / రూ.25000

JEWELLERY EXCHANGE PLAN

అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్

ఖర్చు లేకుండా, ముందుగా పాత నగలు ఇచ్చి, కొత్త నగలు తీసుకోవచ్చు!

100% V.A. లేదు!

5వ నెల ఆఖరు నుంచి, కొనే నగను బట్టి, తరుగు (V.A.) లేకుండా నగలు కొనొచ్చు.

11 నెలల తర్వాత నగలు తీసుకొంటే ఏ బంగారు నగ అయినా కానీ, తరుగు ఛార్జీలు ఇవ్వాల్సిన పనిలేదు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

పాత నగలతో మాత్రమే కాదు, నగదు చెల్లించి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు!

కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.











99% వెండి వస్తువులకు తరుగు లేదు!

లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్

Customer Care 90 99 999 916 | BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!


వైజాగ్: 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001. విజయవాడ: 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్. ఫోన్: 0866-2481133. గాజువాక: 10-10-66, మెయిన్‌రోడ్, విశాఖపట్నం. ఫోన్: 91333 23009. విజయనగరం: ఎం.జి.రోడ్, జగన్నాథస్వామి ఆలయం సమీపంలో. ఫోన్: 08922-256123. రాజమహేంద్రవరం: 20-25-3, కంబాల చెరువు, దేవిచౌక్ సమీపంలో. ఫోన్: 0883-2020300. భీమవరం: సండే మార్కెట్. ఫోన్: 08816-221799. కాకినాడ: 21-9-16, బాలాజీ చెరువు సమీపం. ఫోన్: 0884-2373777. తిరుపతి: 481/482, V.V. మహల్‌రోడ్. ఫోన్: 0877-666 0505 / 0606 / 7888. గుంటూరు: లక్ష్మీపురం, మెయిన్ రోడ్. ఫోన్: 0863-2332123. శ్రీకాకుళం: 8-12-8, గొర్లెవారి వీధి, G.T. రోడ్ నార్తన్ రో చౌక్ వార్డ్. ఫోన్: 08942-227799. గోపాలపట్నం: 2-122, బాజి జంక్షన్, విశాఖపట్నం. ఫోన్: 0891-2515550. అనంతపురం: 15/340, సప్తగిరి సర్కిల్, అనంతపురం టౌన్. ఫోన్: 08554-220346 / 47. ఒంగోలు: 37-1-175(1), కర్నూల్ రోడ్, ప్రకాశం జిల్లా ఫోన్: 08592-224405. నరసారావుపేట: 9-1-93, రైల్వేస్టేషన్ రోడ్, గుంటూరు జిల్లా. ఫోన్: 08647-221123. చిత్తూరు: 15-359, చామంతిపురం, వేలూరు రోడ్. ఫోన్: 91333 23018. అనకాపల్లి: 14-9-5, ట్రంక్ రోడ్. ఫోన్: 0892-4226678 / 79. మాచర్లరుపేట: 12-153, జీఎన్‌టీ రోడ్. ఫోన్: 9966100553 / 0862-3243244. గూడూరు: 1 & 3, హాస్పిటల్ రోడ్. ఫోన్: 9966100551 / 0862-4229699. నెల్లూరు: 1490, మినీ బైపాస్ రోడ్, మాగుంట లేఅవుట్. ఫోన్: 9966100556 / 0861-2314233. కర్నూలు: 40/29-A, మేడం కాంపౌండ్, పార్కు రోడ్, జెడ్.పి. మెయిన్ రోడ్, ఫోన్: 7799950308, 08518-224474 / 76. అమలాపురం: ఏజీ రోడ్, సినిమా రోడ్. ఫోన్: 89258 48134 / 35.

హైదరాబాద్ (సోమాజిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | కూకట్‌పల్లి | చందానగర్ | సుచిత్రా సర్కిల్) • నిజామాబాద్

తెలంగాణ • పుదుచ్చేరి • కర్ణాటక

Lalithaa®

www.lalithaajewellery.com


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 144

బుధవారం 14-8-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరో మూడు రోజుల తర్వాత..

భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకం కోసం చేస్తున్న న్యాయ పోరాటం కొనసాగుతూనే ఉంది. ఆమెకు పతకం ఇవ్వాలా వద్దా అనే అంశంపై మంగళవారం రావాల్సిన తీర్పును 3 రోజులకు వాయిదా వేస్తున్నట్లు సీఏఎస్ ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 16న భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు తీర్పు రానుంది.

12లో



వైద్యురాలి కేసు సీబీఐకి

కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ కోల్‌కతా హైకోర్టు తీర్పు వెలువరించింది.

వివరాలు 6లో ▸



టార్గెట్ జోగి రమేష్!

నిబంధనల మేరకు భూమి కొనుగోలు చేసి విక్రయించిన వ్యవహారంలో జోగి రమేష్‌పై ప్రభుత్వం అక్రమ కేసు నమోదు చేసింది.

వివరాలు 10లో ▸



జీవో–94 నిలిపివేత

ఏపీలోని ప్రైవేట్ వైద్య కాలేజీల్లో కన్వీనర్ కోటాలో జనరల్ కేటగిరీలోని 10% సీట్లను ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించిన జీవోను హైకోర్టు నిలిపేసింది.

వివరాలు 3లో ▸



కొత్త రైలు.. కొండ కోనల్లో..

ఒడిశాలోని మల్కనగిరి–భద్రాచలం సమీపంలోని పాండురంగాపురం వరకు మంజూరైన కొత్త రైల్వే లైన్‌ను కేంద్రం ఆమోదించింది.

వివరాలు 5లో ▸

అన్ని ప్రయత్నాలూ చేసి చివరకు తప్పుకున్న

టీడీపీ



- విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిచేందుకు టీడీపీ అన్ని పాచికలు
- కోట్లు వెదజల్లి ఓట్లు కొనేందుకు విశ్వప్రయత్నాలూ చేశారు
- టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా స్థిరంగా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు
- గత్యంతరం లేని పరిస్థితుల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటన
- బొత్స ఎన్నిక ఇక లాంఛనప్రాయమే

10లో

■ ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?





శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కాళ్లు నుజ్జునుజ్జయిపోగా ప్రైవేట్ అంబులెన్స్‌లో అతడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. తీవ్ర రక్తస్రావమవుతున్నా పట్టించుకోకుండా రిమ్స్ వద్ద అంబులెన్స్‌లోనే బాధితుడిని అరగంటకు పైగా ఇలా వదిలేశారు.

రోగం తిరగబెట్టింది

కూటమి ప్రభుత్వ పాలనలో సర్కారు ఆస్పత్రులు.. మళ్లీ పాత రోజులు

- 'ప్రైవేట్'కు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించిన జీరో వేకెన్సీ విధానానికి తూట్లు
- వివిధ కారణాలతో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కాని దుస్థితి
- ఉద్దేశ పూర్వకంగా రెండు నెలల్లోనే అధ్వాన స్థితికి తీసుకొచ్చిన పెద్దలు
- నిర్వహణ గాలికొదిలేసి చోద్యం చూస్తున్న వైనం.. వెరసి ఆస్పత్రుల్లో వేధిస్తున్న మందులు, సర్జికల్స్ కొరత
- చిన్నపాటి మందుల కోసం చీటీ పట్టుకుని బయటకు పరుగులు
- డ్యూటీకి ఎవరొస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలియని దుస్థితి
- రోగుల బంధువులే అటెండర్ అవతారం ఎత్తాల్సిన పరిస్థితి
- రోగులకు విసుగు తెప్పించే కుతంత్రం

2లో

ప్రతి అడుగులోనూ మోసం

- ఎన్నికల్లో చంద్రబాబు ఎన్నెన్నో ఆశలు చూపి.. ఇప్పుడు మాట తప్పారు
- ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్.. మన ప్రభుత్వ హయాంలోనూ ఆర్థిక సంక్షోభం
- అయినా ఏనాడూ సాకులు చూపకుండా మేనిఫెస్టో అమలు చేశాం
- మనం చేసిన మంచి ఇవాళ్టికీ ప్రతి ఇంట్లో ఉంది

3లో



'జన్మభూమి 2'లో స్కూళ్ల అభివృద్ధి

- పాఠశాలల అభివృద్ధికి ముందుకొచ్చే వారిని ప్రోత్సహించండి
- సీఎం చంద్రబాబు

5లో

ఇంటి నుంచి తెచ్చుకున్న కుర్చీలోనే



ఇతని పేరు శ్రావణ్‌కుమార్. నెల్లూరు రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పేద వ్యక్తి. వయస్సు 60 ఏళ్లు పైబడి ఉన్నాయి. షుగర్ ఉండటంతో ఇన్‌ఫెక్షన్ వచ్చి నాలుగు నెలల క్రితం ఒక కాలుకు యాంపుటేషన్ (సర్జరీ చేసి మోకాలు వరకు తొలగించారు) చేశారు. నడవలేడు కనుక మూత్ర విసర్జనకు కెథీటర్ వేశారు. ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండాలంటే ఈ కెథీటర్‌ను వారం, లేదా పది రోజులకు ఒకమారు మార్చి కొత్తది వేయాలి. ఇలా మార్పించుకునేందుకు తరచూ పెద్దాస్పత్రిలోని ఎమర్జెన్సీ (క్యాజువాలిటీ)కి ఆటోలో వస్తాడు. ఇటీవల ఒకటి, రెండు దఫాలుగా వీల్ చైర్ దొరకలేదు. ఎండలో గంటకు పైగా ఉంచారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ఇంటి వద్ద నుంచే కుర్చీ తెచ్చుకున్నారు. దానిలోనే ఎమర్జెన్సీ వార్డు వద్దకు తీసుకెళ్తున్నారు. అక్కడ వారు గంటల కొద్దీ చూస్తే గాని కెథీటర్ మార్పు జరగ లేదు.

బిడ్డతో పాటు ఆక్సిజన్ సిలిండర్



నెల్లూరు నగరానికి చెందిన ఈ ఫొటోలోని పసిబిడ్డ పేరు హృతిక్‌నందన్. ఇతనికి మూడేళ్లు. తలలో గడ్డ ఉండటంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ నెల్లూరులోని పెద్దాస్పత్రిలో చిన్న పిల్లల వార్డులో చేర్చారు. ఆక్సిజన్ మీద వైద్యం పొందుతున్నాడు. ఇక్కడ వాంతులు కావడంతో డాక్టర్లు ఎంఆర్ఐ స్కానింగ్ రాశారు. పిల్లల వార్డు నుంచి ఎంఆర్ఐ తీసే చోటు కొంత దూరంలో ఉంది. దీంతో డాక్టర్ల సూచన మేరకు ఆ పసిబిడ్డ తండ్రి.. బిడ్డకు ఏర్పాటు చేసిన ఆక్సిజన్ సిలిండర్‌ను తోసుకుంటూ పరీక్షలకు తీసుకెళ్లాడు.

రోగం తిరగబెట్టింది

మునుపటికొకడు ఒక కుక్కపై కక్షగట్టి చంపాలనుకుని.. 'అది పిచ్చి కుక్క' అని అరిచాడట. పక్కనున్న వారందరూ తలో రాయి వేసి దానిని హతమార్చారట. ప్రభుత్వాసుపత్రులపై రాష్ట్ర ప్రభుత్వ తీరు అచ్చం అలానే ఉంది. రెండున్నర నెలల వరకు ప్రభుత్వాసుపత్రులంటే పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాల్లో అపార నమ్మకం కలిగేలా పనితీరు ఉండింది. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఉద్దేశ పూర్వకంగా వాటిని పతనావస్థకు తీసుకెళ్లేలా అడుగులు వేస్తోంది. ఒక్కో విభాగాన్ని నిర్వీర్యం చేస్తూ.. పేద రోగులకు వైద్య సేవలు సరిగా అందకుండా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. మందులు అయిపోయినా, సిబ్బంది సీట్లలో లేకపోయినా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రుల నిర్వహణను అంతకంటే ఎట్టించు కోవడం లేదు. క్రమంగా ప్రజల్లో దురభిప్రాయం కలిగేలా చేసి.. 'ప్రైవేట్'కు కట్టబెట్టాలన్నదే సర్కారు లక్ష్యం. రాష్ట్రంలో ఆ చివర ఉన్న అనంతపురం నుంచి ఈ చివరనున్న శ్రీకాకుళం వరకు కేవలం ఈ రెండు నెలల్లోనే ఏ ఆస్పత్రి నిర్వహణ చూసినా అస్తవ్యస్తంగా మారిపోవడమే ఇందుకు తార్కాణం. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' పరిశీలనలో వెల్లడైన వాస్తవమిది.

- కూటమి ప్రభుత్వ పాలనలో సర్కారు ఆస్పత్రుల్లో మళ్లీ పాత రోజులు
- 'ప్రైవేట్'కు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- ఉద్దేశ పూర్వకంగా రెండు నెలల్లోనే అధ్వాన స్థితికి తీసుకొచ్చిన పెద్దలు
- నిర్వహణ గాలికొదిలేసి చోద్యం చూస్తున్న వైనం
- రోగుల బంధువులే అటెండర్ అవతారం ఎత్తాల్సిన పరిస్థితి
- రాష్ట్ర వ్యాప్తంగా రోగులకు కన్నీళ్లు తెప్పించే కుతంత్రం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



విజయవాడ ప్రభుత్వాసుపత్రి ఓపీ వద్ద బారులుతీరిన రోగులు



ఏలూరులో తల్లి-బిడ్డ వార్డులో నడవలేక రోదిస్తూ స్కానింగ్‌కు వెళ్తున్న గర్భిణి భాగ్యశ్రీ



హిందూపురంలోని జిల్లా ఆస్పత్రి ఓపీ కౌంటర్ వద్ద రోగుల పడిగాపులు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్ : ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్ ఆస్పత్రులు, వ్యక్తులకు మేలు చేయాలన్న లక్ష్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని మారుస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు.. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవంటూ సీఎం చంద్రబాబు ప్రకటనలు చేస్తున్నారు. దానికి అనుగుణంగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ప్రభుత్వ వ్యవస్థలను తీసుకుని వెళ్లేలా ఆ పార్టీ నాయకులు లీకులు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే వైద్య శాఖలోని నూతన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ముందుకు తీసుకుని వెళతామని ఇప్పటికే ప్రకటించారు. అదే విధంగా 2014–19 తరహాలోనే టెలీమెడిసిన్, ల్యాబ్‌లు, ఇతర సేవలను ప్రైవేట్‌కు కట్టబెట్టి ప్రభుత్వ నిధులను లూటీ చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి కొరత లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించిన జీరో వేకెన్సీ విధానానికి కూటమి సర్కార్ ఇప్పటికే తిలోదకాలు ఇచ్చేసింది. గత ప్రభుత్వంలో సెకండరీ హెల్త్, బోధనాస్పత్రుల్లో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ఖాళీ అయిన వైద్య పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసేవారు. ఎన్నికలకు ముందు నియామకాలు దాదాపు పూర్తయిన పోస్టుల ప్రక్రియనూ కూటమి ప్రభుత్వం ఆపేసింది. నోటిఫికేషన్లను సైతం రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం నిరంతర నియామక ప్రక్రియకు ఇలా పుల్‌స్టాప్ పెట్టడంతో ఆస్పత్రుల్లో రోగుల సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంకో వైపు మందులు, సర్జికల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బోధనాస్పత్రులు, సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో కొరత నెలకొంది.

పలు చోట్ల గ్లౌజ్‌లు, సిరంజులకూ దిక్కులేదు

జిల్లా, బోధనాస్పత్రుల్లో 608 రకాల మందులు, 372 సర్జికల్స్, వ్యాధి నిర్ధారణ కిట్‌లు ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని జిల్లా, బోధనాస్పత్రుల్లో ఇందులో చాలా మందులు లేవు. విశాఖ కేజీహెచ్, గుంటూరు, కర్నూలు, విజయవాడ జీజీహెచ్, తదితర పెద్దాసుపత్రుల్లో సైతం 100 రకాల మందుల కొరత ఉంది. పాడేరు ఆస్పత్రిలో చాలా వ్యాధుల నివారణకు సంబంధించిన యాంటిబయాటిక్స్ మందులు లేవు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పంపిణీ కాకపోవడంతో రోగులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మందులనే పంపిణీ చేస్తున్నారు. చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో సిరంజులు కూడా బయటకు రాసిస్తున్నారు. రూ.30 నుంచి రూ.1000 విలువ చేసే మందుల వరకు చీటి రాసి బయటకు పంపుతున్నారు. చేసేది లేక చాలా మంది ప్రైవేటు మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో గ్లౌజ్‌ల కొరత ఉంది. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు చికిత్సలు, ఆపరేషన్‌ల సమయంలో కావలసిన కాటన్, ఐవీ క్యానల్, స్కానింగ్ జల్ కొరత ఉంది. కొన్ని రకాల సర్జికల్ వస్తువులు, రోజుకు రూ.5 వేలు లోపు వస్తువులను ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో రోగులు ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుగోలు చేసి తీసుకుని వచ్చి వైద్యులకు ఇస్తున్నారు. రెండు నెలల నుంచి ఫొంటాప్ ఇంజక్షన్‌లు లేవు. విజయవాడ జీజీహెచ్‌లో షుగర్ ఇన్‌ఫెక్షన్, నరాల సమస్య, గుండె జబ్బుల రోగులు బయట మందులు కొనుగోలు చేస్తున్నారు. కాంబినేషన్ మందులు, మల్టీ విటమిన్ మందులు దాదాపు పూర్తిగా బయటే కొనాల్సి వస్తోంది. ఇన్‌ఫెక్షన్ సోకిన రోగులకు హై యాంటిబయోటిక్ ఇంజక్షన్ అవసరమైన వారు బయట కొనుగోలు చేస్తున్నారు. ఖరీదైన ఆల్బుమిన్ ఇంజక్షన్‌లు, ఇన్‌పేషెంట్‌గా చేరి, డిశ్చార్జి అయిన రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేక పోవడంతో బయటకు రాస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 608 మందులకు గాను 566 మందులు రేట్ కాంట్రాక్ట్‌లో ఉన్న వాటిని రాష్ట్ర వ్యాప్తంగా 13 సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ ద్వారా ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సరఫరా చేసేవారు. తక్కువ వినియోగం ఉన్న మందులను డి-సెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా స్థానిక సరఫరాదారుల నుంచి నేరుగా ఆస్పత్రులకు అందించారు. ఇలా విలేజ్ క్లినిక్స్‌లో 105, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 200లకు పైగా, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో 362, బోధనాస్పత్రుల్లో 608 రకాల మందులను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సరఫరా చేసేవారు. ఈ ఏడాది రెండో క్వార్టర్‌కు సంబంధించి మందుల సరఫరాను కూటమి ప్రభుత్వం ఆలస్యంగా సరఫరా చేయడంతో ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో లేవు.

నోటిఫికేషన్లు రద్దుకు యత్నాలు

ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు, ఇతర ఆస్పత్రుల్లో ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి పారామెడికల్‌తో పాటు ఇతర పోస్టులను ఉమ్మడి 13 జిల్లాల్లో జిల్లాకు 200 నుంచి 250 చొప్పున భర్తీ చేయడానికి సార్వత్రిక ఎన్నికలకు ముందు నోటిఫికేషన్లు ఇచ్చారు. దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిశీలన, మెరిట్ జాబితాలను సిద్ధం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చేలోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఒక్క విజయనగరం జిల్లాలో మాత్రమే కోడ్ కంటే ముందే పోస్టుల భర్తీ పూర్తి చేశారు. మిగిలిన జిల్లాల్లో నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం మొత్తం నోటిఫికేషన్లను రద్దు చేయడానికి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనే అంశాన్ని వైద్య శాఖ పరిశీలిస్తోంది. గత ప్రభుత్వంలో వైద్య శాఖలో మానవ వనరుల కొరతకు తావు లేకుండా ఏకంగా 54 వేల పోస్టులను భర్తీ చేశారు. ప్రత్యేకంగా వైద్య శాఖ నియామకాల కోసమే రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' పరిశీలనలో

ఇదీ సంగతి



- శ్రీకాకుళంలోని రిమ్స్‌లో నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఆధార్‌కార్డులతో వచ్చినప్పటికీ సెల్‌ఫోన్ లేక ఓపీ రశీదు పొందలేకపోతున్నారు. కాళ్లావేళ్లా బతిమాలిడితే... ఎవరో ఒకరు స్పందించి కొందరికి ఓపీ ఇప్పిస్తున్నారు. ఫోన్లు లేని చాలా మంది వైద్యం పొందలేక ఇళ్లకు వెనుదిరిగారు. ఫ్యాన్లు, ఏసీలు, సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఐసీయూలో కూడా ఏసీలు పని చేయని దుస్థితి.

- రాజమహేంద్రవరం, ఒంగోలు, నంద్యాల, విశాఖ, బాపట్ల, చిత్తూరు, గుంటూరు, పాడేరు, విజయనగరం, నర్సరావుపేట, పార్వతీపురం, కాకినాడ, తిరుపతి రుయా ఆస్పత్రుల్లో పాలన అస్తవ్యస్తమైంది. నాలుగవ తరగతి సిబ్బందితో ఇబ్బందులెదురయ్యాయి. స్ట్రెచర్లు, వీల్ చైర్లు అందుబాటులో లేవు. చాలా చోట్ల ఈసీజీ, 2డీ ఎకో మిషన్లు మొరాయిస్తున్నాయి. రక్త పరీక్షల రిపోర్టుల కోసం రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. పారిశుధ్య లోపం బాగా ఇబ్బంది పెడుతోంది. బాత్‌రూంలు, మరుగుదొడ్లలో చాలా చోట్ల రన్నింగ్ వాటర్ లేదు. మంచి నీరు కూడా అందుబాటులో లేదు. ఆక్సిజన్ సిలెండర్లు సైతం బంధువులే మోసుకెళ్లారు. రెండు నెలలుగా మందుల సరఫరా నిలిచి పోయింది. మృతదేహాలు పెట్టేందుకు తగినన్ని ఫ్రీజర్లు లేవు. ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనం నాసిరకంగా ఉంది. నిధులు లేక శానిటేషన్ లోపం కనిపిస్తోంది. సెక్యూరిటీకి సైతం జీతాలు సక్రమంగా అందడం లేదు. వార్డుల్లోకి కోతులు, కుక్కలు చొరబడుతున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేవు. మహాప్రస్తానం వాహనాలు అందుబాటులో లేవు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే జనరేటర్ వేయడం లేదు. దోమలను అరికట్టలేక పోతున్నారు.

- ఏలూరు జీజీహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ కోసం రోగులు కనీసం 15, 20 రోజులు వేచి ఉండాల్సి వస్తోంది. వీల్ చైర్లు, స్ట్రెచర్లు సరిపడా లేవు. ఓపీకి వచ్చే రోగులు, వారి బంధువులు గంటల తరబడి బయట షెడ్ల కింద ఉండాల్సి వస్తోంది. కనీసం ఫ్యాన్లు కూడా లేవు. రెండు ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రైవేటు సంస్థ సరఫరా చేస్తున్న ఆక్సిజన్ ట్యాంకర్ నుంచి మాత్రమే రోగులకు ఆక్సిజన్ సరఫరా అవుతోంది.

- భీమవరంలో బాలింతల వార్డుల్లో ఏసీలు పని చేయడం లేదు. ఎక్స్‌రే, ఈసీజీ టెక్నీషియన్లు లేరు. రక్త పరీక్షల కోసం బయటకు వెళ్లాల్సి వస్తోంది. డెడ్ బాడీ ఫ్రీజర్లు దెబ్బ తిన్నాయి. స్కానింగ్ కోసం ఏలూరుకు రిఫర్ చేస్తున్నారు.
- కర్నూలు జీజీహెచ్‌లో ఒకటి, రెండు రకాల యాంటిబయాటిక్స్ మాత్రమే ఉన్నాయి. దళారులు, ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు ఆసుపత్రిలో బాహాటంగా తిరుగుతున్నారు. వార్డు బాయ్‌లు, స్ట్రెచర్ బాయ్‌లు లేక రోగుల కుటుంబీకులే ఆ పని చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది సగానికి సగం డ్యూటీలో కనిపించలేదు. కోతుల బెడద విపరీతంగా ఉంది. ఆసుపత్రిలో సైన్ బోర్డులు లేవు.
- హిందూపురం జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ మిషన్ చెడిపోయింది. మరమ్మతులు చేయలేదు. చాలా మంది రోగులను స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.
- అనంతపురం జీజీహెచ్‌లో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉంది. వార్డుల్లో బయోవేస్ట్ డబ్బాలు ఏర్పాటు చేయలేదు. మందుల కొరత ఉంది. రక్త పరీక్షల రిపోర్టుల్లో జాప్యం జరుగుతోంది. 160కి గాను 60 ఏసీలు మాత్రమే పని చేస్తున్నాయి. గైనిక్, ఎక్స్‌రే, రక్తనిధి వార్డుల్లో కరెంటు పోతే చిమ్మ చీకటే.



- కడపలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లోని ఐపీ, ఓపీ విభాగాల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఓపీ విభాగంలో కుర్చీలు, స్ట్రెచ్చర్లను మూలన పడేశారు. మెడికల్ ఐసీయూలో ఏసీలు పని చేయడం లేదు. పెడస్టల్ ఫ్యాన్లు పెట్టారు. ఎంఆర్ఐ, ఇతర ఓపీ విభాగాల్లోకి యథేచ్ఛగా కోతులు, కుక్కలు వస్తున్నాయి.

- అనకాపల్లిలో ఉదయం 10 గంటల నుంచి 11.45 గంటల వరకూ కరెంట్ లేదు. జనరేటర్ ఉన్నా, 10 నిమిషాల పాటు మాత్రమే పని చేసింది. ఎక్స్‌రే కోసం చాలా మంది ఇబ్బంది పడ్డారు. గర్భిణీలకు అల్ట్రా సౌండ్ స్కాన్ చేస్తున్నా.. రిపోర్టు ఇవ్వడం లేదు. తెల్ల పేపర్‌పై పెన్‌తో రాసి పంపిస్తున్నారు. సర్జికల్ గ్లౌజులు, కాటన్, ఐవి క్యానల్, స్కానింగ్ జల్ కొరత ఉంది. రోగులకు ఇచ్చే భోజనంలో నాణ్యత తగ్గింది.
- కృష్ణాజిల్లా మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో స్ట్రెక్చరు, వీల్‌చైర్స్ సరిపడా లేవు. ఉన్న వాటిలో బంధువులే తోసుకెళ్తున్నారు. బాగా పని చేస్తున్న వెంటిలేటర్లను గదుల్లో పెట్టి తాళాలు వేశారు. రోగులకు కనీసం బీపీ కూడా చూడటం లేదు.
- విజయవాడ జీజీహెచ్‌లో నాల్గవ తరగతి సిబ్బంది కొరత చాలా ఉంది. అవుట్‌పేషెంట్ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులే చూస్తున్నారు. ఓపీలో ఇన్‌పేషెంట్స్‌గా చేర్చిన వారిని మరుసటి రోజు పరీక్షించి మందులు రాస్తున్నారు. అత్యవసర కేసుల్లో వార్డుకు తరలించడానికి ఎక్కువ సమయం పడుతోంది.



ఆక్సిజన్ సిలెండర్‌ని తోసుకుంటూ వెళ్తున్న ఈమె పేరు శాంతి. గుండె జబ్బుతో బాధపడుతున్న అమ్మకు సీరియస్‌గా ఉందని మధురవాడ నుంచి 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకున్నారు. లోపలికి వెళ్లి త్వరగా క్యాజువాలిటీకి తీసుకెళ్లి వైద్యం అందించాలంటూ అక్కడున్న సిబ్బందిని వేడుకున్నారు. ఎవ్వరూ స్పందించలేదు. ఓ నర్స్ వచ్చి వివరాలు తీసుకున్నారు. వెంటనే ఆక్సిజన్ సిలిండర్‌ని ఇచ్చి.. శాంతి తీసుకొచ్చిన అమ్మ బాధ్యతని వార్డు బాయ్‌కి అప్పగించారు. నర్స్ అటు వెళ్లగానే.. సిలెండర్‌ని వార్డు బాయ్ శాంతి చేతికి ఇచ్చి.. నువ్వే తీసుకురావమ్మా అంటూ విసుక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. శాంతి ఆ సిలెండర్‌ని మోసుకుంటూ బయటికి వచ్చింది. తన కుటుంబ సభ్యులు, 108 వాహన సిబ్బంది సహాయంతో సిలెండర్‌ని తానే తోసుకుంటూ క్యాజువాలిటీకి అమ్మని తీసుకెళ్లింది. అరగంట నుంచి అడుగుతున్నా.. ఎవ్వరూ స్పందించలేదు.. అమ్మకి ఏదైనా అయితే.. ఎవరిది బాధ్యత సార్ అంటూ కన్నీటి పర్యంతమైంది.


ఇలాగైతే ఎలా?



నా బిడ్డ శ్రీవిద్యకు రెండ్రోజులుగా జ్వరం వస్తోంది. ఆత్మకూరులో అంతంత మాత్రంగానే చూస్తారని తెలిసి, అనంతపురం పెద్దాస్పత్రిలోనైతే బాగా వైద్యం అందిస్తారని ఇక్కడికి వచ్చాం. ఇక్కడ చూస్తే ఉదయం 10 గంటలైనా వైద్యులు రాలేదు. ఉదయం 8 గంటల నుంచి వేచి చూస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – ఆదినారాయణ, బి.యాలేరు, ఆత్మకూరు మండలం



ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో రోగులతో కిక్కిరిసిన ఓపీ కౌంటర్ ప్రాంతం



గుంటూరు జీజీహెచ్‌లో మందులు లేవని బయట కొనుక్కోవాలని చీటీలో రాసిన ఇంటూ మార్కులు



విశాఖ కేజీహెచ్‌లో బాలుడికి సెలైన్ పెట్టి తీసుకుని వస్తున్న బంధువులు



విజయవాడ జీజీహెచ్‌లో వద్ధురాలి దీనావస్థ ఇదీ..



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో బాలింత ఇంటి నుంచి తెచ్చుకున్న టేబుల్ ఫ్యాన్



కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులను ఆస్పత్రి లోపలికి తీసుకువెళుతున్న సిబ్బందికి సహకరిస్తున్న బంధువు



కడపలోని రిమ్స్‌లో స్కానింగ్ కోసం గంటల తరబడి వేచి ఉన్న గర్భిణులు

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం

ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అల్టిమేటం

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ బకాయిలు పెరిగిపోయి ఆస్పత్రుల నిర్వహణ కూడా కష్టంగా మారుతోందని, అందువల్ల ఈ నెల 15వ తేదీ నుంచి సేవలు నిలిపివేస్తామని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చాయి. సమస్యను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ఆరోగ్యశ్రీ సీఈవోకు మంగళవారం లేఖ రాసింది. ఆస్పత్రుల నిర్వహణకు నిధులు లేక సిబ్బంది జీతాల చెల్లింపు, మౌలిక సదుపాయాలు, మందులు, డిస్పోజబుల్స్ నిర్వహించడం కూడా కష్టతరంగా మారినట్టు పేర్కొంది. గత నెల 30న సీఈవోను కలిసి సమస్యల్ని వివరించినప్పటికీ ఎటువంటి కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు నుజ్జునుజ్జయిపోయిన ఓ క్షతగాత్రుడు ఆస్పత్రికి వస్తే.. గంట పాటు అతనికి వైద్యం అందించకుండా శ్రీకాకుళం రిమ్స్ వైద్యులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీనిపై బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రణస్థలం వద్ద యూబీ పరిశ్రమకు చెందిన కార్మికుడు పతివాడ సన్యాసినాయుడును మంగళవారం మధ్యాహ్నం లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో అతని రెండు కాళ్లు నుజ్జునుజ్జయిపోయాయి. మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రమాదం జరిగింది. సన్యాసినాయుడును యూబీ కంపెనీ అంబులెన్స్‌లో 2.55 గంటలకు శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువచ్చారు. అంబులెన్సు నుంచి అతడ్ని తీసుకెళ్లడానికి అరగంట వరకు ఎవరూ రాలేదు. 3.45 ప్రాంతంలో సిబ్బంది వచ్చి ప్రథమ చికిత్స మాత్రమే చేశారు.

క్లుప్తంగా...

అవినీతిపరులపై కఠిన చర్యలు: కొల్లు రవీంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: అవినీతిపరులపై చట్టపరమైన చర్యలుంటాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి జోగి రమేశ్ పెద్ద ఎత్తున దోపిడీ చేశారని ఆరోపించారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామన్న వారు ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. అగ్రిగోల్డ్ భూముల సర్వే నంబర్లు, సరిహద్దులు మార్చి కుటుంబ సభ్యుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని దుయ్యబట్టారు.

కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా: నాదెండ్ల



కాకినాడ సిటీ: గతంలో కాకినాడ పోర్టు ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరిగిందని, దీనివల్ల ఒకే కుటుంబం బాగుపడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తాము గతంలో చేసిన దాడుల్లో 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని, దీనిలో 26 వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యంగా తేలిందని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించినవారికి నోటీసులు ఇచ్చి త్వరలోనే వారిని అరెస్టు చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ పోర్టు రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. గతంలో ఏవిధంగా లారీలు పోర్టుకు వచ్చాయో అదేవిధంగా రోజూ 10వేల మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు.

ఆస్పత్రుల్లో వనరుల కల్పనకు ముందుకు రావాలి
మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో వనరుల కల్పనకు దాతలు ముందుకు రావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఐలు, కార్పొరేట్ కంపెనీలు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి చేయూతనివ్వాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్‌లతో ఆయన సమీక్షించారు. బోధనాస్పత్రుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. సమయపాలన పాటించాలని వైద్యులను ఆదేశించారు. 54 మహాప్రస్థానం వాహనాలు ఉండగా, మరో 30 వాహనాల్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అరగంటలో రోగుల ఓపీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల ట్రిబ్యునల్‌కు వెళ్లండి
గ్లాసు గుర్తుపై పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఎన్నికల గుర్తులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ట్రిబ్యునల్ ముందే సవాల్ చేసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇందులో తాము జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గాజు గ్లాసు గుర్తు కేటాయింపు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ, దళిత బహుజన పార్టీ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై జోక్యానికి నిరాకరించారు. గాజు గ్లాసు గుర్తింపు కేటాయింపులో అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలంటూ పిటిషన్లు కొట్టేశారు.

ప్రతి జిల్లా ఏడాదికి 15శాతం వృద్ధి సాధించాలి
వికసిత్ ఆంధ్రప్రదేశ్–2047 లక్ష్యాలపై వర్క్‌షాప్‌లో అనంత శంకర్

సాక్షి, అమరావతి: వికసిత్ ఆంధ్రప్రదేశ్–2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లా సంవత్సరానికి 15 శాతం వృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో 2029 నాటికి రాష్ట్రం పురోగతిపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా జిల్లాల అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. అన్ని జిల్లాల చీఫ్ ప్లానింగ్ అధికారులు, సహాయ గణాంక అధికారులతో మంగళవారం సచివాలయంలో 'వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047' అంశంపై రాష్ట్ర ప్రణాళిక శాఖ వర్క్‌షాప్ నిర్వహించింది. 'వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047' పై ప్రణాళిక శాఖ 2024–29 సంవత్సరాలకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ముసాయిదా విజన్ డాక్యుమెంట్ గురించి అనంత శంకర్ వివరించారు. వికసిత్ భారత్–2047 ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆర్థిక పురోగతి సాధించడమే నీతి ఆయోగ్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, ప్రాథమిక రంగం, రెవెన్యూ ఆధారిత అభివృద్ధి, రాష్ట్ర పరిస్థితులు, ప్రాముఖ్యతలను పరిగణనలోకి తీసుకుని స్థూల నుంచి సూక్ష్మ విధానాన్ని అవలంబిస్తూ విస్తృత లక్ష్యాలను గుర్తించి, వాటిని సాధించడమే నీతి ఆయోగ్ ప్రధాన ఉద్దేశమని ఈ ముసాయిదాలో ప్రస్తావించారు.



సమావేశానికి హాజరైన అనకాపల్లి నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రతినిధులు



మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సమావేశానికి హాజరైన మాడుగుల నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రతినిధులు

ప్రతి అడుగులోనూ మోసం

- చంద్రబాబు హామీలు అమలు చేయకుండా సాకులు చెబుతున్నారు
- రెండున్నర నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది
- విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడాల్సి వస్తోంది
- ఈ–క్రాప్, ఉచిత పంటల బీమా ఎత్తేశారు..
- పూర్తిగా క్షీణించిన శాంతి భద్రతలు.. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచుతున్నారు
- ఏదీ శాశ్వతం కాదు.. చీకటి తర్వాత వెలుతురు తప్పదు
- మనం తప్పకుండా అధికారంలోకి వస్తాం.. మీరూ నేనూ కలిసి సేవ చేస్తాం
- ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

> మళ్లీ మన పార్టీ ఘన విజయం సాధిస్తుంది. ఎందుకంటే మనం ఎవరినీ మోసం చేయలేదు. ఎలాంటి అబద్ధాలు చెప్పలేదు. రెండు నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతో వ్యతిరేకత వచ్చింది. ఈ ఐదేళ్లలో వేధింపులకు గురి చేస్తారు. కష్టాలు కూడా ఉంటాయి. నా పరిస్థితులే దీనికి ఉదాహరణ. నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. అటువంటి కష్టాలు నేను చూశాను. కానీ కష్టాలు ఎల్లకాలం ఉండవు. చీకటి తర్వాత వెలుతురు కచ్చితంగా వస్తుంది. రాత్రి తర్వాత పగలు వస్తుంది. ఇది సృష్టి సహజం. అలాగే ఈ ఐదేళ్లు కూడా ముగుస్తాయి. మనం మళ్లీ అధికారంలోకి వస్తాం. మన ప్రభుత్వంలో మళ్లీ మీరు, నేను ప్రజలకు సేవ చేసే గొప్ప పరిస్థితుల్లో ఉంటాం. ఇది కచ్చితంగా అందరూ గుర్తు పెట్టుకోండి.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబునాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులోనూ మోసమే కన్పిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నెన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిలో ఏవీ అమలు చేయకుండా, ఏవేవో కారణాలు చెబుతూ సాకులు చూపుతున్నారని ఎత్తి చూపారు. అది చంద్రబాబు నైజమని, మోసం చేయడం ఆయనకు ఎప్పుడూ అలవాటేనని గుర్తు చేశారు. మోసాలకు, అబద్ధాలకు చంద్రబాబు, టీడీపీ అలవాటు పడ్డారని.. అదే మనం విలువలు, విశ్వసనీయత మీదే రాజకీయాలు చేస్తున్నామని.. అందుకే మనకు తప్పక మంచి రోజులు వస్తాయని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఉద్బోధించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తొలుత మాడుగుల, ఆ తర్వాత అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంక్షోభం ఎంతగా ఉన్నప్పటికీ సాకులు చూపలేదన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి, మాట తప్పకుండా అమలు చేశామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట కోసం కట్టుబడి పని చేశామన్నారు. 'కోవిడ్ మహమ్మారి రెండేళ్ల రాష్ట్రాన్ని పీడించినా, పథకాలు దాటేయాలని ఆలోచించలేదు. క్యాలెండర్ ప్రకటించి అన్నీ అమలు చేశాం. అలా అన్నీ చేశాం కాబట్టే.. ఇవాళ్టికి కూడా మన పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త తలెత్తుకుని ధైర్యంగా ప్రతి గ్రామానికీ పోగలుగుతాడు. మనం చేసిన మంచి ప్రతి ఇంట్లో ఉంది. ఆ ధైర్యం చంద్రబాబులో, ఆయన పార్టీలో కనిపించదు. ఎందుకంటే, ఓట్లు అడిగేటప్పుడు నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు సంతోషమా? అంటూ ప్రచారం చేశారు. యువకులు కనిపిస్తే.. నీకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అన్నారు. ఇలా ఎవరు కనిపిస్తే వారికి వాగ్దానాలు చేశారు' అని చెప్పారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

జగన్ ఉండి ఉంటే..

ఇప్పుడు అదే జగన్ ఉండి ఉంటే.. ఈ పాటికి రైతు భరోసా అందేది. ఆ డబ్బులతో రైతులందరూ చక్కగా వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవారు. స్కూళ్లకు వెళ్తున్న పిల్లల తల్లులకు అమ్మ ఒడి అందేది. అక్కచెల్లెమ్మల ముఖంలో చిరునవ్వు కనిపించేది. వారికి సున్నా వడ్డీ ప్రయోజనం అంది ఉండేది. విద్యాదీవెన కింద ప్రతి పిల్లాడికి మూడు నెలలకోసారి ఆర్థిక సాయం అందేది. వసతి దీవెన వచ్చేది. మత్స్యకార భరోసా, వాహన మిత్ర కూడా వచ్చి ఉండేవి. చేనేతలకు నేతన్న నేస్తం కూడా ఇప్పటికే జమ అయి ఉండేది. ఇంకా రైతులకు ఉచిత పంటల బీమా అమలై ఉండేది. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఆ ప్రీమియం కట్టడం లేదు. గతంలో ఏప్రిల్, మేలో ప్రీమియం కట్టేవాళ్లం. జూన్‌లో వ్యవసాయ పనులు మొదలయ్యేసరికి ఇన్స్యూరెన్స్ డబ్బులు, రైతు భరోసా డబ్బులు ఇచ్చేవాళ్లం. పెట్టుబడులకు రైతులకు సహాయంగా ఉండేది. ఇప్పుడు అదీ పోయింది. అవేవీ ఇవ్వకుండా చంద్రబాబు ఇప్పుడు మోసం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ప్రతి అడుగులో మోసం కనిపిస్తోంది. జన్మభూమి కమిటీల చుట్టూ, టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఇవన్నీ రెండు నెలల్లోనే కనిపిస్తున్నాయి.

ఇప్పటికే ప్రభుత్వంపై వ్యతిరేకత

జగన్ బాగానే చూసుకున్నాడు. జగన్ కన్నా చంద్రబాబు వయసులో పెద్దవాడు కదా.. జగన్ పలావు పెట్టాడంటే చంద్రబాబు బిర్యానీ పెడతాడేమో అని ప్రజలందరూ కాస్తో కూస్తో మోసపోయి అటు వైపు వెళ్లారు. కేవలం రెండున్నర నెలల్లోనే ప్రభుత్వం మీద ఇంత వ్యతిరేకత కనిపిస్తోంది. ఇంటికే వచ్చే పెన్షన్ విధానం పోయింది. ఇంటికే వచ్చే రేషన్ విధానం పోయింది. మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చాయి. విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడాల్సి వస్తోంది. ఈ–క్రాప్, ఉచిత పంటల బీమా పోయింది. శాంతి భద్రతలు నీరుగారిపోయాయి. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచుతున్నారు. చేసిన మంచి ఎక్కడికీ పోదు. మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి ఈ మంచే మనకు శ్రీరామ రక్ష. చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారి తీస్తాయి. ఎందుకంటే ప్రజలకు ఇప్పుడు పలావు లేదు. బిర్యానీ లేదు. పస్తులుండాల్సిన పరిస్థితి.

విద్యా వ్యవస్థ దారుణం

ప్రభుత్వ బడుల్లో టోఫెల్ పీరియడ్ తీసేశారు. పిల్లలందరూ గొప్పగా ఇంగ్లిష్ చదువుకుని ఏకంగా ప్రపంచంతో పోటీ పడేలా చదువుకుంటున్న పరిస్థితులను.. కూటమి ప్రభుత్వం రాగానే నిర్వీర్యం చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం చదువులు అటకెక్కే పరిస్థితి ఉంది. విద్యాకానుక పంపిణీ కూడా అస్తవ్యస్తం. ట్యాబ్‌లు ఇస్తారన్న నమ్మకం లేదు. గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) మెనూ కూడా అస్తవ్యస్తంగా మారింది. ఆరోగ్యశ్రీ కింద ఒక్క పైసా ఇవ్వడం లేదు. ఇప్పటికే రూ.1600 కోట్ల బకాయిలు ఉన్నాయి. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో.. బిల్లులు ఆపాల్సి వచ్చింది. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్యశ్రీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పరిపాలన, ఇంటికే అందే డెలివరీ మెకానిజమ్‌తో పాటు, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఏకంగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. కక్షలు తీర్చుకునే వారిని ప్రోత్సహించేలా చంద్రబాబు తీరు ఉంది. ఈ మోసాలు చూస్తున్న ప్రజల్లో ఆగ్రహం మొదలవుతోంది.

మెడికల్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ కోటా
జీవో నిలిపివేత

జీవో–94 అమలు విషయంలో ఏరకంగానూ ముందుకెళ్లవద్దన్న హైకోర్టు

- ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు
- కన్వీనర్ కోటా సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ కోటా ఇవ్వడం చెల్లదంటూ పిటిషన్
- ఉన్న సీట్లలోనే 10 శాతం 'ఈడబ్ల్యూఎస్' సరికాదని అభిప్రాయపడ్డ హైకోర్టు
- మధ్యంతర ఉత్తర్వులు జారీ.. కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ కాలేజీలు మినహా అన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద జనరల్ కేటగిరిలో భర్తీ చేసే మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను ఆర్థిక బలహీన వర్గాలు (ఈడబ్ల్యూఎస్)కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న జారీ చేసిన జీవో 94 అమలును హైకోర్టు నిలిపేసింది. ఈ జీవో అమలు విషయంలో ఏ రకంగానూ ముందుకెళ్లవద్దంది. ఈ జీవో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే ఉన్న సీట్లలో కాకుండా దామాషా ప్రకారం సీట్ల సంఖ్యను పెంచి, అందులో కేటాయించాల్సి ఉంటుందన్న పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనతో హైకోర్టు ప్రాథమికంగా ఏకీభవించింది. జీవో 94 విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, ఎన్ఎంసీ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం తదితరులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అది రాజ్యాంగ విరుద్ధం..

సీట్ల సంఖ్య పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అందువల్ల తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 94ని రద్దు చేయాలని కోరుతూ విజయనగరం జిల్లాకు చెందిన పోగిరి చరిష్మా, గుంటూరు జిల్లాకు చెందిన అప్పారి సాయి వెంకట ఆదిత్య, యమవరపు మృదులత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది యరగొర్ల ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ, ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయాలనుకుంటే ఎన్ఎంసీ అనుమతి తీసుకుని దామాషా ప్రకారం సీట్ల సంఖ్యను పెంచుకోవచ్చునన్నారు. సీట్ల సంఖ్యను పెంచకుండా, ఉన్న సీట్లలో 10 శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్ కింద భర్తీ చేయడానికి వీల్లేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కన్వీనర్ కోటా కింద ఉన్న మొత్తం సీట్లలోనే 10 శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్‌కు కేటాయిస్తూ జీవో 94 జారీ చేసిందన్నారు. దీనివల్ల జనరల్ కోటా సీట్లలో 10 శాతం సీట్లు తగ్గుతాయన్నారు. దీంతో పిటిషనర్ల వంటి వారు ఎంతో మంది నష్టపోతున్నారని తెలిపారు. జనహిత్ అభియాన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా జీవో 94 ఉందన్నారు. అసలు ఈ జీవో రహస్యంగా ఉందని, ఇప్పటి వరకు ప్రజా బాహుళ్యంలోకి తీసుకురాలేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, ఈ జీవో వల్ల పిటిషనర్లకు నష్టం జరుగుతుందని భావిస్తున్నారా? వారి అవకాశాలను ఈ జీవో దెబ్బతీస్తుందా? అని ప్రశ్నించింది. అవునని, పిటిషనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఠాగూర్ యాదవ్ తెలిపారు.

ఎన్ఎంసీ ఉత్తర్వుల ప్రకారమే జీవో..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ, ప్రైవేటు కాలేజీల్లో సీట్లు పెంచేది లేదని ఎన్ఎంసీ తెలిపిందని, ఎన్ఎంసీ ఉత్తర్వుల ప్రకారమే తాము జీవో ఇచ్చామన్నారు. పిటిషనర్లు కావాలంటే ఎన్ఎంసీ ఉత్తర్వులను సవాలు చేసుకోవాలన్నారు. ఈ సమయంలో ఠాగూర్ యాదవ్ జోక్యం చేసుకుంటూ, నిర్దేశించిన విధంగా మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేటు కాలేజీల అదనపు సీట్ల అభ్యర్థనను ఎన్ఎంసీ అధికారులు తోసిపుచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజా జీవో వల్ల ఓపెన్ కేటగిరిలో సీట్లు తగ్గిపోయాయన్నారు.

సౌకర్యాలుంటేనే అదనపు సీట్లు..

ఎన్ఎంసీ తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ స్పందిస్తూ, ఈడబ్ల్యూఎస్‌ను తాము తిరస్కరించడం లేదన్నారు. మౌలిక సౌకర్యాలున్న కాలేజీలకు అదనపు సీట్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ కాలేజీలకు పలుమార్లు చెప్పామన్నారు. సౌకర్యాలు లేకుండా అదనపు సీట్లు ఇవ్వలేమన్నారు. దామాషా ప్రకారం 50 అదనపు సీట్లు ఇచ్చే అధికారం తమకు ఉందన్నారు. కేవలం 10 శాతం సీట్లే పెంచితే మిగిలిన వర్గాలు నష్టపోతాయని, అందువల్ల అదనంగా 50 సీట్లు ఇస్తామన్నారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం జీవో 94పై స్టే విధిస్తున్నామని చెప్పింది. కొంత గడువిస్తే పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామన్న ప్రణతి అభ్యర్థనను తోసిపుచ్చింది. కన్వీనర్ కోటాలోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు సరికాదంది. ఈ దశలో జీవో 94 అమలుకు అనుమతినిస్తే గందరగోళ పరిస్థితులు నెలకొంటాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అదనపు సీట్లు కావాలంటే సౌకర్యాలన్నీ మెరుగుపరచుకోవాలని ప్రైవేటు కాలేజీలపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని పేర్కొంది.

ఈడబ్ల్యూఎస్ కోటా జీవో నిలుపుదలపై హర్షం
ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్



డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా జీవోను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడంపై ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ.. గతంలో జీవో 94ని వ్యతిరేకించామని, హైకోర్టు జీవోను నిలుపుదల చేయటాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. దీని వల్ల ఎంతో మంది ఈబీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. హైకోర్టులో కేసు దాఖలు చేసిన విద్యార్థులను అభినందించారు. హైకోర్టు న్యాయవాది ఠాగూర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ వ్యతిరేకం కాదన్నారు.

కూటమి రాకతో విద్యారంగం తిరోగమనం

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్
- ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ ఎత్తేయడం దారుణం



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగం తిరోగమనం బాట పట్టిందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. సర్దుబాట్లు సాకు చెబుతూ, విద్యా రంగం ప్రక్షాళన అంటూ, సంస్కరణలు చేస్తామంటూ రకరకాలుగా మాట్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఒక్కో పథకాన్ని ఓ పద్ధతి ప్రకారం ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టోఫెల్ శిక్షణ రద్దు, ఇంగ్లిష్ మీడియం ఎత్తేసే కార్యక్రమంపై ప్రభుత్వ పెద్దల మాటలు చూస్తుంటే విద్యా రంగం అస్తవ్యస్తం అవుతోందన్న విషయం స్పష్టమవుతోందన్నారు. నాడు వైఎస్ జగన్ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఆ రంగంపై ఏకంగా రూ. 73 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దితే, దానిపైనా ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఇవన్నీ చూస్తుంటే, ఈ ప్రభుత్వం జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ) అనుకూలమా? వ్యతిరేకమా? అన్న అనుమానం కలుగుతోందన్న సురేష్.. అసలు ఆ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తారా? లేదా? చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 2019–20లోనే అమ్మఒడి అమలు చేశామని మాజీమంత్రి గుర్తుచేశారు. అదే ఈ ప్రభుత్వం, ఈ ఏడాది తల్లికి వందనం కేటాయింపులు చేయడానికి కూడా జంకుతోందన్నారు. నారాయణ, చైతన్య స్కూళ్లపై ప్రభుత్వ పెద్దలకు ప్రేమ ఉండొచ్చని, పీపీపీపైనా మోజు ఉండొచ్చని, కానీ విద్యా రంగంలో వాటిని తీసుకురావొద్దని హితవు పలికారు.

దళిత మహిళకు న్యాయం చేస్తాం

- బాధితురాలికి మంత్రి అనగాని హామీ
- సాక్షి కథనానికి స్పందన



కేసు వివరాలు అందజేస్తున్న బాధితురాలు

నరసరావుపేట రూరల్: అగ్రవర్ణాలకు చెందిన వారు తన భూమిని ఆక్రమించారంటూ మండలంలోని అల్లూరివారిపాలెంలో దళిత మహిళ గొట్టిముక్కల సుజాత చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం స్పందించారు. రెవెన్యూ, పోలీసు అధికారులను బాధితుల వద్దకు వెళ్లి చర్చించాలని ఆదేశించారు. అల్లూరివారిపాలెంలోని తన పొలంలో దీక్ష చేస్తున్న సుజాత కుటుంబసభ్యుల వద్దకు తహశీల్దార్ వేణుగోపాల్, రూరల్ ఎస్ఐ కిశోర్ వెళ్లి బాధితురాలితో మాట్లాడి దీక్షను విరమింపజేశారు. అనంతరం మంత్రి అనగానితో బాధితురాలు ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమణకు గురైన భూమికి సంబంధించిన డాక్యుమెంట్లతో తనని కలవాలని ఆయన సూచించారు. దీంతో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ మంత్రిని సుజాత కలిసి ఆక్రమణకు గురైన భూమి వివరాలను తెలియజేశారు. విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

తుంగభద్ర డ్యాంను సందర్శించిన కర్ణాటక సీఎం

19వ గేటును పునరుద్ధరిస్తామని హామీ



మాట్లాడుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

సాక్షి, బళ్లారి: తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏపీ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు మంగళవారం టీబీ డ్యాంను సందర్శించారు. గేటు గల్లంతైన ఘటనపై బోర్డు అధికారులను ఆరా తీశారు. వీలైనంత త్వరగా క్రస్ట్‌గేటును పునరుద్ధరించాలని కోరారు. అంతకుముందు.. ఏపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు డ్యాంను సందర్శించి వైకుంఠం అతిథిగృహం వైపు నుంచి క్రస్ట్ గేటును పరిశీలించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కొప్పళ జిల్లా మునిరాబాద్ వైపు నుంచి డ్యాం వద్దకు చేరుకుని క్రస్ట్ గేటు ప్రాంతాన్ని సందర్శించారు. నూతన క్రస్ట్‌గేటు ఏర్పాటు, సాంకేతిక సమస్యలు తదితర విషయాలపై నిపుణులతో చర్చించారు. గేట్ల తయారీలో నిపుణుడైన కన్నయ్య నాయుడుతో కర్ణాటక సీఎం, ఏపీ మంత్రులు చర్చించారు.

టీడీపీ గూండాల అరాచకం
వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం



బుడ్డన్న వీపుపై తీవ్రగాయాలు

సి.బెళగల్: కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆటో బుడ్డన్నను హత్య చేసేందుకు తెగబడ్డారు. పక్కా ప్లాన్ ప్రకారం పట్టుడు కర్రలు, ఇనుప రాడ్లతో హత్యాయత్నం చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఇద్దరిని చితకబాదారు. తీవ్రగాయాలతో బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బుడ్డన్న మంగళవారం బహిర్భూమికి ఊరి చివరనున్న వంక వద్దకు ఒంటరిగా వెళ్లాడు. గమనించిన టీడీపీ నేతలు కుమార్, వీరేష్, శివకృష్ణ, అరవిందు, హరికృష్ణ, కిష్టన్న, రాజు దాడి పథకం ప్రకారం చుట్టుముట్టారు. వెంట తెచ్చుకున్న పట్టుడు కర్రలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా చితకబాదారు. వీపుపై తీవ్రంగా కొట్టడంతో పాటు కాళ్లు, చేతులు, మెడపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ బుడ్డన్న కాసేపటికి తేరుకుని అతికష్టం మీద ఇంటికి చేరుకున్నారు. అలాగే బుడ్డన్న కుటుంబసభ్యులు పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా టీడీపీ గూండాలు వెళ్లి ఆయన కుమారుడు వినయ్, మామ గుడప మద్దిలేటిపై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబసభ్యులు క్షతగాత్రులను సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ ఫిర్యాదు అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్‌తో వైఎస్సార్‌సీపీ బృందం భేటీ

సాక్షి, అమరావతి: విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనంలో సామాజిక న్యాయ మహాశిల్పాన్ని విధ్వంసం చేసేందుకు బరితెగించిన వైనంపై బుధవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ బృందం ఫిర్యాదు చేయనుంది. ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కూడిన బృందం ఈ ఘటనపై కమిషన్‌కు వివరించనుంది. సామాజిక న్యాయ మహాశిల్పంపై జరిగిన దాడిపై విచారణ చేసి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరనుంది.

శాస్త్రవేత్తలే రియల్ హీరోలు: పవన్



సూళ్లూరుపేట: తాను కేవలం సినిమాల్లో మాత్రమే హీరో నని.. నిజమైన హీరోలు శాస్త్రవేత్తలు మాత్రమేనని డిప్యూటీ సీఎం (పంచాయతీరాజ్, సైన్స్ టెక్నాలజీ, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి) కె.పవన్‌కళ్యాణ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని షార్ కేంద్రంలోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం నిర్మాణం ఒక అద్భుతమని, ఒకవైపు సముద్రం మరోవైపు పులికాట్ సరస్సుకు మధ్యలో ఉన్న దీవి ప్రాంతంలో పర్యావరణాన్ని పాడు చేయకుండా చెట్లను పెంచుతూనే రాకెట్ ప్రయోగాలు నిర్వహించడం మహా అద్భుతమన్నారు. మంగళయాన్ ప్రయోగాన్ని నిర్వహించడం అద్వితీయమన్నారు. ఈ సందర్భంగా 'షార్ నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్ (ఎస్ఎన్‌డీసీ–2024) గ్లింప్సెస్' వీడియోను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు పవన్ బహుమతులు ప్రదానం చేశారు.



'నేను', 'నాది' అనే భావనను విడిచిపెట్టడం ద్వారా వెతుకులాట లేని నిజమైన సంతోషాన్ని పొందగలం.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 14 ఆగస్టు 2024

సీబీఐ దర్యాప్తే సరైంది!

దేశవ్యాప్తంగా వైద్యవర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు రగిల్చిన కోల్‌కతా వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రి ఉదంతంపై సీబీఐ దర్యాప్తునకు కోల్‌కతా హైకోర్టు మంగళవారం ఆదేశాలివ్వటం అన్ని విధాలా సబబైనది. జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న పీజీ విద్యార్థిని మొన్న శుక్రవారం వేకువ జామున ఒక దుండగుడి అఘాయిత్యానికి బలైంది. ఈ కేసు విషయంలో గత అయిదురోజులుగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో సందేహాలు తీర్చకపోగా... మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. దుండగుడిని అరెస్టు చేశామంటున్న పోలీసుల ప్రకటనపై అటు మెడికో కుటుంబ సభ్యులు, ఇటు వైద్య విద్యార్థులు, సిబ్బంది సంతృప్తి చెందలేదు. హత్య, అత్యాచారం ఉదంతంలో కచ్చితంగా ఇతరుల ప్రమేయం ఉందని మొత్తుకున్నారు. కానీ పోలీసులు పట్టనట్టే ఉన్నారు. అసలు ఆస్పత్రి పాలకవర్గం, లేదా ప్రిన్సిపాల్ ఇంతవరకూ ఈ ఉదంతంలో ఫిర్యాదు దాఖలు చేయలేదు. కనీసం వారిని పిలిచి ప్రశ్నించినవారూ లేరు. ఆరు రోజుల్లో... అంటే వచ్చే ఆదివారంలోగా నిగ్గు తేల్చకపోతే కేసును సీబీఐకి అప్పగిస్తానని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. కానీ హైకోర్టు భిన్నంగా ఆలోచించింది. ఇందులో జాప్యం జరిగినకొద్దీ సాక్ష్యాధారాలు మాయమవుతాయని, దోషులు తప్పించుకునే అవకాశం ఉన్నదని భావించింది.

కొన్ని నేరాలు సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తాయి. మనుషులుగా అసలు మన ఉనికిపైనే సందేహం రేకెత్తిస్తాయి. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం దేశరాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న నిర్భయ ఉదంతం అటువంటిదే! ప్రజలంతా ఉద్యమించిన పర్యవసానంగా ఆ విషయంలో నాటి కేంద్ర ప్రభుత్వం చురుగ్గా కదిలి కఠినమైన చట్టాన్ని తీసుకొచ్చింది. నేరగాళ్లకు ఉరితో సహా కఠినశిక్షలు అమలుచేసింది. కానీ ఆ తర్వాత కూడా నేరాలు తగ్గలేదు. దీనికి కారణం కేవలం ప్రభుత్వాల అలసత్వం మాత్రమే! నేరగాళ్లను వెనువెంటనే శిక్షించేలా పకడ్బందీ దర్యాప్తు జరగకపోవటం అన్ని చోట్లా కనబడుతోంది. కేవలం చట్టాలు మాత్రమే సరిపోవనీ, వాటిపై అవగాహన కల్పించి, ఆపత్కాలంలో మహిళలు తక్షణం ఆశ్రయించే సదుపాయం అమల్లోకి తేవాలని ప్రభుత్వాలు అనుకోలేదు. తెలంగాణలో షీ టీమ్స్ అయినా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ యాప్, దిశ చట్టమైనా మహిళలకు ఎంతో తోడ్పాటుగా నిలిచాయి. ముఖ్యంగా ఏపీలో దిశ యాప్ వల్ల నేరాలను నివారించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కోల్‌కతా ఆస్పత్రిలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒకపక్క దేశవ్యాప్తంగా లైంగిక నేరాలు పెరిగాయని తెలుస్తూనే ఉన్నా మహిళా సిబ్బంది భద్రతకూ, రక్షణకూ ఆస్పత్రి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అక్కడి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. నేరగాడు సంజయ్ రాయ్ పోలీస్ వలంటీర్‌గా ఉంటూ ఆస్పత్రిలో ఎక్కడికైనా యథేచ్ఛగా వెళ్తాడని అందరూ చెబుతున్న మాట. ఆఖరికి మహిళా వైద్య సిబ్బంది విశ్రాంతి తీసుకునే ప్రాంతానికి కూడా నిశిరాత్రి అతగాడు వెళ్లగలిగాడంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ జూనియర్ డాక్టర్ 36 గంటలు అవిశ్రాంతంగా రోగులకు సేవలందించి అలసి నిదిరిస్తున్న వేళ నేరగాడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తోటి సిబ్బంది అంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు సేవలందించటానికి నమోదు చేసుకున్న నేరగాడికి ఆస్పత్రిలో సంచరించే స్వేచ్ఛ ఎవరిచ్చారో తేలాల్సివుంది. గర్భిణి అయిన భార్యను హింసించిన ఉదంతంలో వచ్చిన ఫిర్యాదుపై రెండేళ్లుగా పోలీసులు పట్టించుకోలేదంటే అతగాడి పలుకుబడిని అంచనావేయొచ్చు. అప్పుడే చర్య తీసుకుంటే ఈ ఘోరం జరిగేదా? తమ కుటుంబాల్లో వైద్య అవసరాలున్నప్పుడల్లా ఆస్పత్రిలో అన్నీ అందేలా చూస్తున్నాడన్న ఏకైక కారణంతో పోలీసులు అతడిని చూసీచూడనట్టు వదిలేశారని చాలామంది చెబుతున్న మాట. తాము తీసుకున్న వలంటీర్ల నడవడి ఎలావుంటున్నదో, వారిని కొనసాగించాలో లేదో సమీక్షించుకునే సంస్కృతి లేకపోవటం ఎటువంటి ఘోరాలకూ, నేరాలకూ దారితీస్తుందో అంచనా వేయలేనంత స్థితిలో పోలీసులుండటం ఆశ్చర్యకరం. నిజానికి లోతైన దర్యాప్తు జరిగితే తమ లోపాలు కూడా బయటపడతాయన్న ఏకైక కారణంతోనే గత అయిదురోజులుగా కోల్‌కతా పోలీసులు దర్యాప్తు డ్రామా కొనసాగిస్తున్నారనుకోవాలి.

చదువు పూర్తయ్యాక ఇతర రంగాల్లో వెనువెంటనే స్థిరపడే అవకాశం ఉన్నా దాన్ని కాదనుకుని పలువురు విద్యార్థులు ఎన్నో సవాళ్లతో కూడిన, దీర్ఘకాలం పట్టే వైద్యవిద్యకు మొగ్గుచూపుతారు. సమాజం పట్లా, మనుషుల పట్లా ఎంతో సేవాభావం, ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యంకాదు. కానీ అలాంటివారికి ఆ రంగంలో సరైన గౌరవ మర్యాదలు లభిస్తున్నాయా? వారి భద్రతకు సక్రమమైన చర్యలు తీసుకుంటున్నారా? ఈ విషయంలో జూనియర్ డాక్టర్లు తరచు చెప్పే అంశాలు అంత సంతృప్తికరంగా లేవు. వారి శ్రమకు తగ్గ వేతనాలు అందవు. అవి కూడా నిర్దిష్ట సమయానికి రాని దుఃస్థితి చాలాచోట్ల ఉంటున్నది. వేళకాని వేళల్లో సైతం అవిశ్రాంతంగా పనిచేసేవారికి కనీసం కాసేపయినా భద్రంగా నిద్రపోయే సౌకర్యం ఆస్పత్రి పాలకవర్గం కల్పించలేకపోయిందంటే, ఆ విషయంలో సీనియర్లు శ్రద్ధ పెట్టలేదంటే ఏమనుకోవాలి? పెత్తనం చలాయించటానికి ఉబలాటపడేవారు తాము కూడా ఒకప్పుడు జూనియర్లమనీ, వారిని కంటికి రెప్పలా చూసుకోవాలనీ భావించకపోవటం విషాదం. సహ సిబ్బంది పట్లా, వారి దురవస్థలపట్లా సహానుభూతి లేనివారి వల్లే ఇలాంటి దురంతాలు చోటు చేసుకుంటున్నాయి. కోల్‌కతా ఆస్పత్రి ఉదంతమైనా అటువంటి వారి కళ్లు తెరిపించాలి. వైద్యసిబ్బంది రక్షణకూ, భద్రతకూ దేశవ్యాప్తంగా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, తిథి: శు.దశమి పూర్తి (24 గంటలు),
నక్షత్రం: అనూరాధ ఉ.8.57 వరకు, తదుపరి జ్యేష్ఠ,
వర్జ్యం: ప.2.47 నుండి 4.23 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.40 నుండి 12.28 వరకు,
అమృతఘడియలు: రా.12.46 నుండి 2.24 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ధిక్కారానికి ఇది మూల్యమా?

ప్యారిస్ ఒలింపిక్స్‌లో దేశం సాధించిన పతకాల కన్నా వినేశ్ ఫోగట్‌కు అక్కడ ఎదురైన అనూహ్య పరిణామం అందరినీ ఖిన్నులను చేసింది, స్వాభిమానంతో క్రీడాపెద్దలకు ఎదురొడ్డి నిలవడమే ఈ అపరాజిత చేసిన నేరమా? క్రీడా రంగం నుంచి సినీ, రాజకీయ, మీడియా రంగాల దాకా ప్రతిచోటా ప్రశ్నించే మహిళలను పితృస్వామ్య భావజాలం తొక్కేస్తూనే ఉంది.

అభిప్రాయం



సాగరికా ఘోష్

ప్యారిస్‌లో భారత్ సాగించిన 2024 ఒలింపిక్ ప్రయాణంలో సాధించిన పతకాలను చాలా తక్కువగానే గుర్తుంచుకుంటాం. 2020లో టోక్యో ఒలింపిక్స్‌లో కంటే ఒక పతకాన్ని తక్కువగా భారత్ ఈ ఒలింపిక్‌లో గెల్చుకుంది. దానికంటే ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ చాంపియన్ వినేశ్ ఫోగట్ అందరికంటే ఎక్కువగా పతాక శీర్షికల్లోకి ఎక్కారు. ఫోగట్ కేవలం క్రీడాకారిణి మాత్రమే కాదు. ఒక సామాజిక పురోగతికి, కట్టుబాట్ల నుండి విముక్తికి, కఠినమైన స్వావలంబనతో కూడిన స్వతంత్ర ముద్రకు ఆమె ప్రతినిధి. పితృస్వామ్య అధికారాన్ని ధిక్కరించడానికి ఆమె ఏమాత్రం భయపడదు. దాడిని ఎదుర్కొనేందుకు భయపడదు, గట్టిగా అరుస్తూ, వీధిలో నిరసన వ్యక్తం చేయడానికి, తన లక్ష్యం కోసం తనను తాను పణంగా పెట్టడానికి ఆమె సిద్ధంగా ఉంది. కానీ తిరుగుబాటు చేసే ఇలాంటి మహిళలపై భారతీయ సామాజిక విధానాలు విరుచుకుపడుతున్నాయి. బలీయమైన వ్యవస్థీకృత శక్తులు స్త్రీలను లొంగిపోవాలని బలవంతం చేస్తాయి. కానీ ధిక్కరించే స్త్రీ ధైర్యంతో కూడిన కొత్త ట్రెండ్‌ని వినేశ్ ఫోగట్ సృష్టించారు.

మారని పితృస్వామ్య భావజాలం

నిర్భయంగా ఉంటూ, కొన్నిసార్లు ప్రకాశించే, కొన్నిసార్లు కన్నీరు కార్చే ఫోగట్ గత కొద్ది రోజులుగా మన హృదయాలను కట్టివేశారు. ప్యారిస్‌లో ఆమెమీదే మనం దృష్టి పెట్టాం. అజేయమైన జపాన్ ప్రపంచ ఛాంపియన్ యుయి సుసాకీని ఓడించి, రెజ్లింగ్‌లో భారతదేశం మొట్టమొదటి ఒలింపిక్ బంగారు పతకాన్ని చేజిక్కించుకునే స్థాయికి వినేశ్ చేరుకున్నప్పుడు మనం సంబరాలు చేసుకున్నాం. ఆమె ఫైనల్‌కు సిద్ధమవుతున్నప్పుడు ఊపిరి పీల్చుకున్నాం. అంతు చిక్కని సాంకేతిక విషయాలపై ఆమెను అనర్హురాలిగా ప్రకటించినప్పుడు మాత్రం మనందరి ఊపిరి ఆగిపోయినంత పనయింది.

ఫైనల్స్‌కు ముందు ఆమె గడిపిన సుదీర్ఘ రాత్రి గురించి మనం తెలుసుకున్నాము. 50 కిలోల ఫైనల్‌కు అర్హత సాధించడానికి, చివరి 100 గ్రాముల బరువు కోల్పోవడానికి ఆమె రాత్రంతా మేల్కొని ఉంది. ఒక ముద్ద తినలేదు. జాగింగ్ చేసింది, స్కిప్పింగ్ చేసింది, సైకిల్ తొక్కింది, ఆవిరి స్నానంతో చెమటోడ్చింది, మైకంతో బాధపడింది. బరువు తగ్గడానికి ఆమె జుత్తును కూడా కత్తిరించుకుంది. కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉండి ఆమె చివరి తూకంలో విఫలమైనప్పుడు, 140 కోట్ల మంది భారతీయుల గుండె ఆగిపోయినంత పనయింది.



ఖచ్చితంగా మన దేశ క్రీడా వ్యవస్థ ద్వారా ఫోగట్‌కు మెరుగైన సేవలందించవచ్చు. భారతదేశ పితృస్వామ్య, వీఐపీలతో కూడిన స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ బాడీలు... క్రీడాకారులను, అథ్లెట్‌లను నిరంతరం ఎలా విఫలం చేస్తున్నాయనడానికి వినేశ్ ఫోగట్ సంఘటనే ఒక ఉదాహరణగా నిలుస్తుంది. తమను తృణీకరించడం, తమ పట్ల అమర్యాదపూర్వకంగా వ్యవహరించడం పట్ల ఫోగట్, ఆమె తోటి ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్‌లు తిరగబడ్డారు. ఆరుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికైన అప్పటి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధినేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా లైంగిక వేధింపుల ఆరోపణలతో వారు వీధుల్లో నిరసన తెలపవలసి వచ్చింది.

డబ్ల్యూఎఫ్ఐ నుంచి సస్పెండ్ అయినప్పటికీ బీజేపీ ఎంపీగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవడానికి మోదీ ప్రభుత్వం నిరాకరించింది. క్రీడా మంత్రిత్వ శాఖ మల్లయోధులపై గురిపెట్టి దాడులను కొనసాగించింది. బ్రిజ్ భూషణ్ బినామీ అయిన సంజయ్ సింగ్ భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడయ్యాడు. ఫోగట్ మాట ఎవరూ వినలేదు. తనకు అవసరమైన వైద్యం, ఫిజియోథెరపీ అందడం లేదని ఆమె ఆరోపించారు. చివరికి, ఆమె ఇష్టపడే విభాగం 53 కిలోల పోటీ అయితే... 50 కిలోల విభాగంలో పోటీ చేయవలసి వచ్చింది. ఫోగట్‌కు అన్యాయం జరిగింది. ఒలింపిక్ పతకాల కోసం పోటీపడే వారికి తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు, వైద్య సహాయం, ఉన్నత స్థాయి నిపుణుల పర్యవేక్షణను అందించాలి. కానీ తాను ప్రదర్శించిన ధిక్కారానికి ఫోగట్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

ఈరోజు, ఫోగట్ గాథ చాలా కారణాల వల్ల కుస్తీ మ్యాట్ కంటే ముఖ్యమైనది. ఎలాంటి ఆధారాలూ లేకుండా జోక్యం చేసుకునే ప్రభుత్వం చేతిలో భారతదేశ శ్రేష్ఠమైన క్రీడాకారులు అనుభవిస్తున్న బాధలను అది ప్రతిబింబిస్తుంది. అది క్రీడలు లేదా ఇతర రంగాలలో అయినా, అధికారాన్ని సవాలు చేసే స్త్రీల విషయానికి వస్తే, వారు అధిరోహించడానికి ఇప్పటికీ ఒక పర్వతం అడ్డుగా ఉంది అనేదానికి ఫోగట్ ఒక ప్రతీక. ఆమె తోటి మహిళా రెజ్లర్లు, మల్లయోధుల జీవితాలు, వారి కెరీర్‌లపై పూర్తి నియంత్రణను కోరుకునే ఆధిపత్య వ్యక్తిగా అపఖ్యాతిపాలైన బ్రిజ్ భూషణ్ వంటి కరుడు గట్టిన పితృస్వామ్య ప్రతినిధి... అందరూ పురుషులతోనే కూడిన రెజ్లింగ్ సమాఖ్యను కైవసం చేసుకున్నాడు. పూర్తిగా రాజకీయాలతో అనుసంధానంలో ఉండే పురుషులు నిర్వహించే క్రీడాసమాఖ్యలు ఆధునిక క్రీడల నిర్వహణకు అత్యంత విరుద్ధం. ప్రధాన క్రీడా సంఘానికి నాయకత్వం వహించే స్థానంలో ఒక్క మహిళ కూడా ఎందుకు లేరన్నది పెద్ద ప్రశ్న. ఫోగట్ ఈ ఉక్కిరిబిక్కిరి అధికార ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన స్వరం పెంచింది కాబట్టే మూల్యం చెల్లించుకుంది.

అయితే క్రీడలు మాత్రమే మినహాయింపుగా లేవు. ధిక్కరించే స్త్రీలు, అణచివేయలేని మహిళల పట్ల అసహనం ఇప్పుడు కార్పొరేట్ బోర్డ్‌రూమ్‌లు, న్యూస్‌రూమ్‌లతోపాటు రాజకీయ రంగానికి కూడా విస్తరించింది. మహిళలు, ఎంత ఎక్కువ సాధించినా, తమను తాము నిరూపించుకోవాలని వారిని నిరంతరం అడుగుతారు. వారు మగ అధికారాన్ని సవాలు చేసే 'తప్పు' చేస్తే, వారిని వెంటనే తిప్పికొడతారు, బహిష్కరిస్తారు. లేదా దూరంగా ఉంచుతారు.

సినిమా ప్రపంచంలో కూడా, చలనచిత్ర పరిశ్రమ ప్రారంభ సంవత్సరాల్లో, మహిళా నటీనటులు ఆఫ్–స్క్రీన్, ఆన్–స్క్రీన్‌పై 'సద్గుణ'వంతురాలైన విధేయ మహిళా ఇమేజ్‌కి అనుగుణంగా ఉండాలని భావించారు. నర్గీస్, మధుబాల, మీనా కుమారి వంటి మహిళా నటీనటులు అత్యంత విజయవంతమైన వృత్తినిపుణులు. వారు తమ వ్యక్తిగత జీవితాల్లో స్వయంప్రతిపత్తి కోసం పట్టుబట్టారు. కాబట్టే వారు అవిధేయ మహిళలుగా లేదా విఘాతం కలిగించే వ్యక్తులుగా కళంకిత ముద్ర పొందారు, సంప్రదాయ కుటుంబ ఆధారిత కట్టుబాటుకు వీరిని వ్యతిరేకులుగా పరిగణించారు. వెండి తెరపై ఆధునిక వ్యక్తిత్వాన్ని సృష్టించడానికి 1970లలో జీనత్ అమన్ శృంఖలాలను ఛేదించారు.

నిజానికి, ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించేందుకు భారత్ చాలా దూరంలో ఉంది. విభిన్నంగా ఉండటానికి, తమ గుర్తింపులను వ్యక్తీకరించడానికి భయపడని, సంప్రదాయ ఆలోచనా విధానాలను సవాలు చేసే మహిళల పట్ల సంబరాలు జరుపుకోవడంలో కూడా మనం చాలా దూరం వెళ్ళాలి. ఈ విషయంలో ప్రేరణ కోసం, ప్యారిస్ ఒలింపిక్స్‌లో మహిళల మారథాన్ బంగారు పతకాన్ని, మరో రెండు డిస్టెన్స్ పతకాలను గెలుచుకున్న ఇథియోపియన్ సంతతి డచ్ మిడిల్ డిస్టెన్స్ రన్నర్ అయిన సిఫాన్ హసన్‌ను మనం చూడవచ్చు. హసన్ ఒక శరణార్థి. ఆమె నెదర్లాండ్స్‌కు చేరుకుంది. నర్సుగా శిక్షణ పొందుతున్నప్పుడు ఆమె విరామ సమయాల్లో పరిగెత్తింది. గెలుపు సాధించింది. స్త్రీలో ఉన్న ప్రతిభ, తేజస్సు, ధిక్కరించడం అనే గుణాలు సామాజిక దురాచారాలు కావు; మనం క్రీడలలో, ఇతర రంగాలలో ఛాంపియన్‌ల దేశంగా ఉండాలంటే ఇలాంటి వారిని పెంచి పోషించాలి. వారి విజయాలను చూసి పండగ చేసుకోవాలి.

వ్యాసకర్త టీఎంసీ రాజ్యసభ ఎంపీ ('ది ప్రింట్' సౌజన్యంతో...)

వంకర బుద్ధుల పెద్దలు

ఏం చదివితే ఏమి? ఏ పదవిలో కూర్చుంటే ఏమి? పితృస్వామ్య భావజాలం నరనరాన జీర్ణించుకున్నప్పుడు ప్రతి ఒక్కడూ ఒక మనువే అవుతాడు. ఇందుకు రాజ్యసభలో జయాబచ్చన్ పట్ల చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వ్యవహారశైలే ఒక ఉదాహరణ.

అభిప్రాయం



కె.ఎన్. మల్లీశ్వరి

ప్రజలందరి స్వేచ్ఛా సమానత్వాలను కాపాడటానికి కృషి చేసే చట్టసభల్లో మహిళా సభ్యులు అవమానాలకు, వివక్షలకు గురి కావడం భారతదేశంలో చాలా సహజంగా మారిపోయింది, చర్చించవలసిన విషయం కాకుండా పోయింది. ఇందిరాగాంధీ, జయలలిత, సోనియాగాంధీ, మాయావతి, మమతా బెనర్జీతో సహా రాష్ట్రాల మహిళా శాసనసభ్యులు అనేకమంది ఇలాంటి వాటిని ఎదుర్కొన్నవారే. ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్, రెండు దశాబ్దాలుగా భారత పార్లమెంటేరియన్; ఆస్తులు, హోదాలు, కుటుంబపు దన్ను, సామాజిక ఆధిపత్య స్థానంలో ఉన్న జయాబచ్చన్ కూడా రాజ్యసభలో తన పేరును వ్యంగ్యంగా కాక గౌరవంగా పిలవడం కోసం పోరాటం చేస్తోంది. 'తోటి సభ్యురాలి పేరుకి విలువ ఇవ్వనివారు, మా హక్కులను ఎలా కాపాడతారని' ప్రజలు ప్రశ్నిస్తే చట్టసభలు ఏమని సమాధానం ఇస్తాయి?

మొన్నటి రాజ్యసభ సమావేశాల్లో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్‌ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. తను మాట్లాడటానికి అవకాశం ఇమ్మని కోరిన జయను ఉద్దేశించి– 'ఇపుడు జయా అమితాబ్ బచ్చన్ గారు మాట్లాడతారని' ధన్‌ఖడ్ అన్నారు. 'అమితాబ్' పేరుని ఒత్తి పిలవడంతో, అందులోని వ్యంగ్యాన్ని జయ గుర్తించి అందుకు అభ్యంతరం చెప్పింది. అప్పటికి అది నాలుగోసారి జయ పేరుని ధన్‌ఖడ్ ఆ తీరులో పలకడం! తనని జయాబచ్చన్ అని మాత్రమే పిలవమని ప్రతిసారీ ఆయనకు చెబుతూనే ఉంది. తను భర్త చాటు భార్యను కాననీ, స్త్రీగా తన ఉనికిని గుర్తించాలని స్పష్టంగా చెప్పింది. ఒక స్త్రీ, అందునా ప్రతిపక్షంలో ఉన్న స్త్రీ కచ్చితంగా చెప్పడం ఎంతటి ఉదారులకైనా నచ్చుతుందా! ఎన్నికల అఫిడవిట్‌లో జయ పేరు 'జయా అమితాబ్ బచ్చన్' అని ఉంటుంది. అందుకే అలా పిలిచానని ధన్‌ఖడ్ అన్నారు. రాజ్యసభలో ఉన్న సభ్యుల పేర్లన్నీ ఎన్నికల అఫిడవిట్ ప్రకారమే పిలవడం లేదు కదా! దీన్ని బట్టి చూస్తే జయని రెచ్చగొట్టడానికే పదేపదే అలా పిలిచారు. అయితే పేరు పిలవడం కేవలం సాంకేతిక విషయం కాదు. పైకి మామూలుగా కనిపించే మాటకు మనం అద్దే స్వరం ద్వారా ఉద్దేశించిన అర్థం మారిపోవచ్చు. తనొక కళాకారిణిననీ, ఎదుటివారి హావభావాలు తనకి ఇట్టే తెలిసిపోతాయనీ, 'పిలిచిపుడు మీ టోన్ బాలేద'నీ చెప్పింది జయ.



చట్టసభల్లో సభాధ్యక్షులు ఎలా వ్యవహరించాలి అన్నదానికి మనకి కొన్ని సంప్రదాయాలు ఉన్నాయి. చైర్మన్ ఏ పార్టీ నుంచి ఎన్నిక అయినా సరే సభలో ఉన్న అన్ని పార్టీలు, సభ్యుల పట్ల తటస్థ వైఖరితో వ్యవహరించాలి. కానీ జగదీప్ ధన్‌ఖడ్ సభా నిర్వహణ చాలా స్పష్టంగా ఒక పక్షం వైపు పనిచేస్తూనే ఉంది. ఆయన ముందుగానే ప్రతిపక్ష సభ్యులతో వాదం వేసుకుని అధికారపార్టీ సభ్యుల పని సులువు చేస్తారు. దేశ ప్రజలందరికీ ఆదర్శమైన వ్యక్తిత్వంతో ఉండాల్సిన మనిషి, పరుషమైన భాష, వ్యంగ్యపు హావభావాలు, కటుత్వం, ఆధిపత్యపు మొగ్గు, సభా సంప్రదాయాలను పట్టించుకోకపోవడం ద్వారా ప్రతిపక్ష సభ్యుల విశ్వసనీయతను కోల్పోతున్నారు. తను కళాకారిణిని కాబట్టి హావభావాలు గ్రహించానని చెప్పడం, 'మనం కొలీగ్స్ కదా' అని జయ అనడంతో ధన్‌ఖడ్ ద్వంద్వానికి గురయ్యారు. 'మీరు సెలబ్రిటీ అయితే ఏమిటి, సభలో అందరూ ఒక్కటే' అన్న మరుక్షణమే 'మనం ఒకటి ఎలా అవుతాం! అధ్యక్ష స్థానానికి విలువ ఇవ్వరా!' అంటూ ధన్‌ఖడ్ పెద్దస్వరంతో మాట్లాడడం రాజ్యసభ ప్రసారాలు చూసినవారికి ఆశ్చర్యం కలిగించింది. ప్రతిపక్ష సభ్యులంతా వాకౌట్ చేసి బయటకు వచ్చారు. జయకి సోనియాగాంధీ మద్దతుగా నిలబడింది. ధన్‌ఖడ్ స్వభావం గురించి చెబుతూ సభ్యులను తరచుగా 'శూన్యబుద్ధి' అంటారని, మాట్లాడుతుంటే 'న్యూసెన్స్' అంటారని జయ చెప్పింది.

ఈ సందర్భంలో జయ ప్రస్తావించిన 'మాటల్లో ధ్వని' గురించి మాట్లాడుకోవాలి. 'ఇప్పుడు ఆడవాళ్ళని ఒక మాటని బతకగలమా!' అన్నది తరచూ వింటున్న మాట. స్త్రీలమీద జరిగే రకరకాల వేధింపులు, దాడులను అరికట్టడానికి కొన్ని చట్టాలు వచ్చాక నిస్సంకోచంగా స్త్రీలను అవమానించడం కొంతమేరకు తగ్గి ఉండవచ్చు. కానీ ఆ మేరకు కొత్త సాధనాలను పితృస్వామ్యం సమకూర్చుకుంటుంది. అందులో ఒకటి ధ్వని గర్భితంగా మాట్లాడటం! తాము వాడే ప్రతీ పదం రాజకీయంగా తప్పులేకుండా చూసుకుని– స్వరంలోని హెచ్చుతగ్గులు, తమకి అవసరమైన పదాలను ఒత్తి పలకడం, హావభావాల ద్వారా వివక్షను చూపడం! రాజ్యసభలో ఈ తెలివైన వివక్షకే జయ గురయింది. దీని వెనుక ఉన్న కారణం ఒక్కటే. ఇప్పటికీ స్త్రీలు రెండవతరగతి పౌరులు! అటువంటివారు చట్టసభల్లోకి వచ్చి మౌనంగా కూర్చోకుండా సవాళ్ళు విసురుతారు, గట్టి గొంతుతో మాట్లాడతారు. అందుకే జేపీ నడ్డా లాంటి వారికి జయలో సభా మర్యాదలు, ప్రజాస్వామిక విలువలు పాటించడం తెలియని గర్వపోతు కనపడింది. స్త్రీలు ఎంతటి స్థానానికి ఎదిగినా వారు సమాజం కళ్ళకు స్త్రీలుగానే కనపడతారు. అందుకే సోనియా గాంధీ ఇటలీ వెళ్లిపోవాలని ఆశిస్తారు. సునీత రెండో పెళ్లి చేసుకోవద్దని డిమాండ్ చేస్తారు. తులసి చందు తన యూట్యూబ్ ఛానెల్ ఆపేయాలని బెదిరిస్తారు. దేశంలోని మామూలు మనుషులంతా ఆ కుస్తీపిల్లని గుండెల్లో పెట్టుకుంటే మతతత్వ వాదులు ఆమె ఒంటి మీది దుస్తులను విప్పాలని చూస్తారు. జయను ఎలా పిలవాలో కూడా వాళ్ళే నిర్ణయిస్తారు!

వ్యాసకర్త ప్రరవే ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

వట్టి మేధావులు కాదు... మట్టి మేధావులు కావాలి!

అభిప్రాయం




ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

2024 జూలై 24న కొల్లూరి సత్తయ్య అనే బీహెచ్‌ఈఎల్ కార్మిక నాయకుడు రిటైర్ అయ్యాడు. ఆయన రిటైర్మెంట్ సందర్భంగా ఆయన ఆత్మకథ ప్రచురితమైంది. దాన్ని సత్తయ్య సొంత మాటల్లో పసునూరి రవీందర్ రాశాడు. ఈ ఆత్మకథను ప్రచురించే ముందు దానికి ముందు మాట రాయాలని పూర్తి పుస్తకాన్ని రవీందర్ నాకు ఆన్‌లైన్‌లో పంపించాడు. దాన్ని పూర్తిగా చదివాక బాల్య దశ నుండి సత్తయ్య జీవితం నన్ను నిజంగా ఆశ్చర్యపరిచింది. అటువంటి ఒక దళిత కార్మికుని జీవిత కథను నేను ఎప్పుడూ చదవలేదు. ఆ పుస్తకానికి టైటిల్ కూడా మీరే సూచించండి అని సత్తయ్య, రవీందర్ అడిగినప్పుడు ఈయనను 'మట్టి మేధావి' అనొచ్చని సూచించాను. ఆ పుస్తకం ఇప్పుడు 'మట్టి మేధావి – కొల్లూరి సత్తయ్య – ఆటోబయోగ్రఫీ' అనే టైటిల్‌తో బయటికి వచ్చింది.

ముందుమాటలో నేను, ఇలా రాశాను: ''కొల్లూరి సత్తయ్య జీవితకథ... ఒక మట్టి మేధావి చరిత్రలా కనిపిస్తుంది. ఆయన జీవితం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఒక చిన్న పల్లెటూరిలో (హైదరాబాద్ శివారు తెల్లాపూర్‌లో) ఒక మాదిగ కుటుంబంలో పుట్టి ఈ విధంగా ఎట్లా ఎదిగాడు అనిపిస్తుంది.''

సత్తయ్య మొదట్లో అసలు చదువురాని పది రూపాయల కూలీ మనిషి. బీహెచ్‌ఈఎల్‌లో పాకీ దొడ్లు కడుగుడు, క్యాంటీన్ ప్లేట్లు కడుగుడు పని చేసేవాడు. ఇంట్ల రైల్ వే గాంగ్‌మన్ తండ్రికి ఇద్దరు భార్యలు, 14 మంది పిల్లలు. సత్తయ్య అందరికంటే చిన్నవాడు. తండ్రి తప్ప మిగతా కుటుంబీకులు కూలీపని చేసేవారే. సత్తయ్య తల్లి మాత్రం మంత్రసాని. ఆమె కులం మాదిగైనా డెలివరీలు చాలా బాగా చేసేది గనుక ఊళ్ళో పుట్టిన ప్రతి పిల్లకు క్షేమంగా కాన్పు చేయించే మంత్రసాని ఆమె. అందువల్ల ఆమెకు ఊళ్ళో బువ్వ దొరకని రోజుండేది కాదట. ఎక్కువ దొరికిన రోజు ఇంట్లో అందరితోపాటు చుట్టు ఉన్న బిచ్చగాళ్లకు ఆమె బువ్వ పెట్టేది. అవ్వ (తల్లి) నుండి నేర్చుకున్న కొడుకు 10 రూపాయల్లో ఒక్క రూపాయి పక్కకు పెట్టి తమ గ్రామ శివార్లలో ఒంటికి చినిగిన బట్ట పేగులతో బతికే స్త్రీలకు చీర కొనిచ్చే పని మొదలుపెట్టాడు. క్రమంగా బీహెచ్‌ఈఎల్‌లో కార్మిక నాయకుడయ్యాడు. తనతో పాటు అతి చిన్న ఉద్యోగులను పర్మనెంటు చెయ్యాలని పోరాటాలు మొదలుపెట్టి కార్మికుల హక్కు కోసం అలుపెరుగని పోరాటాలు చేశాడు. ఈ క్రమంలో తెలుగులో చదవడం నేర్చుకున్నాడు.

గ్రామ స్థాయిలో దళితుల భూములను (ముఖ్యంగా ఇనామ్ భూములు) భూదందాదారులు ఆక్రమించకుండా కాపాడే పోరాటాలు చేశాడు. క్రమంగా ఆర్థికంగా పుంజుకుంటూ కంప్యూటర్ సమస్య బీద విద్యార్థులు ఎదుర్కొగానే చిన్న కంప్యూటర్ సెంటర్ ప్రారంభించి బీద విద్యార్థులకు నేర్పించే ఏర్పాటు చేశాడు. కరోనా రాక ముందే అనాథ పిల్లలను తెచ్చి తన తాతకు ఇనాముగా వచ్చిన భూమిలో గదులు కట్టి తన



పిల్లలు చదువుకున్న ఇంగ్లిష్ మీడియం బడుల్లో చేర్పించాడు. కరోనాతో ఆ సేవ ఆపాల్సి వచ్చింది. అప్పుడు ఆకలితో అలమటిస్తున్న వలస కూలీలకు బువ్వ బండి ప్రారంభించాడు. తన సొంత ఆదాయం నుండి ఖర్చుపెట్టి రోజుకు 400 మందికి మిల్లెట్ బ్రేక్‌ఫాస్ట్ రోజూ పెట్టేవాడు. ఆ బువ్వ బండి ఇప్పటికీ నడుస్తోంది. ఆ క్రమంలోనే నా సలహాతో 'ఫూలే-అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫీ అండ్ ఇంగ్లిష్ ట్రెనింగ్' ప్రారంభించాడు. దీన్ని చట్టపరంగా నడిపేందుకు 'అమృత-సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ' స్థాపించాడు. 2022 జనవరి 26న ప్రారంభమైన ఈ ఫిలాసఫీ-ఇంగ్లిష్ ట్రెనింగ్ దాదాపు 500 మందిని 23 రాష్ట్రాల నుండి సెలెక్ట్ చేసి ప్రతి 40 మందితో బ్యాచ్‌కి నెలరోజులు ఉచిత వసతి, ఉచిత తిండితో ట్రెనింగ్ ఇచ్చారు. ఈ సత్తయ్యే 2024 జనవరి 30న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహాన్ని స్థాపించాడు. దానికి ప్రభుత్వం 10 కుంటల భూమి ఇచ్చింది.

సత్తయ్యను మట్టిమేధావి (ఇంగ్లిష్‌లో ఇటువంటి వారినే ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) అని ఎందుకన్నారని నన్ను కొంతమంది అడిగారు. ఆయన పెద్దగా చదువుకోలేదు కానీ దళితుల, ఆదివాసుల, శూద్ర, బీసీలలో బీద పిల్లల చదువుల గురించి చాలా కృషి చేస్తున్నాడు. మట్టి అన్ని ఉత్పత్తులకు మూలం. ఉత్పత్తులకు మతం మూలం లేదు. మట్టికి–గింజకు, మట్టికి–జంతువుకు ఉన్న సంబంధాన్ని మట్టిలో పనిచేసే మనుషులే మేధావులై కనిపెట్టారు. ఇక్కడే మొట్టమొదట మానవ తత్వశాస్త్రం పుట్టింది. స్త్రీ కడుపులో పుట్టిన మనుషులు తిరిగి మట్టి బొందలోకి పోయేవరకు మట్టిని ప్రేమిస్తారు. మట్టితో పోరాడుతారు. అన్ని ఉత్పత్తి సంబంధాలు, మానవ సంబంధాలను మట్టిలో పని చేసే మనుషులు... పుస్తకాలు, మతాలు లేక ముందే ఏర్పర్చుకున్నారు. మట్టి మేధావులు... పుస్తకాలు, మతాలు సమాజంలోకి రాకముందే సమాజాలను అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. అయితే భారతదేశంలో మతాలు, వేదాలు వచ్చాక శూద్రుల్లో, దళితుల్లో, ఆదివాసుల్లో ఇటువంటి మట్టి మేధావులు ఉన్నారు. కాబట్టి వారిని చదువుకు, రాతకు, మతాలను నడపడానికి దూరంగా ఉంచారు. కాల్పనిక, ఊహాజనిత అంశాలపై పుస్తకాలు రాసేవారు మేధావులనీ; రైతులు, కార్మికులు సత్తయ్యలా మానవత్వంతో సమాజాన్ని మార్చుకుంటూ వచ్చిన వారిని అసలు గుర్తించని సాహిత్యం తయారు చేశారు. ఇటువంటి ఉత్పత్తి సంబంధ రహిత రచయితలను 'వట్టి మేధావులు' అనాలి.

ఈ దేశంలో కాళిదాసు నుండి కాళోజీ వరకు ఊహాజనిత కవిత్వాన్ని కావ్యాల రూపంలో రాసినవాళ్లే. కాళిదాసు 'మేఘ సందేశం'లో భూమి మీదికి తొయ్యబడ్డ యక్షుడు మేఘం ద్వారా కైలాసంలో ఉన్న భార్యకు పంపిన ప్రేమ సందేశంలో ఈ దేశ వర్ణన అంతా ఊహాజనితమైందే. ఇక్కడి వ్యవసాయ భూములు, వాటిలో పంటలు పండిస్తున్న రైతుల గురించి ఒక పద్యం కూడా అందులో లేదు. మహాకాళి ఆలయ వర్ణన ఉంది గానీ, మహా ఉత్పత్తి రంగమైన పంటపైగానీ, శ్రమచేసి పండించే రైతు బతుకుపై కానీ ఒక పద్యం కూడా లేదు.

ఆనాటి సంస్కృత సాహిత్య ఉత్పత్తి వ్యతిరేక వారసత్వం ప్రాంతీయ భాషల్లోకి కూడా పాకి శ్రమను గౌరవించని, లేదా శ్రమను పట్టించుకోని రచయితలు పుట్టుకొచ్చారు. అందుకే ఈ సాహిత్యానికి ప్రపంచ గుర్తింపు లభించలేదు. ప్రకృతి వర్ణన స్త్రీ పురుషుల ప్రేమ కోసమో, యుద్ధ నిర్మాణాల అవసరాల కోసమో కాదు చెయ్యాల్సింది. ప్రకృతిని ప్రజల శ్రమ జీవనంతో ముడేసిన రచనలు దేశంలో వచ్చినప్పుడు సాహిత్యం సార్వజనీనత్వం సంతరించుకుంటుంది.

గద్దర్ పాటల సాహిత్యంలో పుట్టుకొచ్చిన మట్టి చేతులకు గౌరవం గానీ, సత్తయ్య మానవత్వపు మట్టిమేధావితత్వం గానీ సమాజాన్ని రోజువారీగా అభివృద్ధి వైపు పయనింపజేస్తుంది. మట్టి మేధావులకు వట్టి మేధావులకు ఉండే తేడా... భూమిపైన మానవ సమానత్వ స్వర్గాన్ని సృష్టించడానికీ, మనుషులు చనిపోయాక స్వర్గం చూపెట్టే తత్వానికీ ఉండే తేడా! మొదటి ఆలోచనలో దేవుడు శ్రమ గౌరవ వాది. రెండవ ఆలోచనలో దేవుడు శ్రమ వ్యతిరేకవాది. ఉత్పత్తి కులాలను ప్రేమించలేని కుల సమీకరణలు సాహిత్య రంగాన్ని యుద్ధమయం, ప్రేమమయం చేశాయి. అందుకే సత్తయ్య లాంటి వారి ఆత్మకథలను పిల్లలు చదివినప్పుడు ఉత్పత్తి, శ్రమ, సర్వజంతు ఆదరణవాదులౌతారు. జంతువుల్లో ఒక దాన్ని ఎన్నుకొని పూజించడం జంతుజాతిని కాపాడదు. అన్ని జంతువులనూ ప్రేమించి మేపాలి.

భూములు పంచిన భూస్వాములున్నారు. ఆస్తులొదిలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అగ్రకులస్థులున్నారు. కానీ వాళ్ళు మానవ సమానత్వాన్ని కోరుకోవడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా విద్యా సమానత్వం రూపొందించాలనే ఆలోచనకు వాళ్ళ కులం అడ్డొచ్చింది. సత్తయ్య మాత్రం తాను బడిలో, కాలేజీలో, యూనివర్సిటీలో చదువుకోక పోయినా అంబేడ్కర్ లాగా, మహాత్మా పూలే లాగా ఈ దేశ బీద పిల్లలు ఇంగ్లిష్‌లో చదువుకొని వాళ్ళ సిద్ధాంతాలను నేర్చుకొని దేశ మార్పునకు కృషి చెయ్యాలని పనిచేస్తున్నాడు. అందుకే సత్తయ్యను మట్టి మేధావి అనాలి. వట్టి మేధావులు కూడా ఆయన జీవిత చరిత్ర చదివి నేర్చుకుంటే దేశానికి మేలు చెయ్యగలరు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

'స్వచ్ఛ భారతం'



మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ భారత్' లోగో ఆకారంలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు మంగళవారం కూర్చున్నారు. మహాత్మాగాంధీ, స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. -బి.కొత్తకోట

'మువ్వన్నెల' ఆనందం

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం చేనేతనగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు, వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని విద్యార్థులు వెయ్యి అడుగుల మువ్వన్నెల జెండాలతో మంగళవారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. పంద్రాగస్టు జెండా పండుగ మళ్లీ రానే వచ్చిందనే ఆనందాన్ని వ్యక్తం చేశారు. కడపలో హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రారంభించి ప్రసంగించారు. - కురబలకోట/కడప కోటిరెడ్డిసర్కిల్



కడపలో



'ఆమె' కోసం పోరాటం

కోల్‌కొతాలో పీజీ వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ వైద్యులు సమ్మె చేశారు. విధులను బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పిస్తేనే విధులు నిర్వహిస్తామని, తమ డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చే వరకు విధులకు గైర్హాజరవుతామని స్పష్టం చేశారు. గుంటూరు జీజీహెచ్ నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. – గుంటూరు మెడికల్

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో సినీనటి జాన్వీకపూర్



తిరుమల శ్రీవారిని సినీనటి జాన్వీకపూర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. -తిరుమల

పర్యాటక కేంద్రంగా పవిత్ర సంగమం: ఆనం



ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫెర్రీ వద్ద పవిత్ర సంగమ ప్రాంతాన్ని గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పి.సారథి, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం పరిశీలించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ దసరా నాటికి సంగమం వద్ద నిత్యహారతులు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి సారథి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 50 ఎకరాలు సేకరించి, దేవాలయ నిర్మాణం జరుపుతామని, ఈ ప్రాంత అభివృద్ధిపై ఇప్పటికే సీఎంతో మాట్లాడామని చెప్పారు. అలాగే కృష్ణానది ఆవలివైపు ఉన్న లంక భూములు సేకరించి పర్యాటక రంగం అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ దీనిపై అంచనాలు రూపొందించామని, రూ.88 లక్షలు అవసరమవుతాయని తెలిపారు. ఇందుకోసం సీఆర్‌డీఏ నిధులు వినియోగిస్తామని చెప్పారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జేసీ నిధిమీనా, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో పీజీ విద్యార్థిని మృతి




నీలమ్మ (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో డెంగీ వ్యాధితో కొంచాడ నీలమ్మ (24) అనే పీజీ విద్యార్థిని మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మాడ కాలనీలో నివాసముంటున్న కొంచాడ హరి, ఎర్రమ్మ కుమార్తె నీలమ్మ విజయనగరం మహారాజా కాలేజీలో పీజీ పూర్తి చేసి, ప్రస్తుతం విశాఖలో ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా కోచింగ్ తీసుకుంటున్నది. విద్యార్థినికి దివ్యాంగ పింఛన్ వస్తున్నది. ఈ నెల 1న పింఛన్ తీసుకునేందుకు విద్యార్థిని నిమ్మాడ వచ్చింది. అప్పటికే తల్లిదండ్రులు జ్వరంతో బాధపడుతుండగా నీలమ్మకు కూడా జ్వరం వచ్చింది. వెంటనే ఆమెను వివిధ ఆస్పత్రులు మారుస్తూ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నీలమ్మ మంగళవారం మృతి చెందింది.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ శివారులోని తిమ్మాపురం వద్ద గల శ్రీ పద్మావతి శ్రీనివాస ఆయుర్వేద కళాశాల హాస్టల్‌లో మంగళవారం కీర్తి (21) అనే నర్సింగ్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంకు చెందిన కీర్తి స్థానిక హనుమేష్‌నగర్‌లోని శ్రీ పద్మావతి నర్సింగ్ హోమ్‌లోని రమ్య ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాలలో నర్సింగ్ థర్డ్ ఇయర్ చదువుతోంది. ఈమెకు పట్టణ శివారులోని ఆయుర్వేద కళాశాలలో హాస్టల్ సౌకర్యం కల్పించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వైద్య, ఆరోగ్య రంగంలో పీపీపీ వద్దు: సీపీఎం



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య రంగంలో పీపీపీ పద్ధతి వద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఆ యోచనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సందర్భంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌తో ప్రైవేటు రంగానికి ప్రభుత్వ ఆస్పత్రులు ధారాదత్తం చేయడమే దీని వెనుక అసలు ఉద్దేశమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగంలో వైద్య రంగం ఉంటేనే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని స్పష్టం చేశారు. కేవలం ప్రైవేటు యాజమాన్యాల లాభాల కోసమే పీపీపీ విధానం ఉపయోగపడుతుందని గత అనుభవాలు చెబుతున్నాయని తెలిపారు.

కొత్త రైలు.. కొండ కోనల్లో హొయలు

- మల్కనగిరి నుంచి పాండురంగాపురం రైల్వేలైనుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఒడిశా, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ నిర్మాణం
- ఆంధ్రాలో చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో నాలుగు స్టేషన్లు
- ఇప్పటికే సర్వే పూర్తి చేసిన రైల్వే అధికారులు



చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మారుమూల గిరిజన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ ఒడిశాలోని మల్కనగిరి నుంచి భద్రాచలం సమీపంలోని పాండురంగాపురం వరకు సుమారు 173 కిలోమీటర్ల కొత్త రైల్వే లైను ఇటీవల మంజూరైంది. ఈ లైనుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఈ రైల్వేలైను నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. ఒడిశాలోని మల్కనగిరి నుంచి ఆంధ్రాలోని విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల మీదుగా తెలంగాణలోని పాండురంగాపురం వరకు కొత్త లైను నిర్మించనున్నారు. లైను నిర్మాణంలో భాగంగా 213 వంతెనలు నిర్మించనున్నారు. వీటిలో 48 పెద్ద వంతెనలు, 165 చిన్న వంతెనలున్నాయి.

ముంపు మాటేంటి?

విలీన మండలాల్లో ప్రతిపాదించిన రైల్వేలైను పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవనుంది. చింతూరు మండలం కన్నాపురం, కూనవరం మండలం కూటూరు గట్టు, పల్లూరు, ఎటపాక మండలం నందిగామలో నిర్మించనున్న స్టేషన్లు సైతం ముంపునకు గురయ్యే అవకాశముంది. దీంతోపాటు శబరినదిపై నిర్మించే వంతెన సైతం ముంపుకు గురయ్యే పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సర్వే చేసిన మార్గం గుండా కాకుండా ముంపునకు గురికాని మార్గంలో లైను నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. లైనుతో పాటు స్టేషన్లు ముంపు పరిస్థితిపై రైల్వే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని స్థానికులు వేచి చూస్తున్నారు.

విలీన మండలాల మీదుగా..

మల్కనగిరి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న రైల్వేలైను విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక గుండా సాగనుంది. దీనిలో భాగంగా ఒడిశాలోని మల్కనగిరి, కోవాసిగూడ, బదలి, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి, లూనిమన్‌గూడలో, ఆంధ్రాలోని అల్లూరి జిల్లా చింతూరు మండలం కన్నాపురం, కూనవరం మండలం కూటూరు గట్టు, పల్లూరు, ఎటపాక మండలం నందిగామలో స్టేషన్లు నిర్మించనున్నారు. అనంతరం నందిగామ నుంచి తెలంగాణలోని భద్రాచలం అక్కడి నుంచి పాండురంగాపురం వరకు ఈ రైల్వేలైను నిర్మించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో సర్వే పనులు పూర్తి చేశారు. దీనిలో భాగంగా కూనవరం మండలం జగ్గవరం వద్ద మహారాష్ట్ర, ఒడిశా, ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు 50 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి మట్టి శాంపిల్స్ పంపారు. కాగా ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ప్రవేశించేందుకు శబరి నదిపై ఒడిశాలోని మోటు, చింతూరు మండలం వీరాపురం నడుమ వంతెన నిర్మించాల్సి ఉంది.

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబర్ నెల ఆన్‌లైన్ కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన నవంబర్ నెల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను, అదేవిధంగా నవంబర్ 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన నవంబర్ నెల కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా నవంబర్ నెల ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుమల-తిరుపతి శ్రీవారి సేవ కోటాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ కోటాను మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

ఆర్మేనియాలో ఆంధ్రా యువకుడి మృతి

- విభిన్న కథనాలతో సన్నిహితుల తీరుపై అనుమానాలు
- కుమారుడి మృతదేహాన్ని తెప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు



శివనారాయణ (ఫైల్)

పెద్దదోర్నాల: జీవనాధారం కోసం ఆర్మేనియాకు వెళ్లిన ప్రకాశం జిల్లా యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పెద్దదోర్నాల మండల పరిధిలోని హసానాబాదకు చెందిన చిన్న ఆవులయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడైన ఒంటేరు శివనారాయణ (31) బీటెక్ పూర్తి చేసి యూరప్‌లోని ఆర్మేనియాలో ఉద్యోగం సంపాదించాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం తల్లిదండ్రులకు తాను మరో కంపెనీలో ఉద్యోగంలో చేరానని, అక్కడే నలుగురు కలిసి రూం తీసుకుని ఉంటున్నామని తెలిపాడు. గురువారం మద్యం పార్టీ చేసుకున్న మిత్రులు తనకు ఓ బాటిల్లో నీరు ఇచ్చారని, అది తాగటం వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్‌లో తెలిపాడు. అనంతరం తాను వైద్యశాలలో చేరినట్లు శుక్రవారం సమాచారం అందించాడు. ఈ క్రమంలో శనివారం తల్లిదండ్రులకు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫొటోలు, వీడియోలను పంపించిన సహచరులు.. అదే రోజున శివనారాయణ చనిపోయాడంటూ సమాచారం అందించడంతో తల్లిదండ్రులు కుప్పకూలి పోయారు.

సహచరుల తీరుపై అనుమానాలు..

'రూ.2 లక్షల పంపితే వీడియో కాల్ ద్వారా మృతదేహాన్ని చూపిస్తాం, రూ.10 లక్షలు పంపితే మృతదేహాన్ని ఇండియాకు తీసుకొస్తాం' అంటూ ఫోన్లు చేసిన శివనారాయణ సహచరులపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా, సమాచారం ఇచ్చినప్పటి నుంచి వారి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఏం చేయాలో అర్థంకాక మృతుని తల్లిదండ్రులు, దిక్కుతోచని స్థితిలో విలపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ కుమారుడి మృతదేహాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మృతుని తల్లిదండ్రులు వేడుకొంటున్నారు.

గంజాయితో పట్టుబడ్డ నలుగురు విలేకరులు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): చింతూరు మండలంలోని చట్టిలో 15 కిలోల గంజాయితో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు విలేకరులు పట్టుబడిన వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కుంట సీఐ అజయ్ సోవంకర్‌ను సస్పెండ్ చేశారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చౌహాన్ మంగళవారం విలేకరులకు తెలిపారు. చట్టిలో సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న 15 కిలోల గంజాయిని పట్టుకున్న చింతూరు పోలీసులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు విలేకరులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో విలేకరులు బప్పీరాయ్, శివేంద్‌తివారీ, ధర్మేంద్రసింగ్, మనీష్‌సింగ్‌లను కుంట పోలీసులు కావాలనే ఇరికించారని అక్కడి మీడియాతో పాటు ప్రజా ప్రతినిధులు తీవ్ర ఆందోళన చేశారు. కుంటలో ఇసుక మాఫియా ఆగడాలపై ప్రశ్నించినందుకు కావాలనే విలేకరులకు చెందిన కారులో పోలీసులు గంజాయిని పెట్టి చింతూరు పోలీసులకు సమాచారమిచ్చి పట్టించారని ఆరోపణలు వచ్చాయి.

సహచరుల లైంగిక వేధింపులకు డెంటల్ విద్యార్థి బలవన్మరణం

- నెల్లూరులోని మంత్రి నారాయణ డెంటల్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య
- ఏడాది నుంచి యువకుడిని లైంగికంగా వేధిస్తున్న ముగ్గురు వైద్య విద్యార్థులు!



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

తాడిపత్రి రూరల్: నెల్లూరులోని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు చెందిన డెంటల్ కళాశాలలో బీడీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన విద్యార్థి ప్రదీప్ కుమార్(19) సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వైద్య విద్యార్థుల లైంగిక వేధింపులు భరించలేక కళాశాల భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరుకు చెందిన నారాయణ ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి తాడిపత్రికి వలస వచ్చారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో నివాసం ఉంటూ రింగ్‌లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. నారాయణకు అఖిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్ కుమారులు. పెద్ద కుమారుడు అఖిల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు ప్రదీప్‌కుమార్ నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రదీప్‌కుమార్ కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పెద్ద కుమారుడు అఖిల్‌కుమార్ సోమవారం అర్ధరాత్రి ఫోన్ చేసి చెప్పడంతో తల్లిదండ్రులు ప్రమీల, నారాయణ నిర్ఘాంతపోయారు. వెంటనే స్నేహితులతో కలిసి వాహనంలో నెల్లూరు బయలుదేరి వెళ్లారు. స్వస్థలం నెల్లూరు కావడంతో అక్కడే మంగళవారం ప్రదీప్‌కుమార్ అంత్యక్రియలు పూర్తిచేశారు.

లైంగిక వేధింపులు భరించలేకే నా తమ్ముడు ఆత్మహత్య



వైద్య విద్య చదువుతున్న రాహుల్ అనే విద్యార్థితోపాటు మరో ఇద్దరు కలిసి గత ఏడాది సెప్టెంబర్ నుంచి లైంగికంగా వేధిస్తున్నారని, వారి ఆగడాలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని నా తమ్ముడు ప్రదీప్‌కుమార్ సోమవారం అర్ధరాత్రి నా సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపాడు. వెంటనే తాడిపత్రిలోని తల్లిదండ్రులకు, నెల్లూరులోని కళాశాలకు ఫోన్ చేశా. అప్పటికే కళాశాల భవనంపై నుంచి దూకి చనిపోయాడు.

– మృతుడి అన్న అఖిల్‌కుమార్

అగ్నికి ఆహుతైన 'డైనో పార్క్'



బీచ్‌రోడ్డు: విశాఖ బీచ్‌రోడ్డులో మంగళవారం ఉదయం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 'డైనోపార్క్' అగ్నికి ఆహుతైంది. ఈ పార్కు, లోపల ఉన్న జంతువుల బొమ్మలన్నీ ఫైబర్, గడ్డితోనే రెండు అంతస్తుల్లో ఏర్పాటు చేయడం వల్ల పార్కు మొత్తం కాలి బూడిదైంది. ఏసీలు పేలి పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ పార్క్ ఉదయం మూసి ఉండడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటన సమాచారం అందగానే మూడో పట్టణ పోలీసు స్టేషన్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. అప్పటికే డైనో పార్క్ మొత్తం కాలిపోయింది. సాయంత్రం నుంచి మాత్రమే సందర్శకుల కోసం ఈ పార్కును అందుబాటులో ఉంచుతారు. ఇదే ప్రమాదం సాయంత్రం జరిగి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగి ఉండేది. ప్రమాదంలో డైనో పార్క్ మొత్తం బూడిద కావడంతో సుమారు రూ.60 లక్షల నుంచి రూ. కోటి వరకు నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

విద్యార్థినుల కిడ్నాప్.. యువకులపై పోక్సో కేసు

పట్నంబజారు: ఇద్దరు మైనర్ విద్యార్థినులను కిడ్నాప్ చేసిన యువకులపై కేసు నమోదైంది. గుంటూరులోని పట్టాభిపురం ఎస్‌ఐ మధుపవన్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టాభిపురం ప్రధాన రహదారిలో సాంఘిక, సంక్షేమ శాఖ వసతి గృహం ఉంది. అందులో ప్రత్తిపాడుకు చెందిన విద్యార్థిని, చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి చెందిన మరో విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. లింగాపురం గ్రామానికి చెందిన గోపీ డ్రైవర్‌గా పనిచేస్తూ అడవితక్కెళ్లపాడులోని రాజీవ్‌గృహకల్పలో ఉంటున్నాడు. శ్యామలానగర్ సమీపంలోని సీతారామ్‌నగర్ కాలనీకి చెందిన మణి బీటెక్ చదువుతున్నాడు. వీరిద్దరూ సోమవారం రాత్రి వసతి గృహంలోని ఇద్దరు విద్యార్థినులకు మాయమాటలు చెప్పి రాజీవ్‌గృహకల్పలోని గోపీ రూముకు తీసుకెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో హాజరు పట్టిని పరిశీలించిన వార్డెన్ కె.అనురాధ ఇద్దరు విద్యార్థినులు కనిపించకపోవడాన్ని గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుల సెల్‌ఫోన్ ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో టీడీపీ నాయకులు.. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుడి బంధువు అనే కారణంతో ఓ ఆర్మీ ఉద్యోగి ఇంటిని కూల్చివేశారు. ఈ ఘటన బాపట్ల జిల్లా నగరం మండలం చిరకాలవారిపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి నాంచారమ్మ కుమారుడు శివకృష్ణ ఆర్మీలో పని చేస్తున్నారు. వీరు 5 సెంట్లు స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. నాంచారమ్మ తమ్ముడు నగేష్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉన్నారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు పంచాయతీ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో 15 రోజుల క్రితం అధికారులు బలవంతంగా ఖాళీ చేయించి తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు.

'జన్మభూమి 2'లో స్కూళ్ల అభివృద్ధి

- పాఠశాలల అభివృద్ధికి ముందుకొచ్చే వారిని ప్రోత్సహించండి
- విద్యా సిలబస్‌లో మార్పులు చేయండి
- ప్రతిభా అవార్డులు, పేరెంట్ టీచర్ మీటింగ్స్ మళ్లీ ప్రారంభించాలి
- విద్యా శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: త్వరలో ప్రారంభించే 'జన్మభూమి 2' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు చెప్పారు. విద్యా రంగ నిపుణులు, మేధావులతో చర్చించి విద్యా శాఖలో, సిలబస్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. విద్యా శాఖపై మంగళవారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్కూళ్లలో తెలుగుకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థికీ కేంద్ర ప్రభుత్వ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీ ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో పేరెంట్ టీచర్ మీటింగ్‌లు నిర్వహించాలని, వీటిలో తనతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలంతా హాజరవుతారని అన్నారు. పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని, స్పోర్ట్స్ రిపోర్ట్స్ కార్డ్స్ కూడా ఇవ్వాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను హెల్త్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందజేయాలని చెప్పారు. జీవో నం.117పై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్కూళ్లలో ఆయాల పెండింగ్ జీతాలు చెల్లించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. డైట్ కాలేజీల్లో పోస్టులు భర్తీ చేయాలని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా శాఖలో నూతన విధానాలు, సంస్కరణలను వివరించారు. నైపుణ్య గణనపై అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాల్లో 3.54 కోట్ల మంది పనిచేసే వయసున్న వారి నైపుణ్యాన్ని గణన చేయాల్సి ఉందని చెప్పారు. ఇందుకోసం 40 వేల మంది ఎన్యూమరేటర్లు అవసరమని, 8 నెలలు పడుతుందని వివరించారు. పారిశ్రామిక రంగ ప్రతినిధులతో కూడా సంప్రదించి నైపుణ్య గణన చేపట్టాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలో ఆహార శుద్ధి, ఆక్వా ఇండస్ట్రియల్ పార్కులు

రాష్ట్రంలో ఓడరేవులు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపైనా సీఎం సమీక్షించారు. ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యాన రంగాలతో పాటు ఖనిజ ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వెనుకబడిన ప్రాంతాల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కును వెంటనే పునరుద్ధరించాలన్నారు. పీపీపీ విధానంలో ఇంటిగ్రేటెడ్ ఓడరేవులు అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంత హింటర్ ల్యాండ్ అనుసంధానంతో కూడిన ఓడరేవుల నిర్మాణం ద్వారా ఎగుమతి ఖర్చులు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు.

కరోనాకంటే గత ప్రభుత్వమే టూరిజాన్ని దెబ్బతీసింది

ఏపీలో ఎకో, టెంపుల్, బీచ్ టూరిజం అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని పర్యాటక శాఖపై జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు చెప్పారు. టూరిజం అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికతో రావాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా రాష్ట్రంలో కొత్త టూరిజం పాలసీ తీసుకురావాలన్నారు. కరోనాకంటే గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో పర్యాటకం ఎక్కువగా దెబ్బతిందని అన్నారు. టీడీపీ గత ప్రభుత్వం ఐదేళ్లలో పర్యాటక రంగంపై రూ.880 కోట్లు ఖర్చు చేయగా.. గత ప్రభుత్వం రూ.213 కోట్లే ఖర్చు చేసిందన్నారు. కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ 20.6 శాతం నుంచి 2019–24 మధ్య 3.3 శాతానికి పడిపోయిందన్నారు. రుషికొండపై గత ప్రభుత్వం సీఎం నివాసం కోసం రూ.500 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను ఏం చేయాలన్న విషయంపై వివిధ వర్గాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

...అలా పంచుకున్నారు!

యజ్ఞాన్ని తలపించిన భారత్, పాక్ విభజన • మూడింట రెండొంతుల సైన్యం భారత్‌కు

- ఆస్తులు, అప్పుల్లో 17.5 శాతం పాక్‌కు
- 80:20 నిష్పత్తిలో ఫర్నిచర్, స్టేషనరీ
- బల్బులూ, జంతువులూ పంచుకున్నారు
- టాస్‌లో భారత్ పరమైన వైస్రాయ్ బగ్గీ

1947. బ్రిటిష్ వలస పాలన నుంచి మనకు విముక్తి లభించిన ఏడాది. అఖండ భారతదేశం రెండుగా చీలిన ఏడాది కూడా. ఒక రాష్ట్ర విభజన జరిగితేనే ఆస్తులు, అప్పులు తదితరాల పంపకం ఓ పట్టాన తేలదు. అలాంటి దేశ విభజన అంటే మాటలా? అది కూడా అత్యంత ద్వేషపూరిత వాతావరణంలో జరిగిన భారత్, పాకిస్తాన్ విభజన గురించైతే ఇక చెప్పేదేముంటుంది! ఆస్తులు, అప్పులు మొదలుకుని సైన్యం, సాంస్కృతిక సంపద దాకా అన్నీ రెండు దేశాల మధ్యా సజావుగా పంపకమయ్యేలా చూసేందుకు నాటి పెద్దలంతా కలిసి భారీ యజ్ఞమే చేయాల్సి వచ్చింది. రేపు దేశమంతా 78వ స్వాతంత్య్ర దిన వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో దేశ విభజన జరిగిన తీరుతెన్నులపై ఫోకస్...

ముందుగానే కమిటీ

విభజన సజావుగా సాగేలా చూసేందుకు స్వాతంత్య్రానికి ముందే 1947 జూన్ 16న 'పంజాబ్ పార్టిషన్ కమిటీ' ఏర్పాటైంది. తర్వాత దీన్ని విభజన మండలి (పార్టిషన్ కౌన్సిల్)గా మార్చారు. ఆస్తులు, అప్పులతో పాటు సైన్యం, ఉన్నతాధికారులు మొదలుకుని కార్యాలయ సామగ్రి, ఫర్నిచర్ దాకా అన్నింటినీ సజావుగా పంచడం దీని బాధ్యత. కమిటీలో భారత్ తరఫున కాంగ్రెస్ నేతలు సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్; పాక్ తరఫున ఆలిండియా ముస్లిం లీగ్ నేతలు మహ్మదాలీ జిన్నా, లియాకత్ అలీ ఖాన్ ఉన్నారు. ఇంతటి బృహత్కార్యాన్ని కేవలం 70 రోజుల్లో ముగించాల్సిన గురుతర బాధ్యత కమిటీ భుజస్కంధాలపై పడింది!

1947
ది అదర్ సైడ్

హాస్యాస్పదంగా భౌగోళిక విభజన!

దేశ విభజనలో తొట్టతొలుత తెరపైకొచ్చిన అంశం భౌగోళిక విభజన. ఈ బాధ్యతను బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు అప్పగించారు. ఆ మహానుభావుడు హడావుడిగా కేవలం నాలుగే వారాల్లో పని ముగించానని అనిపించాడట. బ్రిటిష్ ఇండియా మ్యాప్‌ను ముందు పెట్టుకుని, తనకు తోచినట్టుగా గీత గీసి 'ఇదే సరిహద్దు రేఖ' అని నిర్ధారించినట్టు చెబుతారు. దాన్నే రాడ్‌క్లిఫ్ రేఖగా పిలుస్తారు.

ముస్లిం సిపాయిలే కావాలన్న పాక్...

కమిటీ ఎదుర్కొన్న అతి పెద్ద సవాళ్లలో సాయుధ బలగాల పంపిణీ ఒకటి. చర్చోపచర్చల తర్వాత దాదాపు మూడింట రెండొంతుల సైన్యం భారత్‌కు, ఒక వంతు పాక్‌కు చెందాలని నిర్ణయించారు. ఆ లెక్కన 2.6 లక్షల బలగాలు భారత్‌కు దక్కాయి. పాక్‌కు వెళ్లిన 1.4 లక్షల మంది సైనికుల్లో అత్యధికులు ముస్లింలే ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. తమ వంతుకు వచ్చిన కొద్ది మంది హిందూ సైనికులను కూడా పాక్ వీలైనంత వరకూ వెనక్కిచ్చి బదులుగా ముస్లిం సిపాయిలనే తీసుకుంది. సైనిక పంపకాలను పర్యవేక్షించిన బ్రిటిష్ సైనికాధికారుల్లో జనరల్ సర్ రాబర్ట్ లాక్‌హార్ట్ భారత్‌కు, జనరల్ సర్ ఫ్రాంక్ మెసెర్వీ పాక్‌కు తొలి సైన్యాధ్యక్షులయ్యారు!

ప్రెసిడెన్షియల్ బగ్గీలో రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్



...బగ్గీ భారత్‌కే!

భారత్, పాక్ మధ్య పురాతన వస్తువులు, కళాఖండాల పంపకం ఓ పట్టాన తేలలేదు. మరీ ముఖ్యంగా బంగారు తాపడంతో కూడిన వైస్రాయ్ అందాల గుర్రపు బగ్గీ తమకే కావాలని ఇరు దేశాలూ పట్టుబట్టాయి. దాంతో చివరికేం చేశారో తెలుసా? టాస్ వేశారు! అందులో భారత్ నెగ్గి బగ్గీని అట్టిపెట్టుకుంది!

80:20 నిష్పత్తిలో చరాస్తులు

ఆఫీస్ ఫర్నిచర్, స్టేషనరీ వంటి చరాస్తులన్నింటినీ భారత్, పాక్ మధ్య 80:20 నిష్పత్తిలో పంచారు. చివరికి ఇదే నిష్పత్తిలో కరెంటు బల్బులను కూడా వదలకుండా పంచుకున్నారు!

జోయ్‌మోనీ, ద ఎలిఫెంట్!

జంతువులను కూడా రెండు దేశాలూ పంచేసుకున్నాయి. ఈ క్రమంలో జోయ్‌మోనీ అనే ఏనుగు పంపకం ప్రహసనాన్ని తలపించింది. దాన్ని పాక్‌కు (తూర్పు బెంగాల్‌కు, అంటే నేటి బంగ్లాదేశ్‌కు) ఇచ్చేయాలని నిర్ణయం జరిగింది. దాని విలువ ఓ రైలు బోగీతో సమానమని లెక్కగట్టారు. అలా ఓ రైలు బోగీ భారత్‌కు దక్కాలన్నది ఒప్పందం. కానీ విభజన వేళ జోయ్‌మోనీ మాల్దాలో ఉండిపోయింది. ఆ ప్రాంతం భారత్ (పశ్చిమబెంగాల్) వాటాకు వచ్చింది. దాంతో అది భారత్‌కే మిగిలిపోయింది.

ఆస్తులు, అప్పులు

ఆస్తులు, అప్పుల పంపకంపై కమిటీ తీవ్రంగా మల్లగుల్లాలు పడింది. చివరికి బ్రిటిషిండియా తాలూకు ఆస్తులు, అప్పుల్లో 17.5 శాతం పాక్‌కు చెందాలని తేల్చారు. దీనికి తోడు అదనంగా కొంత నగదు చెల్లించాల్సిందేనంటూ పాక్ భీష్మించుకుంది. అందుకు పటేల్ ససేమిరా అన్నారు. కశ్మీర్ పూర్తిగా భారత్‌కే చెందుతుందంటూ ఒప్పందంపై సంతకం చేస్తేనే నగదు సంగతి చూస్తామని కుండబద్దలు కొట్టారు. కానీ గాంధీ మాత్రం ఒప్పందం మేరకు పాక్‌కు డబ్బు చెల్లించాల్సిందేనంటూ ఏకంగా నిరాహార దీక్షకు దిగారు. దాంతో పటేల్ వద్దని మొత్తుకుంటున్నా 1947 జనవరి 20వ తేదీనే నెహ్రూ తాత్కాలిక సర్కారు పాక్‌కు రూ.20 కోట్లు చెల్లించింది. కానీ కశ్మీర్‌పై పాక్ దురాక్రమణ నేపథ్యంలో మరో రూ.75 కోట్ల చెల్లింపును నిలిపేసింది.

ఇప్పటికీ ఒకరికొకరు బాకీనే!

అప్పటికి చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు, నాణేలు 1948 మార్చి 31 దాకా ఇరు దేశాల్లోనూ చెల్లేలా ఒప్పందం జరిగింది. కానీ ఐదేళ్ల దాకా రెండు కరెన్సీలూ అక్కడా, ఇక్కడా చెలామణీ అవుతూ వచ్చాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నగదు పంపకాల గోల ఇప్పటికీ తేలలేదు! రూ.300 కోట్ల 'విభజన ముందటి మొత్తం' పాక్ బాకీ ఉందని భారత్ అంటోంది. 2022–23 కేంద్ర ఆర్థిక సర్వేలో కూడా ఈ మొత్తాన్ని పేర్కొనడం విశేషం. కానీ భారతే తనకు రూ.560 కోట్లు బాకీ అన్నది పాక్ వాదన!

కొసమెరుపు

భారత్, పాక్ విభజన 'పగిలిన గుడ్లను తిరిగి అతికించడ'మంత అసాధ్యమంటూ అప్పట్లో ఓ ప్రఖ్యాత కాలమిస్టు పెదవి విరిచారు. అంతటి అసాధ్య కార్యం ఎట్టకేలకు సుసాధ్యమైంది!

- సాక్షి, నేషనల్ డెస్క్

గ్లైడ్ బాంబ్ 'గౌరవ్' ప్రయోగం సక్సెస్



న్యూఢిల్లీ: సుఖోయ్–30 యుద్ధ విమానం నుంచి భారత్ మొట్టమొదటిసారిగా ప్రయోగించిన లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్(ఎల్ఆర్‌జీబీ)గౌరవ్ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని లాంగ్ వీలర్ ద్వీపంపైన ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని గ్లైడ్ బాంబ్ అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని రక్షణ శాఖ తెలిపింది. బాంబ్‌ను విడిచిపెట్టాక అది హైబ్రిడ్ నేవిగేషన్ వ్యవస్థ ద్వారా లక్ష్యం వైపుగా సాగిందని వివరించింది. సుమారు 1,000 కిలోల బరువుండే గౌరవ్‌కు దూర ప్రాంతంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని పేర్కొంది. దీనిని హైదరాబాద్‌లోని రీసెర్చి సెంటర్ ఇమారత్ రూపొందించి, అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన వైమానిక దళం, డీఆర్‌డీవో, ఇతర పరిశ్రమల అధికారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

'ఉపా' చట్టాలకైనా 'బెయిల్' పాటించాల్సిందే

నిందితులకు బెయిల్ ఇవ్వాలన్న సూత్రంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) వంటి అత్యంత కఠిన చట్టాల కింద అరెస్టయిన నిందితులకూ బెయిల్ సూత్రం వర్తింపజేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అనుమానిత ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించాడన్న ఆరోపణలపై అరెస్టయిన మాజీ కానిస్టేబుల్‌కు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యానించింది. ''బెయిల్ ఇవ్వాల్సిన అవసరం వచ్చినప్పుడు కోర్టులు పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. నిందితుడిపై తీవ్ర ఆరోపణలున్నా చట్ట ప్రకారం బెయిల్‌కు సంబంధించిన అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందే. బెయిల్ అనేది నియమం. బెయిల్‌ను తిరస్కరించి విచారణ ఖైదీగా జైలుకు పరిమితం చేయడం అనేది ఒక మినహాయింపు మాత్రమేననే సూత్రం ఎప్పుడో చట్టంలో అంతర్భాగమైంది. ఉపా వంటి కఠిన చట్టాలకూ దీన్ని వర్తింపజేయాల్సిందే. చట్టంలోని షరతులను సంతృప్తి పరిచే సందర్భాల్లో బెయిలివ్వాలి. లేదంటే 21వ ఆర్టికల్ కింద ఆ వ్యక్తి లభించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛా హక్కులకు భంగం వాటిల్లినట్లే'' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది.



కమల నేలబారు అభ్యర్థి

- బైడెన్ కంటే అసమర్థురాలు
- మస్క్ ఇంటర్వ్యూలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి కమలా హారిస్‌ను చవకబారు అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ఆడియో ఇంటర్వ్యూలో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. ''కమల నేలబారు అభ్యర్థి. ఆమె కంటే బైడెనే నయం. డెమొక్రటిక్ పార్టీలో తిరుగుబాటు వల్లే బైడెన్ రేసు నుంచి తప్పుకున్నారు. సరిహద్దు భద్రత విషయంలో కమలది ఘోర వైఫల్యం. ఆమె గెలిస్తే అక్రమ వలసలు భారీగా పెరుగుతాయి. వాటివల్లే అమెరికాలో నేరాలు పెరిగాయి'' అన్నారు.

హసీనాపై హత్యాభియోగాలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, మరో ఆరుగురిపై హత్యాభియోగాలు నమోదయ్యాయి. ఆరుగురిలో ఇద్దరు ఆమె కేబినెట్‌లో మంత్రులు, పదవి కోల్పోయిన పోలీస్ చీఫ్ తదితరులున్నారు. వీరు కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మంగళవారం అధికారులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన పదవికి రాజీనామా చేసి, భారత్‌కు పలాయనమైన తర్వాత హసీనాపై నమోదైన మొదటి కేసు ఇదే. జూలైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణల్లో ఓ దుకాణం యజమాని అబూ సయ్యద్ మరణించారు. ఈ ఘటనపై ఢాకాలోని మహ్మద్‌పూర్ ఏరియాకు చెందిన అబూ సన్నిహితుడు అమిర్ హంజా షతిల్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలంటూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాజేశ్ చౌదురి పోలీసులను ఆదేశించారని అధికారులు తెలిపారు. కాగా, ఫిర్యాదు చేసినందుకుగాను తనకు ఫ్రాన్స్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని అనంతరం షతిల్ చెప్పారు. కాగా, హత్యాభియోగాలు నమోదైన మంత్రులిద్దరూ రహస్యంగా ఇప్పటికే దేశం వీడగా మిగతా పోలీసు అధికారుల ఆచూకీ తెలియడం లేదని చెబుతున్నారు.

హిందువులతో యూనుస్ సమావేశం

బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ మంగళవారం శక్తిపీఠాల్లో ఒకటిగా పేరుగాంచిన ప్రఖ్యాత ఢాకేశ్వరి ఆలయం ఆవరణలో హిందూమత పెద్దలతో సమావేశమయ్యారు. ప్రజలందరి హక్కులకు రక్షణ కల్పిస్తామని ఈ సందర్భంగా యూనుస్ హామీ ఇచ్చారు. దాడులకు కారకులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత పాలకుల విధానాలే దేశంలో ప్రస్తుత పరిస్థితులకు కారణమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పని తీరును బేరీజు వేసే ముందు సంయమనంతో వ్యవహరించాలని హిందూమత పెద్దలను ఆయన కోరారు. 'అందరికీ సమాన హక్కులున్నాయి. అందరం ఒకే హక్కు ఉన్న ప్రజలం. మన మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు కల్పించవద్దు. దయచేసి, మాకు సహకరించండి ఓపిక పట్టండి. ఆ తర్వాత తీర్పు చెప్పండి. చేయగలిగి ఉండీ చేయడంలో విఫలమైతే మమ్మల్ని విమర్శించండి'అని యూనుస్ చెప్పినట్లు 'ది డైలీ స్టార్'పేర్కొంది.

న్యాయం కావాలి: హసీనా



ఢాకా/న్యూఢిల్లీ: అమాయకులను ఊచకోతకు, తీవ్రవాద చర్యలకు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఉదంతంలో న్యాయం కావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడాక ఆమె తొలిసారిగా మంగళవారం నోరువిప్పారు. హసీనా ప్రస్తుతం ఢిల్లీలో ఆశ్రయం పొందుతుండటం తెలిసిందే. అమెరికాలో నివసించే కుమారుడు సాజీబ్ వాజిద్ జాయ్ 'ఎక్స్' ఖాతాలో హసీనా తన ప్రకటనను విడుదల చేశారు. ''జూలై నుంచి ఆందోళనల పేరిట జరుగుతున్న హింసలో తీవ్ర ప్రాణనష్టం జరిగింది. పెచ్చరిల్లిన హింసాకాండలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు, గర్భిణులు, జర్నలిస్టులు, సాంస్కృతిక ఉద్యమకారులు, శ్రామికవర్గ ప్రజలు, అవామీలీగ్ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. నాలాగే ఆప్తులను కోల్పోయి బతుకీడుస్తున్న వారికి నా సానుభూతి'' అని హసీనా పేర్కొన్నారు.

బంగబంధుకు అవమానం

1975 ఆగస్టు 15వ తేదీన తన కుటుంబం ఊచకోతకు గురైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. హత్యకు గురైన బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ (హసీనా తండ్రి) స్మృత్యర్థం ఆగస్టు 15న ఇస్తున్న సెలవును యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మంగళవారం రద్దు చేసింది. బంగబంధు మ్యూజియంను తగలబెట్టడంపై హసీనా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఎవరి జ్ఞాపకాలతో, స్ఫూర్తితో మనం జీవించాలో దాన్నే కాల్చి బూడిద చేశారని పేర్కొన్నారు. 'ఎవరి నాయకత్వంలో బంగ్లాదేశ్ స్వాతంత్య్రం పొందిందో ఆయనకిది తీవ్ర అవమానం. ఈ దుశ్చర్యకు దేశప్రజలు నాకు న్యాయం చేకూర్చాలని కోరుతున్నాను' అని హసీనా అన్నారు. ఆగస్టు 15న జాతీయ సంస్మరణ దినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని, చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించాలని బంగ్లాదేశ్ ప్రజలకు పిలుపిచ్చారు.

వైద్యురాలి కేసు సీబీఐకి

సమ్మె విరమించిన వైద్యులు

కోల్‌కతా/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వైద్యురాలి హత్యాచారం కేసు విచారణకు సీబీఐ రంగంలోకి దిగింది. కేసును సీబీఐకి బదిలీ చేస్తూ కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశాలిచ్చింది. అనంతరం గంటల వ్యవధిలోనే ఫోరెన్సిక్, వైద్య నిపుణులతో కూడిన సీబీఐ ప్రత్యేక బృందం హుటాహుటిన కోల్‌కతా చేరుకుంది. కేసు దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది. నిందితున్ని కస్టడీలోకి తీసుకుని విచారించడమే గాక క్రైం సీన్‌ను రిక్రియేట్ చేయనుంది. మరోవైపు తమ ప్రధాన డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా స్పందించడంతో దేశవ్యాప్త సమ్మెను విరమిస్తున్నట్టు వైద్యులు ప్రకటించారు.

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సెక్యూరిటీ విధుల్లో ఉన్న ఓ ప్రబుద్ధుడు గత గురువారం రాత్రి ఓ ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి దారుణంగా హతమార్చడం తెలిసిందే. దీనిపై వైద్యులు, వైద్య సిబ్బంది భగ్గుమన్నారు. ఇందులో ఇతరుల హస్తమూ ఉందని, అందుకు సంబంధించిన సాక్ష్యాలన్నింటినీ పక్కాగా చెరిపేశారని ఆరోపించారు. దోషులందరికీ కఠిన శిక్షలు పడాలంటూ సోమవారం నుంచి దేశవ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆందోళనలకు తెర తీశారు. కేసు విచారణను సీబీఐకి అప్పగించాలంటూ బాధితురాలి తల్లిదండ్రులతో పాటు పలువురు పెట్టుకున్న పిల్స్‌పై కలకత్తా హైకోర్టు మంగళవారం విచారించింది. కోల్‌కతా పోలీసుల దర్యాప్తుపై పెదవి విరిచింది. ఐదు రోజులు దాటినా ప్రగతి లేదంటూ విచారణను సీబీఐకి బదలాయించింది.

ప్రిన్సిపల్ తీరు క్షమార్హం కాదు

ఈ ఉదంతంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ తీరు దారుణమంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం మండిపడ్డారు. ''కాలేజీ క్యాంపస్ లోపల ఏకంగా మహిళా డాక్టర్‌ను రేప్ చేసి దారుణంగా హతమార్చినా ఆయన సత్వరం స్పందించలేదు. హత్య జరిగిందంటూ కనీసం సకాలంలో పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. ఇది క్షమార్హం కాదు'' అంటూ తీవ్రంగా తలంటారు. వైద్య విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఘోష్ రాజీనామా చేయడం తెలిసిందే. మమత సర్కారు దాన్ని ఆమోదించకపోగా ఆయనను కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీ (సీఎన్ఎంసీహెచ్)కు బదిలీ చేయడంపై సీజే విస్మయం వెలిబుచ్చారు. తక్షణం సెలవుపై వెళ్లాలని ఘోష్‌ను ఆదేశించారు. తదుపరి ఆదేశాలిచ్చే దాకా ఇంటికే పరిమితం కావాలని స్పష్టం చేశారు.

డిమాండ్లకు కేంద్రం ఒప్పుకొంది: ఫోర్డా

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్స్ (ఫోర్డా) మంగళవారం రాత్రి ప్రకటించింది. ''మంత్రితో భేటీ అయ్యాం. వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు ఉద్దేశించిన కేంద్ర రక్షణ చట్టంపై ఫోర్డా సహకారంతో కమిటీ వేయాలనే ప్రధాన డిమాండ్‌ను 15 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు'' అని తెలిపింది.

22న దేశవ్యాప్త నిరసన

- సెబీ చీఫ్ రాజీనామా చేయాల్సిందే
- సెబీ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలి
- సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- రానున్న ఎన్నికల సన్నద్ధత, సంస్థాగత అంశాలపై చర్చ
- ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జ్‌లు, పీసీసీ అధ్యక్షులతో ఖర్గే భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్‌పర్సన్ మాధవి పురీ బుచ్, ఆమె భర్త ధవళ్‌కు వాటాలు ఉన్నాయని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన సంచలన ఆరోపణలపై రాజకీయ వేడి మరింత పెరిగింది. వివాదంలో కేంద్ర బిందువుగా మారిన మాధవి వెంటనే రాజీనామా చేయాలని, అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఈనెల 22వ తేదీన దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్‌లు, పీసీసీ చీఫ్‌లతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భేటీ తర్వాత పార్టీ ఈ ప్రకటన చేసింది. ఈ ప్రత్యేక సమావేశంలో రాబోయే ఎన్నికల కోసం పార్టీ సన్నద్ధత, సంస్థాగత అంశాలు, ఎన్నికలపరంగా జాతీయ ప్రాముఖ్యత గల వివిధ అంశాలు, సమస్యలపై ముఖ్యనేతలు విస్తృతంగా చర్చించారు. హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్‌లలో త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. ''అదానీ– మాధవి బుచ్ ఉదంతంలో ప్రధాని మోదీ పాత్ర కూడా ఉంది. ఒక సంస్థ ప్రయోజనాల కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ ఎంతగా ప్రలోభాలకు గురైందో ఈ ఉదంతం చాటుతోంది'' అని నేతలు భేటీలో తీర్మానం చేశారు. భేటీ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. హిండెన్‌బర్గ్ ఉదంతం సహా దేశంలోని పలు సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేసే అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని, అందుకుతగ్గ ప్రచారానికి రూపకల్పన చేసి ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. కేరళ వయనాడ్ కొండల్లో ప్రకృతి విలయతాండవం ధాటికి వందల మంది ప్రాణాలు కోల్పోవడంపై సమావేశం తీవ్ర ఆవేదనను, సంతాపాన్ని వ్యక్తం చేసింది. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న రాహుల్ డిమాండ్‌ను నేతలు పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌లో దాడులకు గురవుతున్న బాధిత మైనారిటీలు గౌరవంగా బతికేలా తగు సహాయక, పునరావాస చర్యలు తీసుకునేలా మోదీ ప్రభుత్వం బంగ్లాదేశ్ సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది.



ఏఐసీసీ భేటీ అనంతరం బయటికొస్తున్న ఖర్గే, రాహుల్, వేణుగోపాల్ తదితరులు

పేదలు, మధ్యతరగతిని వంచించారు: ఖర్గే

''స్టాక్‌మార్కెట్లో చిన్న మదుపరుల పెట్టుబడుల భవితవ్యం అగమ్యగోచరం కాకూడదు. హిండెన్‌బర్గ్ బట్టబయలుచేసిన సెబీ, అదానీల ఉదంతం యావత్‌భారతావనికి షాక్‌కు గురిచేసింది. సెబీ, అదానీ సంబంధాలను బయటపెట్టేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ నేతృత్వంలో దర్యాప్తు జరపాల్సిందే. రాజ్యాంగంపై దాడి నిరాటంకంగా కొనసాగుతోంది. కుల గణన అనేది ప్రజల డిమాండ్. ఈ అంశాలపై త్వరలో దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలను చేపడదాం. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందే. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి. దేశంలో హద్దులేని నిరుద్యోగం, పగ్గాల్లేని ద్రవ్యోల్బణంతో పేద, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పేదలు, మధ్యతరగతిని ప్రభుత్వం వంచించింది. రైళ్లు పట్టాలు తప్పడం, రైలు ప్రమాదాలు ఆనవాయితీగా మారాయి'' అని ఖర్గే అన్నారు.


జేపీసీ చీఫ్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్



న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్(సవరణ)బిల్లుపై పార్లమెంట్ సంయుక్త కమిటీ(జేపీసీ) ఖరారైంది. కమిటీ చైర్‌పర్సన్‌గా బీజేపీ సీనియర్ లోక్‌సభ సభ్యుడు జగదాంబికా పాల్‌ను స్పీకర్ ఓం బిర్లా నియమించారు. కమిటీలోని 31 మందిలో 21 మంది లోక్‌సభ సభ్యులుకాగా, 10 మంది రాజ్యసభ ఎంపీలని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. లోక్‌సభకు చెందిన 21 మందిలో ఎన్డీఏ పక్షాల సభ్యులు 12 మంది, బీజేపీకి చెందిన 8 మంది, ప్రతిపక్షాల నుంచి 9 మంది ఉన్నారు. అదేవిధంగా, 10 మంది రాజ్యసభ సభ్యుల్లో బీజేపీ నుంచి నలుగురు, విపక్షాలకు చెందిన నలుగురు, వైఎస్సార్‌సీపీకి చెందిన ఒకరు, నామినేటెడ్ సభ్యుడొకరు ఉన్నారు. ఈ కమిటీ వచ్చే లోక్‌సభ సెషన్ మొదటి వారం చివరి రోజున నివేదిక సమర్పించనుందని సెక్రటేరియట్ వివరించింది.

అతిశి కాదు గెహ్లోత్

- జెండా ఆవిష్కరణ బాధ్యతలు అప్పగింత
- కేజ్రీవాల్ అభ్యర్థనను బేఖాతరు చేసిన ఎల్‌జీ



గెహ్లోత్



అతిశి

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర పరిపాలనా వ్యవహారాల్లో అధికార ఆధిపత్యం కోసం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునే ఆప్ సర్కార్‌కు, ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య మరోసారి ఘర్షణాత్మక వేడి వాతావరణం నెలకొని చివరకు చల్లారింది. ముఖ్యమంత్రి అయిన తాను కటకటాల వెనక ఉండిపోవడంతో బదులుగా రాష్ట్ర మహిళా మంత్రి అతిశికి ఈసారి స్వాతంత్య్ర దినోత్సవ ఢిల్లీ రాష్ట్ర వేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరణ అవకాశం ఇవ్వాలన్న కేజ్రీవాల్ అభ్యర్థన లేఖను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ బేఖాతరు చేశారు. జైలు నుంచి అధికారిక లేఖ రాయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కేజ్రీవాల్ అభ్యర్థనను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తిరస్కరించారు. ఛాత్రాసాల్ స్టేడియంలో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ కోసం రాష్ట్ర హోం మంత్రి కైలాశ్ గెహ్లోత్‌ను నామినేట్ చేస్తూ ఎల్‌జీ నిర్ణయం తీసుకున్నారని 'రాజ్ నివాస్' మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్‌కు ఎల్‌జీ సచివాలయం కార్యదర్శి ఆశిష్ కుంద్రా లేఖ రాశారు. రాష్ట్ర మంత్రుల్లో ఎవరినైనా ఇందుకు ఎంపిక చేసుకునేందుకు ఎల్‌జీకి కేంద్ర హోం శాఖ మంగళవారం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఎల్‌జీ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

డేరా సచ్ఛా సౌదా చీఫ్‌కు 21 రోజుల పెరోల్



చండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి పెరోల్ సంపాదించి జైలు నుంచి తాత్కాలికంగా విడుదలయ్యారు. ఆయనకు పెరోల్ ఇవ్వద్దంటూ శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ గుర్మీత్‌కు పంజాబ్, హర్యానా హైకోర్టు పెరోల్ ఇచ్చింది. దీంతో మంగళవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. 21 రోజులపాటు ఆయన ఉత్తరప్రదేశ్‌లోని బర్నావా సమీపంలోని సొంత షా సత్నామ్ జీ ఆశ్రమంలో సేదతీరనున్నారు. తనకు 21 రోజుల పెరోల్ కావాలంటూ జూన్‌లో గుర్మీత్ హైకోర్టును ఆశ్రయించగా ఈ పిటిషన్‌పై సంబంధిత అధికార యంత్రాంగం తేల్చాలని హైకోర్టు ఆగస్ట్ 9వ తేదీన ఆదేశించడం తెల్సిందే. జనవరి 19వ తేదీన సైతం గుర్మీత్ ఏకంగా 50 రోజులపాటు పెరోల్‌పై బయటికొచ్చారు. తన ఇద్దరు మహిళా భక్తులను రేప్ చేసిన కేసులో దోషిగా తేలడంతో గుర్మీత్‌కు 2017 సంవత్సరంలో 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. అప్పటి నుంచి హరియాణాలోని రోహ్‌తక్ జిల్లా సునారియా కారాగారంలో గుర్మీత్ శిక్ష అనుభవిస్తున్నారు.

ఆశారాంకు ఏడు రోజుల పెరోల్



జైపూర్: ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూ(85)నకు రాజస్తాన్ హైకోర్టు ఏడు రోజుల పెరోల్ మంజూరు చేసింది. అత్యాచారం కేసులో జోధ్‌పూర్ సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆశారాం గతంలో రెండుసార్లు వేసిన పెరోల్ పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఆయన్ను విడుదల చేస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని పేర్కొంది. ఫిబ్రవరిలో ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో ఆశారాంను జోధ్‌పూర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. 11 ఏళ్లుగా జైలులో ఉన్న తన ఆరోగ్యం క్షీణిస్తోందని, చికిత్స చేయించకుంటే జైలులోనే మృతి చెందే ప్రమాదముందని వైద్యులు తెలిపారని ఆశారాం తరఫు లాయర్ పిటిషన్ వేశారు. దీనిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. వారం రోజుల పెరోల్ సమయంలో మహారాష్ట్రలోని పుణేకు వెళ్లి చికిత్స చేయించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సునేత్రను నిలబెట్టి తప్పుచేశా: అజిత్



ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ మహిళా ఎంపీ సుప్రియా సూలేపై తన భార్య సునేత్రను పోటీకి నిలబెట్టి పొరపాటు చేశానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని చీల్చిన అజిత్‌పవార్ బారామతిలో తన బాబాయి కుమార్తె సుప్రియాపైకి సునేత్రను పోటీకి నిలబెట్టడం, సునేత్ర ఓడిపోవడం తెల్సిందే. రాష్ట్రవ్యాప్త జన సమ్మాన్ యాత్రలో భాగంగా మంగళవారం ఒక మరాఠీ వార్తాఛానల్‌తో అజిత్ పవార్ మాట్లాడారు. '' నా సోదరీమణులంటే నాకెంతో ప్రేమ. రాజకీయాలు ఇంటి గడప దాటి లోపలికి వచ్చేలా చేసుకోకూడదు. అయితే నా సోదరి మీదనే భార్యను ఎన్నికల్లో పోటీకి నిలబెట్టి తప్పుచేశా. ఇలా జరగకుండా ఉండాల్సింది. అయితే సునేత్రను నిలబెట్టాలని పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయించంతో నేను కూడా ఏమీచేయలేకపోయా. తప్పు చేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నా'' అని వ్యాఖ్యానించారు. సుప్రియా చేతిలో ఓడిపోయిన సునేత్రా పవార్ తర్వాత రాజ్యసభకు ఎన్నికవడం తెల్సిందే.

హసీనా చెప్పిందంతా అబద్ధం: అమెరికా



వాషింగ్టన్: బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకుందన్న ఆరోపణలను అగ్రరాజ్యం తోసిపుచ్చింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియరీ సోమవారం మీడియాతో మాట్లాడారు. అమెరికా కోరినట్టుగా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని వారికి అప్పగించి, బంగాళాఖాతంలో ఆధిపత్యం చెలాయించడానికి అగ్రరాజ్యాన్ని అనుమతించి ఉంటే తాను ప్రధానిగా కొనసాగేదాన్నని హసీనా పేర్కొన్నట్లు వచ్చిన కథనాలను వదంతులుగా పియరీ కొట్టిపారేశారు. బంగ్లాదేశ్ ప్రజలే తమ ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయించుకుంటారన్నారు. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల సమస్యలపై గళం విప్పడానికి అధ్యక్షుడు జో బైడెన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటారని పియరీ పేర్కొన్నారు.

ఆ యూనివర్సిటీది 'వరద జిహాద్'

అసోం సీఎం శర్మ ఆరోపణలు



గువాహటి: అసోం–మేఘాలయ సరిహద్దుల్లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. అది వరద జిహాద్‌కు పాల్పడుతోందని, మక్కా గేట్ల మాదిరిగా వర్సిటీ గేట్లపై మూడు గుమ్మటాలున్నాయని వ్యాఖ్యానించారు. ''మేఘాలయలోని రి–భోయి జిల్లాలో వందెకరాల్లో విస్తరించి ఉన్న వర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయ (యూఎస్‌టీఎం) అసోం కొండలను తొలిచి పర్యావరణాన్ని దెబ్బతీస్తోంది. దానివల్లే మా రాష్ట్రానికి వరదల బెడద ఎక్కువైంది. దీనిపై ఎన్‌జీటీని ఆశ్రయిస్తాం'' అని చెప్పారు. మహబూబ్ ఉల్ హక్ అనే బెంగాలీ ముస్లిం ఈ వర్సిటీ స్థాపకుడు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం । 14 । ఆగస్టు । 2024



'పవిత్ర సంగమం' పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫెర్రీ వద్ద పవిత్ర సంగమం ప్రాంతాన్ని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, పి.నారాయణ మంగళవారం పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ మంగళవారం సాయంత్రానికి 38.94 టీఎంసీలకు చేరింది. దిగువకు 2,400 క్యూసెక్కులు వదిలారు.

వర్షంతో ఉపశమనం



విపరీతమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన విజయవాడ వాసులు మంగళవారం సాయంత్రానికి వరుణుడు పలకరించడంతో సేదదీరారు. వాహనదారుల రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్ కెనరానగర్‌కు చెందిన గీత కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

జాతీయ సమైక్యతను చాటి చెబుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



కాన్వాస్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో హర్ ఘర్ తిరంగా– కాన్వాస్‌పై సంతకాలు చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సృజన.. డీఆర్వో వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి కాన్వాస్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు డాక్టర్ ఎ.మహేష్, కేవీ సత్యవతి, పౌర సరఫరాల శాఖ డీఎం జి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ కె.రమేష్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలు రావాలి



పాయకాపురం(విజయవాడరూరల్): అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నుంచి జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొత్త ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు జిల్లా స్థాయి అటల్ టింకరింగ్ ల్యాబ్స్ వర్క్‌షాపు ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు జ్ఞాన సముపార్జన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 17 ఏటీఎల్ స్కూల్స్‌కు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, మెంటార్ రాజీవ్‌తో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగించుకోండి



ఉంగుటూరు: స్వర్ణభారత్ ట్రస్ట్ వంటి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న నైపుణాభివృద్ధి శిక్షణను యువత సద్వినియోగించుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని విజయవాడ చాప్టర్ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మంగళవారం ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. వృత్తి విద్యా కోర్సులపై ప్రభుత్వాలే కాకుండా ప్రైవేటు సంస్థలు కూడా దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దానిలో కొంత సేవా కార్యక్రమాలకు కేటాయించాలని పేర్కొన్నారు.

సర్దుబాటుపై పోరుబాట

ప్రభుత్వ తీరుతో షాక్ తిన్న ఉపాధ్యాయులు

- మంత్రి లోకేష్ మాట తప్పారంటూ ఆగ్రహం
- ఎన్టీఆర్ జిల్లాలో 771 మంది మిగులు టీచర్లు ఉన్నారన్న ప్రకటనపై మండిపాటు
- సీనియార్టీ గుర్తింపు విధానం సహేతుకంగా లేదంటూ ఆవేదన



జగ్గయ్యపేట డీఈఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పని సర్దుబాటు పేరుతో ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల వ్యవహారం రచ్చకెక్కింది. ప్రభుత్వం అన్ని జిల్లాల్లో మిగులు సిబ్బంది ఉన్నారంటూ ప్రకటన చేసి అడ్డగోలుగా బదిలీ చేసేందుకు ప్రయత్నించటంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల వారీగా సోమవారం విడుదల చేసిన సర్దుబాటు జాబితాపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మిగులు పేరుతో లెక్కకట్టిన అంశాలు సహేతుకంగా లేవని వారు మండిపడుతున్నారు. సీనియార్టీని తుంగలో తొక్కి విధుల్లో చేరిన తేదీకి బదులు పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకొని జాబితాలు తయారు చేశారని ఉపాధ్యాయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దాంతో ప్రాధాన్య పాయింట్లు కేటాయింపు గందరగోళంగా ఉందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

జిల్లాలో 385 మంది ఉపాధ్యాయులు అవసరం

ఎన్టీఆర్ జిల్లాలో సుమారుగా 385 మంది ఉపాధ్యాయులు అవసరమని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఆ మేరకు బదిలీలు చేయాల్సి ఉంది. అయితే విద్యాశాఖ జిల్లాలో 771 మంది మిగులు సిబ్బంది ఉన్నారని చెబుతోంది. వారిని బదిలీ చేయాల్సిందిగా జాబితాను ప్రకటించింది. అయితే ప్రభుత్వం జీవో నంబర్ 117 ప్రకారం మిగులు చూపిస్తోందని, దానిని ఉపాధ్యాయ సంఘాలు తప్పుపడుతున్నాయి. దాని ప్రకారం కాకుండా జీవో 53 ప్రకారం మిగులు లెక్కించాలని ఉపాధ్యాయులు వాదిస్తున్నారు. దీనిపై అటు ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయ సంఘాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

సహేతుకంగా లేదు..

ప్రభుత్వం సీనియార్టీ లెక్కింపు విషయంలో సహేతుకమైన విధానాన్ని పాటించలేదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఒకే డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను విధుల్లో చేరిన తేదీ, కేడర్ ఆధారంగా సీనియర్, జూనియర్‌గా పరిగణించాలి. అయితే అధికారులు వయస్సు ఆధారంగా వారి పుట్టిన తేదీని ఆధారం చేసుకొని సీనియార్టీని లెక్కించటంపై ఉపాధ్యాయులు తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని సంఘాలు కోరుతున్నాయి. అలాగే సొంత మేనేజ్‌మెంట్‌లో సర్దుబాటు జరిగిన తర్వాతనే ఇతర యాజమాన్యంలోకి నియమించాలని కోరుతున్నారు. అంతేకాకుండా సబ్జెక్ట్ టీచర్లు సర్దుబాటులో విద్యార్థుల సంఖ్య, సెక్షన్లు ఇలా చాలా అంశాలను సంఘాలు చెబుతున్నాయి. వీటి గురించి ఇటీవల జరిగిన సమావేశంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా అడ్డగోలుగా సర్దుబాటు ప్రక్రియను ప్రకటించారని సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈవోలకు వినతులు..

సర్దుబాటు జాబితాల విడుదలతో ఉపాధ్యాయులు సోమ, మంగళవారాలు ఎంఈవో కార్యాలయాలకు పరుగుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంఈవోలకు వినతులు వెల్లువెత్తాయి. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలపై ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను ఎంఈవోలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల ఎంఈవో కేంద్రాల వద్ద ఉపాధ్యాయులు వాగ్వాదానికి దిగటమే కాకుండా విజయవాడతో పాటుగా అన్ని ప్రాంతాల్లోనూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో 771 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో మార్పులు చేయటం ఏమిటని సంఘాల నేతలు ప్రశ్నించారు.

మంత్రి లోకేష్ మాట తప్పారు..

ప్రస్తుత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైనప్పుడు జీవో నంబర్ 117ను రద్దు చేస్తామని చాలా స్పష్టంగా హామీ ఇచ్చారని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. అయితే నేడు అదే నారా లోకేష్ అధికారుల ద్వారా ఆ జీవో ఆధారంగా చేసుకొని 771 మంది ఎన్టీఆర్ జిల్లాలో మిగులు ఉన్నారని చెప్పటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం యావత్ ఉపాధ్యాయులను విస్మయానికి గురి చేసిందంటున్నారు.

డీఎస్సీని ఎగ్గొట్టేందుకు కుట్రలు

అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఒకవైపు 16,347 టీచర్ పోస్టులకు ఇటీవల డీఎస్సీని ప్రకటించింది. దానికి సంబంధించి ఎంతో ఆర్భాటాలను చేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులను మిగులుగా చూపటం ద్వారా డీఎస్సీని ఎగ్గొట్టడానికి కుట్రలు చేస్తోందనే విమర్శలు ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఒక మాట తర్వాత మరో మాట మాట్లాడుతున్న తీరుపై ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తోంది.

సర్దుబాటులో సరైన విధానం లేదు..



ప్రభుత్వం ప్రకటించిన సర్దుబాటు ప్రక్రియకు సంబంధించి సరైన విధానం పాటించలేదు. అవసరమైన సిబ్బంది దిని మార్పు చేయాల్సి ఉండగా, మిగులు పేరుతో మార్పులు చేయటానికి జాబితా ప్రకటించటం సరైనది కాదు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన సహేతుకమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలి.

– ఏ. సుందరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

కేశఖండనశాల విస్తరణకు సహకరించండి

మంత్రులకు ప్లాన్ వివరించిన దుర్గగుడి ఈవో



కేశఖండనశాల భవన నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్ ఎదుట ఉన్న దుర్గగుడి కేశఖండనశాల విస్తరణకు చేపట్టిన ప్రతిపాదనలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు వివరించారు. దుర్గగుడి కేశఖండనశాలను మంత్రులు మంగళవారం పరిశీలించారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కేశఖండనశాల విస్తరణ చేపట్టాల్సి ఉందని, దీని నిమిత్తం పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ స్థలాన్ని దేవస్థానానికి కేటాయించాలని గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వాటర్ ట్యాంక్ స్థలం దేవస్థానానికి కేటాయించినట్లయితే ఆ ప్రాంతంలో అత్యాధునిక వసతులతో కేశఖండనశాల నిర్మిస్తామని, తలనీలాలు సమర్పించిన భక్తులు అండర్ పాస్ ద్వారా దుర్గాఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తారని వివరించారు. తిరిగి కేశఖండనశాలలో ఏర్పాటు చేసే లిఫ్టు ద్వారా ఘాట్‌రోడ్డులోని చైనా వాల్ వద్దకు చేరుకునేలా భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందుకు తగిన బిల్డింగ్ ప్లాన్‌ను దుర్గగుడి ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి మంత్రులకు చూపి వివరించారు.

కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి, దేవదాయ శాఖ కమిషనర్ కె. సత్యనారాయణ, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాడు అత్యుత్సాహం.. నేడు అతి వినయం

ఎమ్మెల్యే కొలికపూడి తీరుతో విస్తుపోతున్న తిరువూరు ప్రజానీకం

- అప్పట్లో వైఎస్సార్ సీపీ ఎంపీపీకి చెందిన భవనం కూల్చివేస్తానని హంగామా
- ఇప్పుడేమో అక్రమ కట్టడానికి వత్తాసు పలుకుతున్న వైనం
- వివాదాస్పదం అవుతున్న తిరువూరు ఎమ్మెల్యే వ్యవహారశైలి



ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/తిరువూరు: తిరువూరు ఎమ్మెల్యే నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుంచీ వివాదాలే.. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గాన్ని వివాదాల మయం చేస్తున్నారు. ఏదోక దుందుడుకు చర్యతో వార్తల్లో నిలుస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో సైతం వివాదాస్పద వ్యాఖ్యలతో సొంత క్యాడర్‌లోనే అసంతృప్తి రేగింది. ఆది నుంచి పార్టీని నమ్ముకొని ఉన్నవారిని లెక్క చేయపోవడంతో ఆయన తీరుపైన పలుమార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసిన ఆయన ప్రవర్తనలో మాత్రం మార్పురాలేదు. తీరా ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాక కూడా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు వివాదం అవుతూనే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి భర్త, చెన్నారావు నిర్మించిన భవనాన్ని అక్రమ కట్టడం పేరుతో కూల్చివేసే ప్రయత్నం చేశారు. తానే స్వయంగా బుల్డోజర్‌ని తీసుకెళ్లి కూల్చివేస్తానని హంగామా చేశారు. పోలీసులు, అక్కడ అధికారులు వారిస్తున్నా వినకుండా డాబా దిగువన ఉన్న గదిని కూల్చేశారు. రోడ్లపైన ఉన్న గోతులను పూడ్చాల్సింది అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆయనదే బాధ్యత. అయితే బాధ్యత మరిచి రోడ్డుపై ఉన్న నీటి గుంత ముందు కూర్చొని నిరసన తెలిపారు. సొంత పార్టీనేతలను లెక్క చేయకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండటంతో విస్సన్నపేటలో గ్రామ కమిటీ నాయకులు పార్టీకి గుడ్‌బై చెప్పారు.

తాజాగా మరొక వివాదంతో..

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి వివాదానికి తెరతీశారు. ఎమ్మెల్యే ప్రధానవీధిలో నడిబొడ్డున ఉన్న ఒక భారీ అక్రమ కట్టడంపై నగరపంచాయతీ తీసుకున్న చట్టపరమైన చర్యలను వ్యతిరేకిస్తున్నారు. ఆ కట్టడం ఒక వార్డు కౌన్సిలర్‌కు చెందినది కావడంతో ఆ సామాజికవర్గానికి తాను అండగా ఉంటానంటూ సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే చేస్తున్న హడావుడి చర్చనీయాంశమైంది. దీనికి తోడు అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని మరో వార్డు కౌన్సిలర్ చేస్తున్న ఆందోళనకు ఎమ్మెల్యే రాజకీయ రంగు పులిమారు. మంగళవారం అక్రమ కట్టడాలపై నగర పంచాయతీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ పాలకవర్గం వైఎస్సార్ సీపీ ఆధీనంలో ఉండగా, వ్యాపారులకు నష్టం కలిగించే చర్యలకు ఆ పార్టీ పాల్పడుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే పోస్టు చేస్తున్నారు. ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ, అక్రమ కట్టడాలపై చర్య తీసుకోవాలంటూ 9వ వార్డు కౌన్సిలర్ దుర్గారావు నగరపంచాయతీ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు.



పొక్లయిన్‌తో ఏకొండూరు ఎంపీపీకి చెందిన భవనాన్ని పడగొడుతున్న దృశ్యం(ఫైల్)



తిరువూరులో నగర పంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన దుకాణ సముదాయం

పార్టీకి సంబంధం లేదు..

అక్రమ కట్టడాల విషయంలో అధికారులే తగు నిర్ణయం తీసుకుంటారు. ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేదు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు సైతం తనకు సంబంధం లేని అంశాల్లో తలదూరుస్తూ నియోజకవర్గంలో అభద్రతా వాతావరణాన్ని సృష్టించడం సరికాదు. ఆయన వివాదాస్పద వైఖరి ఇకనైనా మార్చుకోవాలి.

– నల్లగట్ల స్వామిదాసు, తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

ప్రజల దృష్టి మళ్లించేందుకే..

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించడానికే తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఇతర అంశాలను తెరపైకి తెస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఏనాడూ తిరువూరులో వ్యాపారులతో కక్షసాధింపు ధోరణికి పాల్పడలేదని, సామరస్య పూర్వకంగానే వ్యవహరించిందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

'జ్వర' భద్రం!

మంచం పడుతున్న గ్రామాలు

- వైరల్ ఫీవర్ లక్షణాలతో వణుకు
- కొందరిలో టైఫాయిడ్, డెంగీ లక్షణాలు
- కొణకంచిలో ఆరోగ్య శాఖాధికారుల పర్యటన



కొణకంచిలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వర పరీక్షలు చేయించుకుంటున్న బాధితులు

పెనుగంచిప్రోలు: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు సీజనల్‌గా వచ్చే జ్వరాలు విజృంభిస్తున్నాయి. డయాగ్నోస్టిక్ సెంటర్లలో జ్వరాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకునేందుకు రోగులు క్యూ కడుతున్నారు. మండలంలో ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వర పీడితులతో పాటు అక్కడక్కడ వాంతులు, విరేచనాల వంటి డయేరియా లక్షణాలతో ఒకరిద్దరు ఆస్పత్రులకు వస్తున్నారు. స్థానికంగా ఉన్న ఆర్ఎంపీలతోపాటు నందిగామ, జగ్గయ్యపేట, మధిరలోని ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులు వెళ్తున్నారు. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్ లక్షణాలు ఎక్కువగా ఉంటున్నాయి. మరికొందరికీ డెంగీ లక్షణాలైన కీళ్లనొప్పులు కూడా ఉంటున్నాయని చెబుతున్నారు. జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయని భయంతో కొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు.

కొణకంచిలో అధికంగా..

మండలంలోని కొణకంచి గ్రామంలో జ్వర పీడితులు అధికంగా ఉన్నారని గ్రామస్తులు అంటున్నారు. ప్రతి ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వర పీడితులు ఉన్నారన్నారు. జ్వరాలు అధికంగా ఉండటంతో గ్రామంలో ప్రత్యేకంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. మంగళవారం డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మోతీబాబు గ్రామంలో పర్యటించటంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే గుమ్మడిదుర్రు, అనిగండ్లపాడు, తదితర గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయి.

100 దాటుతున్న ఓపీ..

పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ ప్రస్తుతం 100 దాటుతోంది. గతంలో రోజూ 40 నుంచి 50 ఉండేదని వైద్య సిబ్బంది అంటున్నారు. మంగళవారం 15 మంది వరకు జ్వర పీడితులు వచ్చారన్నారు. ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారించి మందులు ఇస్తున్నామన్నారు. దోమల వల్ల జ్వరాలు వస్తున్నాయని, గ్రామాల్లో దోమల నివారణకు దోమల మందు స్ప్రే చేయటంతో పాటు మురుగు నిల్వ ఉండకుండా చూడాలని అంటున్నారు.

సీజనల్ జ్వరాలు ఉన్నాయి..



సీజనల్ జ్వరాలు గ్రామాల్లో ఉన్నాయి. కొందరిలో టైఫాయిడ్ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. కొణకంచిలో జ్వరాల తీవ్రత ఉందన్న కారణంగా ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. పరీక్షలు చేస్తున్నారు. జ్వరం వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలి. దోమల నివారణ చర్యలు చేపట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

– పి. ఇందిర, వైద్యాధికారి, పెనుగంచిప్రోలు

రిహార్సల్స్ అదుర్స్.. సిబ్బంది నుంచి మాక్ గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్



సంబరానికి సంసిద్ధం

స్వాతంత్ర్య దినోత్సవానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం జరగనున్న వేడుకలకు సంబంధించి ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌ను కూడా మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. వీటిని తిలకించిన ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా నినాదంతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



సమైక్యత చాటుదాం.. హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

గుడిలో దుర్గమ్మను ఫొటో తీసేందుకు భక్తుడి యత్నం

సెల్‌ఫోన్ తీసుకుని హుండీలో వేసిన ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఓ భక్తుడు నిబంధనలను అతిక్రమించి సెల్‌ఫోన్‌తో దుర్గ గుడిలోకి ప్రవేశించాడు. అమ్మవారిని ఫొటో తీసేందుకు ప్రయత్నించాడు. దీనిని గుర్తించిన ఆలయ అధికారులు ఆ భక్తుడి నుంచి సెల్‌ఫోన్ లాక్కుని హుండీలో వేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వారం క్రితం కూడా ఓ భక్తుడు అమ్మవారి మూలవిరాట్‌ను సెల్‌ఫోన్‌తో చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన సంగతి విదితమే. ఆదివారం నుంచి భక్తులు ఎవరూ సెల్‌ఫోన్‌తో ఆలయంలోకి ప్రవేశించకుండా ఆలయ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని మైక్ ప్రచార కేంద్రం నుంచి పదే పదే సెల్‌ఫోన్లతో ఆలయంలోకి ప్రవేశించవద్దని సూచనలు చేస్తూనే ఉన్నారు. అయితే సోమవారం రాత్రి ఓ భక్తుడు తన ఖరీదైన సెల్‌ఫోన్‌తో ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారిని ఫొటో తీసేందుకు ప్రయత్నించాడు. ఇంతలో అక్కడే ఉన్న సెక్యూరిటీ, ఆలయ సిబ్బంది వెంటనే గమనించి కేకలు వేయడంతో ఆ భక్తుడు సెల్‌ఫోన్ తీసుకుని రావి చెట్టు వైపు పరుగు తీశాడు. ఆ భక్తుడికి పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని ఆలయ ఈఓ రామరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈఓ ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆ భక్తుడి నుంచి సెల్‌ఫోన్ తీసుకుని ఆలయంలో ఉన్న హుండీలో వేశారు. హుండీ కానుకల లెక్కింపు సమయంలో సెల్‌ఫోన్‌ను బయటకు తీస్తారని, అప్పుడు దానిని ఏమి చేయాలో ఆలోచిస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

పంట కాలువలో పడి వ్యక్తి మృతి



ఉంగుటూరు: ప్రమాదవశాత్తు పంటకాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తేలప్రోలులో మంగళవారం జరిగింది. ఉంగుటూరు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గారపాడుకు చెందిన బొకినాల జోజి (48) వ్యవసాయం పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం రాత్రి తన బైక్ కోసం కొత్త టైర్ తెచ్చుకునేందుకు తెలిసిన వారి బైక్‌పై తేలప్రోలు వెళ్లాడు. జోజి ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. మంగళవారం ఉదయం తేలప్రోలు–ఉంగుటూరు రహదారిలో అట్టల ప్యాక్టరి సమీపంలో పంటకాలువలో ఓ వ్యక్తి బైక్‌తో పాటు నిర్జీవంగా పడి ఉండటాన్ని వ్యవసాయ కూలీలు గమనించి పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాలువలో ఉన్న మృతుడు గారపాడుకు చెడిన జోజిగా గుర్తించారు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు ఆత్కూరు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాబు మెతకే.. వెనక మేమున్నాం..

- తాము చెప్పినట్లు వినాలని అధికారులకు టీడీపీ మండల నాయకుల ఆదేశాలు
- నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులపై తీవ్ర ఒత్తిళ్లు
- అధికారులను సైతం ఏక వచనంతో సంబోధిస్తున్న వైనం
- షాడో ఎమ్మెల్యేల తీరుతో తలపట్టుకుంటున్న ఎమ్మెల్యే బాబు



సాక్షి నెట్‌వర్క్: 'ఎమ్మెల్యే బాబు చాలా మెతక. ఏం మాట్లాడటం లేదని అనుకోవద్దు. మీరు అలా అనుకుని తేలిగ్గా తీసుకుంటే సహించేది లేదు. బాబు వెనుక మేం ఉన్నాం. మా దృష్టికి అన్నీ తెలుస్తాయి. మేము చెప్పినట్లు వినాల్సిందే' అంటూ ఆ నియోజకవర్గంలో అధికారులు, ఉద్యోగులపై టీడీపీ మండల స్థాయి నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. తన మాటను సైతం కాదని, తమ పంతమే నెగ్గాలనేలా షాడో ఎమ్మెల్యేల్లా మండల స్థాయి నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది. మండల స్థాయి నాయకులు తమను ఏకవచనంతో పిలుస్తుండటం అధికారులకు మింగుడు పడటం లేదు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం పక్క నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..

- నియోజకవర్గంలోని ఒక మండలంలో పని చేస్తున్న ఎస్ఐకు తానున్నానంటూ ఎమ్మెల్యే బాబు భరోసా ఇచ్చారు. అయితే షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తున్న మండల నాయకుడు మాత్రం ఆ ఎస్ఐ బదిలీకి పట్టుబట్టారు. ఇటీవల పక్క నియోజకవర్గానికి చెందిన ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొట్టి ఆ మండలానికి చెందిన వృద్ధుడు తీవ్రంగా గాయపడి చనిపోయారు. ఈ కేసును రాజీ చేయడంలో సదరు మండల స్థాయి నాయకుడు చక్రం తిప్పి పెద్దమొత్తంలో నగదును తన జేబులో వేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసును రాజీచేసే క్రమంలో సదరు ఎస్ఐ తనకు సహకరించలేదని ఆ నాయకుడు పగ పెంచుకున్నాడు. ఎస్ఐను బదిలీ చేయాల్సిందేనంటూ ఎమ్మెల్యే వద్ద భీష్మించుకుని కూర్చున్నాడు. అంతే కాదు ఎస్ఐని సూటిపోటి మాటలతో హింసిస్తున్నాడు. అధికార పార్టీ నాయకుడు కావడంతో ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక చివరకు ఆ ఎస్ఐ కాస్తా బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతూ, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు.
- వైఎస్సార్ సీపీ పాలనలో ఇసుక అక్రమ రవాణా, చెరువులను అక్రమంగా తవ్వేస్తున్నారంటూ గగ్గోలుపెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు తామే అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెరువులు తవ్వడమే కాకుండా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లు వదిలేయాలని రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు.
- ఉద్యోగుల బదిలీలకు సంబంధించి తన తండ్రి హయాంలో పనిచేసిన వారికి, తమకు అనుకూలంగా ఉంటామనే వారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఎమ్మెల్యే బాబు పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. ఈ పోస్టింగుల విషయంలో ఎమ్మెల్యే పీఏ, మండల స్థాయి నాయకుల ప్రమేయం అధికంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇదే నియోజకవర్గంలోని మరొక మండలంలో వెలుగులో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది సైతం తన ఇంటికి రావాలని, ఏం జరుగుతుందో వివరాలు చెప్పాలని ఆ మండలంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుడు హుకుం జారీ చేశాడు. ఆ శాఖకు సంబంధించిన సమావేశాలను సైతం తన ఇంటి వద్దే నిర్వహించాలని ఆదేశించాడు. దీంతో సదరు అధికారులు, ఉద్యోగులు భయపడి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మొరపెట్టుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సతీమణి సదరు నాయకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించుకోవాలని, అక్కడికే ఎవరైనా వస్తారని సదరు వెలుగు ఉద్యోగులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అయినా కూడా కొందరిపై ఆ నాయకుడు అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నాడు.

రాజకీయ ప్రేరేపిత కుట్రే



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాది వెంకటేష్‌శర్మ, న్యాయవాదులు

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాది కోటంరాజు వెంకటేష్‌శర్మ ఆరోపించారు. అగ్రిగోల్డ్ భూ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్‌కు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన అనంతరం కేసు పూర్వాపరాలను న్యాయం స్థానం వెలుపల మంగళవారం రాత్రి ఆయన మీడియాకు వెల్లడించారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారమే రాజీవ్ భూములు కొన్నారని, కొనుగోలు చేయడానికి 20 రోజులు ముందుగానే పత్రికా ప్రకటన విడుదల చేశారని చెప్పారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతోనే ఒక్కోటి 358 గజాలున్న మూడు ప్లాట్‌లను కొనుగోలు చేశారని తెలిపారు. ఈ కేసులో 'మీరేమీ తప్పు చేసినట్టు కాదు'అని న్యాయమూర్తి కూడా నిందితుడితో అన్నట్టు పేర్కొన్నారు. కేసులో ఇతర నిందితులుగా పేర్కొన్న పలువురు ప్రభుత్వాధికారులను అరెస్టు చూపకపోవడంపై ఏసీబీ అధికారులను న్యాయమూర్తి ప్రశ్నించినట్టు తెలిపారు. కోర్టుకు నాలుగు రోజుల సెలవులకు ముందు ఏసీబీ అధికారులు రాజకీయ కుట్రపూరితంగా రాజీవ్‌ను అరెస్టు చేశారని వెంకటేష్‌శర్మ ఆరోపించారు. ఆయన తండ్రి జోగి రమేష్‌పై కూడా పలు కేసులు పెట్టి వేధిస్తున్నారు. సమావేశంలో లీగల్ సెల్ న్యాయవాదులు సీహెచ్ ఆదాం, ఒగ్గు గవాస్కర్, సాయిరాం, నిరంజన్, నిర్మల్ రాజేష్, సౌమ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, పక్కన డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత వైద్యాధికారులు, కార్యక్రమ అధికారులు, సబ్ యూనిట్ అధికారులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలపై పునశ్చరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రభుత్వాస్పత్రిలోని పుష్కర్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి మాట్లాడుతూ.. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం అమలు, వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధులు, అవి ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. దోమలు, లార్వా నియంత్రణ కార్యక్రమం, ఫాగింగ్ నిర్వహణ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, కృష్ణా జిల్లా మలేరియా అధికారి బి.రామారావు జాతీయ మలేరియా విభాగం అధికారి డాక్టర్ ధనలక్ష్మి, స్టేట్ అసిస్టెంట్ మలేరియా అధికారి పార్వతీశం, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

క్వారీల్లో కార్మికుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఇఫ్టూ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్వారీలు, ఫ్యాక్టరీల్లో జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. యాజమాన్యాలపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలని కోరారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా క్వారీ, ఫ్యాక్టరీల్లో జరుగుతున్న కార్మికుల మరణాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని, ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉబర్, ఓలా బైక్ సర్వీసులను నియంత్రించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను, వారి హక్కులను అమలు చేయాలని ఇఫ్టూ డిమాండ్ చేసింది. రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాలోని క్వారీలు, ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రమాదాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ అండతో క్వారీ యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని పేర్కొన్నారు. అల్ట్రా టెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుల మృతికి ప్రభుత్వమే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. బీసీడబ్ల్యూయు జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు హరికృష్ణ రెడ్డి, షేక్ మీరావలి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కార్మికులు యాజమాన్యాల కింద బానిసల్లా బతికే పరిస్థితికి పాలకవర్గాలు తీసుకువస్తాయన్నారు. ఆ దిశగానే సంస్కరణలు తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు బాజీ, కనకరావు, శ్రీను, భాస్కర్, కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాజరిక చిహ్నాలు ప్రజల జీవితాల్లోకి ప్రవేశించకూడదు

రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్



సదస్సులో మాట్లాడుతున్న బెజవాడ విల్సన్


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య దేశంలో 'సింగోల్'వంటి రాచరిక చిహ్నాలు ప్రజల జీవితాల్లోకి ప్రవేశించకూడదని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, సఫాయి కర్మచారీ ఆందోళన్ నేత బెజవాడ విల్సన్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో 'రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలి'అని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బెజవాడ విల్సన్ మాట్లాడుతూ.. పాలకులు చేసే తప్పులను ఎత్తిచూపే వారి నోళ్లు నొక్కేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ చేసే ప్రతి పని వెనుక వ్యూహం ఉంటుందన్నారు. 1993లో చేతులతో మలమూత్రాలు తీయకూడదనే చట్టం వచ్చిందని, కానీ ఈ చట్టం కింద ఒక్క కేసు నమోదు కాలేదని వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. రాజ్యం మత విశ్వాసాలపై, ఆర్థిక అంశాలు కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉండాలనే పద్ధతిలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఏఐసీసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం ఇచ్చే సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూకు బహుమతిగా ఇచ్చిన రాజదండాన్ని పక్కన పెట్టారని గుర్తు చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. బీజేపీ అధ్యక్ష తరహా పాలన తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీని బలపరిచే వారిని కూడా వ్యతిరేకించాలని కోరారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ.. డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవటం, సరిగా అమలు జరిగేలా చూడడం ప్రజల బాధ్యతన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, మైనార్టీ నాయకుడు మునీర్ అహ్మద్, దళిత సంఘాల నాయకులు టి.చిట్టిబాబు, కొరివి వినయ్‌కుమార్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

స్టాకు పాయింట్ వద్ద సిబ్బంది మార్పు

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు పాయింట్ వద్ద సిబ్బందిని మారుస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. 'పగలు తోడేస్తూ.. రాత్రి తోలేస్తూ..' శీర్షికన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద పరిస్థితులపై 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు స్టాకు యార్డు వద్ద నెల రోజులుగా పని చేస్తున్న ఏడుగురు సిబ్బందిని మారుస్తున్నట్లు తెలిపారు. రెండు షిఫ్టులుగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్టాకు పాయింట్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరునెలల చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం




చిన్నారి ఆశ్విన్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అరుదైన సమస్యతో బాధపడుతున్న ఆరునెలల చిన్నారికి హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ అండగా నిల్చారు. చిన్నారికి చేసే శస్త్రచికిత్స ఖర్చు మొత్తం భరిస్తానని హామీ ఇచ్చారు. బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన సాదిమెళ్ల రవికుమార్, రాజాకుమారి దంపతుల కుమారుడు ఆశ్విన్ మల ద్వారం లేకుండా జన్మించాడు. ఈ అరుదైన సమస్యను శస్త్రచికిత్సతో సరిచేయొచ్చని, రూ.4 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. రోజువారీ కూలి పనులు చేసుకునే రవికుమార్, రాజాకుమారి దంపతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తమ గ్రామానికి చెందిన గండేపూడి నితీష్‌కుమార్ సహకారంతో పారిశ్రామికవేత్త, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్‌ను మంగళవారం ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఆవేదన, చిన్నారి పరిస్థితి చూసి చలించిన పుట్టగుంట వెంటనే ఆంధ్రా హాస్పిటల్ ఎండీ రమణమూర్తితో ఫోన్‌లో మాట్లాడారు. బాలుడి శస్త్రచికిత్సకు అయ్యే ఖర్చులన్నీ తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో ఆశ్విన్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేపట్టారు.

పామర్రులో దొంగల హల్‌చల్

పామర్రు: మండల కేంద్రమైన పామర్రులో సోమవారం దొంగలు హల్‌చల్ చేశారు. సెల్‌ఫోన్ షాపు, ఎలక్ట్రికల్ షాపు, టిఫిన్ సెంటర్ పై కప్పులు పగలగొట్టి చోరీలకు పాల్పడ్డారు. స్థానిక ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న ప్రసాద్ మొబైల్స్ షాపు పై కప్పు రేకును బద్దలు కొట్టి షాపులోకి ప్రవేశించి రెండు సెల్ ఫోన్‌లు, రెండు ఇయర్‌బడ్స్, కౌంటర్‌లో ఉన్న రూ.2 వేల నగదును చోరీ చేశారు. ఆ షాపునకు సమీపంలోనే ఉన్న మధురవాణి ఎలక్ట్రికల్ షాపులో ప్రవేశించేందుకు పైకప్పు రేకులను బద్దలు కొట్టారు. రేకు కింద భాగంలో ఇనుప మెస్ ఉండటంతో చోరీకి వీలుపడలేదు. అదే రోడ్డు లోని అన్నపూర్ణ టిఫిన్ సెంటర్ పై కప్పు రేకులను బద్దలు కొట్టి దానిలోకి ప్రవేశించి రూ.300 నగదు అపహరించారు. పోలీసుల గస్తీ ఉండే ప్రధాన కూడలికి కూతవేటు దూ రంలో చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తన దుకాణంలో రూ.35 వేల విలువైన వస్తువులను దొంగలు అపహరించారని ప్రసాద్ మొబైల్స్ షాపు యజమాని జుఝవరపు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

కాలుజారి బావిలోపడి రైతు మృతి



మోపిదేవి: మండలంలోని మేళ్లమర్రు గ్రామానికి చెందిన ఆకుల రామయ్య(53) మంగళవారం తెల్లవారుజామున బావిలో శవమై తేలాడు. పోలీసుల కథనం మేరకు.. ఆకుల నాగలక్ష్మి, రామయ్య భార్యాభర్తలు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోమవారం రాత్రి తన పొలానికి నీరు పెట్టేందుకు రామయ్య ఇంటి నుంచి వెళ్లాడు. మంగళవారం ఉదయం నీళ్లు తోడేందుకు పెరటిలోని బావి వద్దకు వెళ్లిన నాగలక్ష్మికి భర్త నిర్జీవంగా నీటిలో తేలుతూ కనిపించాడు. దీంతో ఆమె భోరున విలపించింది. ఇరుగుపొరుగు వారు వచ్చి రామయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. అర్ధరాత్రి సమయంలో పొలం నుంచి ఇంటికి వచ్చిన రామయ్య బావి వద్ద కాళ్లు కడిగే క్రమంలో కాలుజారి బావిలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి దుర్మరణం



పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. కానూరు ఆటోనగర్‌లోని బాలాజీ రెడీమిక్స్ ప్లాంట్‌లో ఒడిశాకు చెందిన సంజయ్‌సొలి (34) కార్మికుడిగా పనిచేస్తూ ఆ ఆవరణలో రేకుల షెడ్డులో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి కాంక్రీట్ వర్కుకు వెళ్లి మంగళవారం వేకువజాము మూడు గంటలకు తిరిగి ప్లాంట్‌కు వచ్చాడు. స్నానం చేసి ఉతికిన దుస్తులను రోజూ ఆరవేసే తీగపై వేశాడు. అప్పటికే ఆ తీగకు విద్యుత్ ప్రసరిస్తుండటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్లో మహిళ మెడలో నాన్‌తాడు చోరీ

ఫిర్యాదు స్వీకరించేందుకు జీఆర్‌పీ పోలీసుల నిరాకరణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్లే ఏసీ బోగీలో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు నాన్‌తాడును ఓ ఆగంతకుడు చోరీ చేశాడు. ఈ ఘటనపై ఫిర్యాదును స్వీకరించేందుకు విజయవాడ, గుడివాడ, భీమవరం జీఆర్‌పీ పోలీసులు నిరాకరించారు. బాధితురాలి కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన కొండేటి గోదాదేవి సోమవారం రాత్రి తన పిల్లలతో కలిసి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట నుంచి భీమవరం బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల సమయంలో విజయవాడ స్టేషన్‌లో రైలు ఆగి తిరిగి కదులుతుండగా ఆగంతకుడు ఏసీ బోగీలో నిద్రిస్తున్న కొండేటి గోదాదేవి మెడలో నాన్ తాడును తెంపుకొని పారిపోయాడు. నాన్‌తాడును తెంపుకెళ్లే క్రమంలో ఆమెకు మెలకువ వచ్చి గట్టిగా పట్టుకోవడంతో ఒక ముక్క ఆగంతకుడి చేతికి చిక్కింది. భోగీలో తన పిల్లలను వదిలి దొంగను పట్టుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు. చోరీ సమాచారాన్ని 139 నంబర్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులకు, వారి ద్వారా జీఆర్‌పీ పోలీసులకు గోదాదేవి తెలిపారు. రైలు విజయవాడ దాటి గుడివాడ వెళ్తోంది కనుక అక్కడ ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చి తప్పుకొన్నారు. గుడివాడలో ఫిర్యాదు చేయబోగా ప్రయాణికురాలు దిగే స్టేషన్ భీమవరం కనుక అక్కడ ఫిర్యాదు చేయాలని జీఆర్‌పీ పోలీసులు సూచించారు. భీమవరంలో ఫిర్యాదు చేయబోగా అక్కడి జీఆర్‌పీ పోలీసులు నిరాకరించారు. చోరీ విజయవాడలో జరిగినందున అక్కడే ఫిర్యారు చేయండి అంటూ భీమవరం జీఆర్‌పీ పోలీసులు సూచించారు. దీంతో బాధితురాలు మంగళవారం తన ఫిర్యాదును విజయవాడ జీఆర్‌పీఎఫ్ కొరియర్ ద్వారా పంపించారు. ఏసీ బోగీలో ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన ఎస్కార్టులు లేకపోవడమే ఇటువంటి చోరీలకు కారణమని ప్రయాణికులు పేర్కొంటున్నారు. రైలులో చోరీలు జరిగినప్పుడు ప్రయాణికులు తమ ప్రయాణం చివరి స్టేషన్‌లో దిగి అక్కడ ఫిర్యాదు చేస్తే సదరు స్టేషన్ సిబ్బంది జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఘటన జరిగిన పరిధిలోని జీఆర్‌పీ స్టేషన్‌కు బదిలీ చేస్తారు. అయితే గోదాదావి విషయంలో సకాలంలో స్పందించాల్సిన జీఆర్‌పీ పోలీసులు తమకు సంబంధమే లేనట్టు ఫిర్యాదు తీసుకోవడానికే ససేమిరా అనడంపై ప్రయాణికులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రంలో మేటి.. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్



విజేతలకు అవార్డులను అందిస్తున్న ఏపీ జేడీ పద్మారావు

ఏపీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పద్మారావు

గుడ్లవల్లేరు: రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను అందించే కాలేజీల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ ముందంజలో ఉందని ఏపీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వెలగా పద్మారావు అన్నారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని కాలేజీలో మంగళవారం వల్లూరుపల్లి రామ శేషాద్రిరావు స్మారక బహుమతుల అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంకేతిక విద్యా మండలి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ ర్యాంకర్స్‌కు వీవీఆర్ఎస్ఆర్ స్మారక అవార్డులను ఏటా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విజేతలు వీరే..

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో 2024 సంవత్సరానికి ప్రథమ ర్యాంకులు సాధించిన పి.రిషికకు రూ.10వేల విలువైన బంగారు పతకం, రూ.10 వేల నగదు, డీటీఈ ధ్రువీకరించిన ప్రశంసా పత్రాన్ని పద్మారావు చేతుల మీదుగా అందించారు. అన్ని ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ద్వితీయ ర్యాంకులు సాధించిన ఎ.యశస్వినికి రూ.5 వేల బంగారు పతకం, రూ.5వేల నగదు, డీటీఈ ధ్రువీకరించిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కాలేజీ కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రెసిడెంట్ వల్లభనేని సుబ్బారావు, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీటీడీసీ బెరంపార్క్‌లో నేడు రక్తదాన శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్(పున్నమి హోటల్)లో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పరుచూరి కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, గుంటూరుకు చెందిన రెయిన్‌బో బ్లడ్ సెంటర్ సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసి, దేశభక్తిని చాటాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం మరొకరి ప్రాణదానం అవుతుందని, అటువంటి బృహత్తర కార్యక్రమంలో పర్యాటకులు, సందర్శకులు పాల్గొనాలని కోరారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ నగరంలోని కబేళా, చేపల మార్కెట్లు, మాంసం దుకాణాల్లో విక్రయాలకు బంద్ ప్రకటించామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి నుంచి కబేళాలో జంతువులను వధించటం నిషేధించామని, ఈ నిబంధన మేరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లలో ఆ రోజు వ్యాపారం చేయకూడదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించినా, దుకాణాలు తెరిచినా, మటన్, చికెన్, చేపలను విక్రయించినా వారిపై ప్రజారోగ్య చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

ఓపెన్ స్కూల్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం అందించే ఓపెన్ స్కూల్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవీంద్రనాథ్ తెలిపారు. విద్యాపీఠం అందించే కోర్సుల వివరాలతో కూడిన పోస్టర్‌ను రవీంద్రనాథ్ నగరంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్మీడియెట్ కోర్సులను నిర్వహిస్తోందన్నారు. ఏ వయసు వారైన ఆ కోర్సులను అభ్యసించవచ్చన్నారు. నగరంలోని విశ్వభారతి విద్యానికేతన్ పాఠశాలలోని కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ బాబురావు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 74 మందికి జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): మద్యం సేవించి వాహనాలను నడిపిన 74 మంది వ్యక్తులకు న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలను నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం 1, 2, 4 ట్రాఫిక్ పోలీసులు మొత్తం 74 కేసుల్లో మద్యం తాగి వాహనాలను నడిపిన వారిని సంబంధిత 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, రైల్వే కోర్టుల్లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు, ఆర్వీ శర్మ 10 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 64 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామని కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని పేర్కొన్నారు.

వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోస్తా ప్రాంతంలో గుండె వైద్యంలో తొలి ఆస్పత్రిగా ఏర్పాటు చేసి, 36 ఏళ్లగా అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యంగా, వైద్య రంగంలో అనేక నూతన ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకు వచ్చామని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చెప్పారు. ఆస్పత్రి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హోటల్ డీవీ మానర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆస్పత్రి సేవలను వివరించారు. 1988 నుంచి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, నూతన ఆవిష్కరణలను నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలో క్లీవ్ అండ్ క్లినిక్‌ల స్ఫూర్తితో ప్రత్యేకమైన వెల్‌నెస్ సెంటర్లు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, రాజధాని ప్రాంతంలో క్యాటర్నరీ కేర్ హాస్పిటల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో హాస్పిటల్ చైర్మన్ ఎంఎస్ రామ్మోహనరావు, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఎంసీ దాస్, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు రిహార్సల్స్ పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 15న జరిగే రాష్ట్ర స్థాయి 78వ స్వాతంత్ర్య దిన వేడుకలకు రిహార్సల్స్ పూర్తయ్యాయి. ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించి సన్నద్ధతను ప్రకటించారు. రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ(పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి స్టేడియంలో మంగళవారం నిర్వహించిన రిహార్సల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు.

అధికారులకు దిశానిర్దేశం..

స్వాతంత్ర్య వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీజీపీ దిశానిర్దేశం చేశారు. వేడుకలకు సంబంధించి అడిషనల్ డీజీపీ(ఎఫ్‌ఏసీ), ఏపీఎస్పీ బెటాలియన్స్, ఐజీపీ(శాంతిభద్రతలు) సీహెచ్ శ్రీకాంత్ నోడల్ అధికారిగా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు పోలీస్ సమన్వయ అధికారిగా, ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం రాష్ట్ర సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఏఎస్ఆర్ జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్పీ 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండ్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఆర్ఐ టి.ప్రభాకర్‌రావు వ్యవహరించనున్నారు. స్వాతంత్ర్య వేడుకల కవాతులో తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్పీ రెండో బెటాలియన్(కర్నూలు), మూడో బెటాలియన్(కాకినాడ), 11వ బెటాలియన్(కడప), 16వ బెటాలియన్(విశాఖపట్నం), ఎన్‌సీసీ బాల బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనికల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి. బ్రాస్‌బ్యాండ్స్ విభాగంలో కర్నూలు, కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, కడప, అనంతపురం, విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్లతో పాటు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్స్ పైప్‌బ్యాండ్, ఎస్ఏఆర్ సీపీఎల్ హైదరాబాద్ యూనిట్ బ్రాస్, పైప్ బ్యాండ్స్ బృందాలు పాల్గొననున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు తదితరులు హాజరుకానున్నారు. అనంతరం శకటాలను పరిశీలించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు



వందనం సమర్పిస్తున్న విద్యార్థినులు



రిహార్సల్స్ చేస్తున్న బలగాలు



బ్యాండ్ బృందాల కవాతు

ప్రతి ఉద్యోగి ఇళ్ల వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



సీనియర్ డీపీఓకి జాతీయ జెండాను అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా విజయవాడ డివిజన్ వ్యాప్తంగా జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా విజయవాడ డివిజన్ కార్యాలయంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధికారులు, సిబ్బందికి జాతీయ జెండాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజల్లో జాతీయతభావం పెంపొందించేందుకు త్రివర్ణ పతాకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రి, నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, ఏలూరు, తుని డిపోల పరిధిలోని సూపర్‌వైజర్లు జాతీయ జెండాలను సేకరించి తమ ఇళ్ల వద్ద ఎగువవేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ డివిజన్‌లోని అన్ని డిపోలు, స్టేషన్లలో పనిచేస్తున్న 17,345 ఉద్యోగులకు తమ ఇళ్ల వద్ద జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అందుకోసం పెద్ద సంఖ్యలో జెండాలను కొనుగోలు చేశామన్నారు. ప్రజల హృదయాల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు జాతీయ జెండాపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు.

తాగునీటి సమస్యను 24 గంటల్లో పరిష్కరించాలి

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర
- నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర శివారు కండ్రిక ప్రాంతంలో తలెత్తిన తాగునీటి సమస్యను 24 గంటల్లో పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం 64వ డివిజన్ పాతపాడు, కండ్రిక, ప్రకాష్ నగర్ పర్యటించగా స్థానికుల నుంచి ఆయన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్య ఉందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవటంలేదని ఫిర్యాదు చేయగా ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కారం చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆయన రోడ్డు సైడ్ మార్జిన్‌లో మొక్కలు పెరిగిపోవటం గమనించి, సూచనలు చేశారు. నూజివీడు రోడ్డులోని 15 ఫైనాన్స్ కమిషన్ ద్వారా చేపట్టిన వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలకు జరుగుతున్న పనులను పరిశీలించారు. తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు పరిశీలించి ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్కిల్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



కండ్రికలో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఇంటింటికీ కుళాయి సర్వే పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటికీ కుళాయి, 'డ్రింక్ ఫ్రమ్ టాప్' అంశంపై విజయవాడ నగరపాలక సంస్థ ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం గాంధీనగర్‌లో ఇంటింటికీ కుళాయిపై జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. సర్వే చేస్తున్న అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలు సర్వే చేసిన అంశాలపై నివేదికను సమగ్రంగా పొందుపర్చాలన్నారు, తగు సూచనలు చేశారు. ఇంటింటికీ కుళాయి అనే నేపథ్యంతో జరుగుతున్న ఈ సర్వేలో ప్రతి అసెస్మెంట్‌కి ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి, ప్రతి కనెక్షన్‌కి ఎన్ని ఇళ్లు ఉన్నాయి అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత యాప్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ వారాంతరానికి వీఎంసీ పరిధిలోని 2,17,083 అసెస్మెంట్లకు సర్వేను పూర్తి చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో సర్కిల్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, అడ్మిన్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీలు ఉన్నారు.



గాంధీనగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

నేటి నుంచి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో అండర్ సెక్షన్ 163 భారతీయ నాగరిక సురక్ష సహిత - 2023(బీఎన్ఎస్ఎస్)(144(2) సీఆర్పీసీ కింద నేటి నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు నిషేధాజ్ఞలను విధించామని చెప్పారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, సజావుగా శాంతిభద్రతలను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టూ టౌన్, ఎస్ఎన్ పురం, ఏఎస్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో నలుగురు లేదా అంతకు మించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాల్లో గుమికూడి ఉండరాదన్నారు. కర్రలు, రాళ్లు ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని, ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశభక్తి పెంపొందేలా పెయింటింగ్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించేలా మీనాక్షి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ విద్యార్థులకు పెయింటింగ్స్ వేయటంలో శిక్షణ ఇచ్చింది. పెడిలైట్ ఇండస్ట్రీస్ ఫెవిక్రిల్ సాంకేతిక విద్య నిపుణులు ఈ శిక్షణ ఇచ్చారు. చిన్నారుల తరుపున స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసేందుకు గత వారం రోజులుగా త్రివిధ స్మార్ట్ స్కూల్(నూజివీడు), నేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్(భవానీపురం), గాయత్రి ఇంగ్లిష్ మీడియం స్కూల్(పాయకాపురం)లో దాదాపు 500 మంది విద్యార్థులకు పెయింటింగ్స్ నేర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధులకు విద్యార్థుల చేత నివాళులర్పించటమే తమ లక్ష్యమని, ఆ దిశగానే పెయింటింగ్స్ వేయించామని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో దేశ సమైక్యత, దేశ సమగ్రత కోసం కృషి చేసేలా తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు.



త్రివర్ణంతో వేసిన పెయింటింగ్‌తో విద్యార్థులు

విద్యార్థులు జాతీయ భావం పెంపొందించుకోవాలి



హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ జి.సమరం, అధ్యాపకులు



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే దేశభక్తి, జాతీయ భావం పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యుడు రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ జి.సమరం పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమరం మాట్లాడుతూ.. యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ దోహదపడుతుందన్నారు. ఎందరో దేశభక్తుల త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని గుర్తుచేశారు.

విద్యార్థుల మానవహారం..

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ డి.సుబ్బారావు మాట్లాడుతూ.. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతలో చైతన్యం నింపేందుకు తమ వంతు బాధ్యతగా తాము హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ నేతల సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం 125 అడుగుల భారీ జాతీయ పతాకంతో ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి బీఎస్ఎన్ఎల్ జంక్షన్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రమేష్, నెహ్రూ యువజన కేంద్రం అధికారి సుంకర రాము, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం అత్యంత అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శారీరక ఆరోగ్యంతో పాటుగా మానవ వికాసానికి మానసిక ఆరోగ్యం చాలా అవసరమని సీఐఐ ఇండియా ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ విభాగ ఉపాధ్యక్షురాలు చాందిని చందన ఆకుల అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో వ్యక్తిగత, వృత్తిపరమైన విజయాన్ని సాధించటం, మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన చాందిని చందన ఆకుల మాట్లాడుతూ.. స్వీయ సంరక్షణలో మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని చెప్పారు.
ఆ దిశగా విద్యార్థులు తాత్కాలిక అంశాలపై దృష్టి పెట్టకుండా లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు పాటుపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని కలిగి ఉన్నప్పుడే మంచి జీవితాన్ని అందుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సుదీప్తి వర్ధన్ తదితరులు ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చాందిని చందన ఆకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాటక రంగానికి కీర్తి తెచ్చిన 'పల్లేటి'

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగానికి రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ అఖండమైన కీర్తిని తీసుకువచ్చారని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై నాటక రచయిత, నటుడు, దర్శకుడు పుల్లేటి లక్ష్మీ కులశేఖర్ సంస్మరణ సభను తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. తెలుగు నాటక రంగంలో విభిన్నమైన పాత్రలను పోషించిన నటుడు కులశేఖర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నాటికల పోటీల్లో 10కి పైగా నంది అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. ఆయన నాటక సేవలను గుర్తించి అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ విశిష్ట సేవా పురస్కారం అందించిందన్నారు.

జాతిని మేలుకొల్పే శక్తి..

విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు మాట్లాడుతూ.. కులశేఖర్ కళాకారునిగా సంతృప్తికరమైన జీవితం గడిపారన్నారు. కులశేఖర్ లాంటి రంగస్థల నటులు అరుదుగా కనిపిస్తారన్నారు. కళాకారులే జాతిని మేలుకొల్పే శక్తి అని పేర్కొన్నారు. సంస్మరణ సభలో డాక్టర్ సత్యశ్రీనివాస్, డాక్టర్ జయంతి చక్రవర్తి, ఆకాశవాణి విశ్రాంత వ్యాఖ్యాత ఏబీ ఆనంద్, డాక్టర్ శేషుకుమార్, డాక్టర్ రామతీర్థ, గాయకులు ఆదిరాల జయప్రభ కులశేఖర్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు.



నివాళులర్పిస్తున్న చిట్టిబాబు, డేవిడ్‌రాజు తదితరులు

వచ్చే నెల 29న శతాధిక వృద్ధులకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 29వ తేదీ ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో శతాధిక వృద్ధులకు సత్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మంగళవారం తెలిపారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని ట్రస్టు ఇప్పటికే ఎనిమిది సార్లు నిర్వహించిందన్నారు. ఇప్పుడు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన శతాధిక వృద్ధులు 18 మందిని తీసుకువచ్చి ప్రముఖుల చేతులమీదుగా సత్కరించనున్నట్లు తెలిపారు. శతాధిక వృద్ధుల సమాచారం తెలిసిన వారు 98481 11138 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అదే రోజు 70 ఏళ్లు దాటిన వారికి ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

వృద్ధాశ్రమాల్లో దుప్పట్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని వెంకట సాయిశ్రీ వృద్ధాశ్రమం, అలాగే కబేళా సెంటర్‌లోని ఆశీర్వాద్ ట్రస్ట్, నవులూరులోని అమ్మా నాన్న ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం, పరంజ్యోతి పద్మావతి అమ్మ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీపరంజ్యోతి మానవ సేవ సమితి కన్వీనర్ ఉట్టి నాగేశ్వరరావు తెలిపారు. అదే విధంగా ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి వృద్ధులు, విద్యార్థుల అవసరాల మేరకు సహాయ పడుతున్నామని పేర్కొన్నారు. మానవుల్లో ఐశ్వర్య చైతన్యం రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బూర్లె వెంకటరావు, ఓంకార్, రవ్వ ప్రసాద్, సాగర్, దుర్గా ప్రసాద్, సుజన లక్ష్మీ, వాసు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

క్లుప్తంగా...

ఎమ్మెల్యే జూలకంటికి ఊరట

షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు

సాక్షి, అమరావతి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2023 డిసెంబర్‌లో మాచర్ల రూరల్ పోలీసులు నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలలోపు ప్రతినెలా 1, 15వ తేదీల్లో పోలీసుల ముందు హాజరు కావాలంది. ఇలా మూడు నెలలు లేదా చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు ఏది ముందు అయితే దాని ప్రకారం హాజరు కావాలని ఆదేశించింది. అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సాక్షులను బెదిరించడం, భయపెట్టడం, ప్రలోభ పెట్టడం వంటివి చేయరాదని తేల్చి చెప్పింది. ఇలాంటి నేరాల్లో తిరిగి పాలుపంచుకోరాదని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎన్‌హెచ్‌ఎం నర్సుల యూనియన్ డిమాండ్



నైటింగేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నర్స్ యూనియన్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేసే స్టాఫ్ నర్సులకు వైద్యశాఖలోని ఇతర కాంట్రాక్ట్ నర్సులతో సమానంగా రూ.39వేల వేతనం చెల్లించాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ వర్ధంతి సందర్భంగా మంగళవారం విజయవాడలో యూనియన్ ప్రతినిధులు నివాళులర్పించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.దయామణి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లలో సమాన పనికి సమాన వేతన విధానం అమలు చేయాలన్నారు. అదే విధంగా సర్వీస్ మొత్తాన్ని పరిగణించి వయోపరిమితులను సడలించి, రెగ్యులర్ చేయాలని కోరారు. తమను డైరెక్టర్ ఆఫ్ హెల్త్, సెకండరీ హెల్త్ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో నేరుగా నియమించిన తర్వాత, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎంలను సర్దుబాటు చేయాలన్నారు. కేంద్ర నిబంధనల ప్రకారం ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు రిజిస్టర్డ్ సంఘాలను పిలవాలి

ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పని సర్దుబాటు అంశంపై జరిగే సమావేశానికి రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను పిలవకపోవడం శోచనీయమని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) చైర్మన్ కరణం హరికృష్ణ, కార్యదర్శి అంకాల కొండయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై కేవలం రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యా సంచాలకులు సమావేశం ఏర్పాటు చేయడాన్ని వారు ఆక్షేపించారు. ఉపాధ్యాయ సంఘాల గుర్తింపునకు ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత గుర్తింపు సంఘాలను మాత్రమే ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. అంతవరకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను ప్రతి సమావేశానికి ఆహ్వానించాలన్నారు.

తవ్వుకో.. తరలించుకో!

టిప్పర్, ట్రాక్టర్ యజమానులకు టీడీపీ నాయకులు భలే ఆఫర్ ప్రకటించారు. రూ.10 వేలు చెల్లిస్తే చాలు.. 10 రోజులపాటు ఇసుక, గ్రావెల్ యథేచ్ఛగా తవ్వుకుపోవచ్చంటూ బంపర్ ఆఫర్ ఇచ్చేశారు. చంద్రగిరి, తిరుపతి మండలాల పరిధిలోని శానంబట్ల, దోసిళ్ల కాలువ, నాగయ్యగారిపల్లి, రామిరెడ్డిపల్లి, చంద్రగిరి, నరసింగాపురం, ఎ.రంగంపేట, పైడిపల్లి, అడపారెడ్డిపల్లి, దుర్గసముద్రం పరిసర ప్రాంతాల్లోని స్వర్ణముఖి, భీమా నదుల వెంబడి ఈ ఆఫర్ నడుస్తోంది. గత ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతో ఈ ప్రాంతాల్లో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. దీనిని చంద్రగిరికి చెందిన అధికార పార్టీ నాయకుడొకరు తనకు అనుకూలంగా మలుచుకుని రూ.10 వేలు కట్టండి.. తవ్వుకోగలిగినంత ఇసుక, గ్రావెల్ తీసుకుపోండి అనటంతో పగలు ఇసుక, రాత్రి గ్రావెల్ అక్రమ తరలింపు సాగిపోతోంది. ఈ తతంగమంతా తెలిసినా.. రెవెన్యూ, ఎస్‌ఈబీ అధికారులు మౌనం వహిస్తున్నారు.

– చంద్రగిరి



అడవిలో పడి.. రూ.కోట్లు దోపిడీ



ప్రభుత్వం తమదైతే.. ప్రభుత్వ భూములు కూడా తమవే అన్నట్టు రెచ్చిపోతున్నారు టీడీపీ, జనసేన నాయకులు. అడవులు, ప్రభుత్వ భూములను కొల్లగొట్టి రూ.కోట్లను దోచుకుంటున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం నరవ సమీపంలోని ప్రభుత్వ, అటవీ శాఖకు చెందిన వందలాది ఎకరాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో హోరెత్తిస్తున్నారు. రేయింబవళ్లు అటవీ ప్రాంతంలోకి చొరబడి గ్రావెల్‌ను దొంగిలిస్తున్నారు. జేసీబీలతో గ్రావెల్ తవ్వి.. టిప్పర్లలో తరలించేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా గనులు, రెవెన్యూ శాఖ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. అదేమని ఎవరైనా అడిగితే.. తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతున్నారు.

– పెందుర్తి

ఓఎంసీ ఓర్ ఊడ్చేస్తున్నారు

సీబీఐ సీజ్ చేసిన మెటీరియల్ చీకట్లో తరలింపు



ఓఎంసీలో తరలిపోతున్న ఇనుప ఖనిజం



ఓఎంసీలో వాహనాలు తిరిగిన జాడలు

- సమీప ఐరన్ ఓర్ ఫ్యాక్టరీల్లో విక్రయిస్తున్న టీడీపీ నేతలు
- రోజూ 4 వేల టన్నులు మాయం
- తొలుత ఎల్లో మీడియా తప్పుడు కథనాలు.. ఆపై పచ్చ ముఠాల లూటీ

రాయదుర్గం: ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో సీబీఐ సీజ్ చేసిన విలువైన ఐరన్ ఓర్ (ఇనుప ఖనిజం)ను పచ్చముఠాలు చీకటి మాటున తరలించేస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో తవ్వకాలు నిలిపివేసి సుమారు 8లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని 2011లో సీబీఐ సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై కన్నేసిన టీడీపీ నాయకులు నాలుగైదు రోజులుగా ఓఎంసీలోకి చొరబడి లారీల్లో ఇనుప ఖనిజాన్ని చీకటి పడగానే సమీప స్టీల్ ఫ్యాక్టరీల్లోకి తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళ కొండ ప్రాంతాల్లో లారీల సంచారం, లైట్లను గమనించిన స్థానికులు ఓఎంసీలో దొంగలు పడ్డారని చర్చించుకుంటున్నారు. రోజుకు సుమారు 4 వేల టన్నులు మాయం అవుతున్నట్లు సమాచారం. నాణ్యతను బట్టి టన్ను రూ.4 వేల వరకు విక్రయిస్తుండడంతో భారీగా లూటీ చేసినట్లు అంచనా. ఓఎంసీలో లభ్యమయ్యే ఇనుప ఖనిజం నాణ్యతకు పేరు పొందింది. దీన్ని కాజేసేందుకు టీడీపీ నేతలు పథకం ప్రకారం వ్యవహరించారు. ఇందులో భాగంగా ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాయించారు. సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజం గత ప్రభుత్వ హయాంలోనే తరలి పోయిందంటూ తప్పుడు కథనాలను వండి వార్చారు.

నిస్సహాయంగా పోలీసులు..

ఓఎంసీలో ఇనుప ఖనిజం తరలిపోతున్నా పోలీసులు కళ్లప్పగించి చూడటం మినహా చర్యలు తీసుకునేందుకు సాహసించడం లేదు. లాఠీ ఝుళిపిస్తే బదిలీ తప్పదనే భయం వారిని వెంటాడుతోంది. ఇనుప ఖనిజాన్ని టీడీపీ నాయకులు అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సైతం ఇటీవల బహిర్గతం చేశారు. గత ప్రభుత్వంలో దోచేసినట్టు వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. దోపిడీ అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌తో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెస్తామన్నారు.

ఎవరి ప్రమేయం ఉన్నా వదిలి పెట్టం

ఓఎంసీలో సీజ్ చేసిన ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా వదిలి పెట్టేది లేదు. సత్వరం ఓ బృందాన్ని అక్కడికి పంపి దర్యాప్తు చేయిస్తాం. సీబీఐ పరిధిలో ఉన్న వ్యవహారంలో తల దూర్చితే తీవ్ర పరిణామాలు తప్పవు. లారీ యజమానులు ఆలోచించి బాడుగకు వెళ్లాలి. ఏమాత్రం పట్టుబడినా అక్కడే సీజ్ చేస్తాం. అంగుళం కూడా కదలనివ్వం. నిల్వ ఉంచిన ఖనిజం బాగున్నా, పాడైనా బయట వ్యక్తులు ఎవరూ తాకటానికి వీల్లేదు. పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖలను అప్రమత్తం చేసి అడ్డుకట్ట వేస్తాం.

– నాగయ్య, మైనింగ్ డీడీ, అనంతపురం

గ్రానైట్ దందాకు వెల కట్టి వేలం!

పర్చూరు, చిలకలూరిపేట టీడీపీ నేతల వాటా రూ.2.64 కోట్లు

నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి నేతలకు రూ.2.20 కోట్లు

- రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులకు నెలకు రూ.60 లక్షలు
- ఖరారు చేసిన పర్చూరు ముఖ్యనేత అనుచరులు
- నెలకు రూ.16.80 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి
- వాటాలపై గొట్టిపాటి, ఏలూరి వర్గాల మధ్య విభేదాలతో టీడీపీ పెద్దల వద్దకు పంచాయితీ



మార్టూరులో గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి, అధికార పార్టీ నేతలకు కప్పం చెల్లిస్తూ మార్టూరు నుంచి పాలిష్ గ్రానైట్ పలకలను జీరో దందాతో అక్రమంగా తరలిస్తున్నారు. జీరో దందా కోసం వ్యాపారులు అధికార పార్టీ పర్చూరు ముఖ్యనేత అనుచరులకు ఒక్కో లారీకి రూ.40 వేలు చొప్పున కప్పం చెల్లిస్తున్నారు. రోజుకు 80 లారీలకుపైగా గ్రానైట్ తెలంగాణకు తరలిపోతుండగా అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతోంది. పర్చూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల టీడీపీ నేతలు ఇందులో వాటాలు పంచుకుంటున్నారు. దందా నడిపిస్తున్న పర్చూరు ముఖ్యనేత, చిలకలూరిపేట నేతకు నెలకు రూ. 2.64 కోట్లు చొప్పున చెల్లిస్తుండగా నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల నేతలు ముగ్గురికీ నెలకు రూ.2.20 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఇక రెవెన్యూ, పోలీసు, మైనింగ్, కమర్షియల్ టాక్స్ అధికారులకు కలిపి నెలకు రూ.60 లక్షలు చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా రోజుకు ఒక్కో లారీకి రూ. 40 వేల చొప్పున 80 లారీలకు రూ.32 లక్షలు వంతున దందా నిర్వాహకులు నెలకు రూ. 9.60 కోట్లు వసూలు చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీ నేతలు, అధికారులకు రూ.5.44 కోట్లు చెల్లిస్తుండగా రూ.4.17 కోట్లు దందా నిర్వాహకుల వాటాగా చెబుతున్నారు.

ఖజానాకు భారీగా గండి

ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తుండటంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రతి టన్ను పాలిష్ రాయికి సేల్స్ టాక్స్ రూ.1,300, మైనింగ్ టాక్స్ రూ.700 చొప్పున మొత్తం రూ.2 వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఈలెక్కన 35 టన్నుల లారీకి రూ.70 వేలు టాక్స్ కట్టాలి. రోజుకు 80 లారీలు దొడ్డి దారిన గ్రానైట్‌ను తరలిస్తుండగా నిత్యం రూ.56 లక్షలు చొప్పున నెలకు రూ.16.80 కోట్లు టాక్స్ ఎగ్గొడుతున్నారు. గ్రానైట్ పాలిష్ రాయి అక్రమ రవాణా వ్యవహారం అధికార పార్టీలో కాక రేపుతోంది. ప్రధానంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వర్గాల మధ్య నెలకొన్న వివాదం టీడీపీ పెద్దల వద్దకు చేరినట్లు సమాచారం. దీనిపై ఒకటి రెండు రోజుల్లో పంచాయితీ నిర్వహించనున్నట్లు తెలిసింది.

లక్ష్మీనరసింహస్వామి భూమి స్వాహా

- మంగళగిరిలో రూ.1.5 కోట్ల భూమిని కబ్జా చేసిన బీజేపీ నాయకుడు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



దేవస్థాన భూమిలో అక్రమ నిర్మాణం

మంగళగిరి: హిందూ పరిరక్షణ.. అంటూ ప్రగల్భాలు పలికే బీజేపీ నాయకుడే మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్థలాన్ని కబ్జా చేశారు. ఏకంగా భవన నిర్మాణం చేపట్టారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేమంటే కూటమి ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు... మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట రూ.1.50 కోట్ల విలువైన ఏడు సెంట్లు దేవస్థాన స్థలాన్ని టీడీపీ నాయకుల అండతో బీజేపీ నాయకుడు గంగిన మల్లేశ్వరరావు ఆక్రమించారు. ఆ స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టారు. అది పూర్తికావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం ఇదే స్థలంలో మల్లేశ్వరరావు భవన నిర్మాణం చేపట్టగా.. అప్పటి ప్రభుత్వం చొరవతో అధికారులు కోర్టుకువెళ్లి నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ మల్లేశ్వరరావు బరి తెగించారు. ఆలయ స్థలంలో భవనం నిర్మిస్తున్నారు. దీనిపై సోమవారం మంగళగిరిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భక్తులు కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల నుంచి స్పందన లేదు. ఈ వివాదంలోకి తమను లాగొద్దని ఆలయ అధికారులు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దేవుడి స్థలానికి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

చివరకు తప్పుకున్న టీడీపీ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బరి నుంచి అధికార టీడీపీ తప్పుకుంది. బలం లేకపోవడం.. బలగానికీ ఇష్టంలేకపోవడంతో పోటీలో ఉంటే చిత్తుగా ఓడిపోవడం తప్పదని పార్టీ పెద్దలు గ్రహించారు. అయినా, కుతంత్రాలపై ఆశలు పెట్టుకున్నారు. చివరికి.. సామదానభేద దండోపాయాలను ఉపయోగించారు. డబ్బులతో అయినా ఓట్లు కొనాలని చివరి నిమిషం వరకూ చూశారు. కానీ, ఎమ్మెల్యేలు, ఎంపీల్లో కించిత్తైనా నమ్మకం లేకపోవడంతో కూటమి చేతులెత్తేసి తోకముడిచింది. దీంతో.. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వైఎస్సార్‌సీపీ కేడర్ చెక్కు చెదరకపోవడంతో ఆ పార్టీ ఖాతాలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ సీటు చేరింది. బొత్స విజయం లాంఛనంగా మారింది. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ఇది తొలిమెట్టుగా రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.

పోటీకి అందరూ ససేమిరా

వాస్తవానికి.. ఎలాగైనా ఎవరో ఒకర్ని పోటీలో నిలపాలని కొద్దిరోజులుగా సీఎం చంద్రబాబు భావిస్తూ వచ్చారు. స్థానిక సంస్థల్లో అధికార పక్షానికి బలం లేకపోవడం, వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉండటంతో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, పీలా గోవింద్‌లలో ఎవరో ఒకర్ని పోటీచేయించాలని చంద్రబాబు ప్రయత్నించారు. కానీ, గెలిచేందుకు ఏమాత్రం అవకాశంలేకపోవడం.. పైగా బలమైన ప్రత్యర్థి బొత్స ఉండడంతో పోటీకి వారిద్దరూ ససేమిరా అన్నారు. దీంతో దిలీప్ చక్రవర్తిని అభ్యర్థిగా నిలిపేందుకు ప్రయత్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దిలీప్ చక్రవర్తి అనకాపల్లి టికెట్ ఆశించారు. ఆ సీటు పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో అతనికి ఆశాభంగమైంది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఆశపెట్టి అతన్ని బరిలో దించాలని విశాఖ జిల్లా టీడీపీ నేతలు చంద్రబాబుకు ప్రతిపాదించారు. పార్టీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న లోకేశ్ కూడా ఈయన పేరును తెరపైకి తెచ్చారు. గెలిచే అవకాశం లేని ఎమ్మెల్సీ సీటుకు పోటీచేసేందుకు ఆయన కూడా ముందుకు రాకపోవడంతో గత్యంతరంలేని స్థితిలో పోటీ నుంచి విరమించుకుంటున్నట్లు చంద్రబాబు మంగళవారం విశాఖ జిల్లా నేతలకు టెలీకాన్ఫరెన్స్‌లో వెల్లడించారు.

ఓటమి భయంతోనే వెనకడుగు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయాలని ముందు నుంచి భావించిన టీడీపీ చివరి నిమిషంలో తప్పుకోవడం వెనుక బలమైన కారణమే ఉంది. విశాఖ స్థానిక సంస్థల్లో సంపూర్ణ మెజారిటీ ఉన్న వైఎస్సార్‌సీపీని ఎదుర్కొని ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలవడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికల్లో వచ్చే ఓటమి ఘోర పరాభవం కింద లెక్కే. ఇటీవలే తెలంగాణలో కూడా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోను ఇదే జరిగింది. అక్కడ మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పరాజయం పాలైంది. దీంతో.. స్థానిక సంస్థల్లో పూర్తి మెజారిటీ ఉన్న వైఎస్సార్‌సీపీని తట్టుకుని నిలబడటం టీడీపీకి పెను సవాల్‌గా మారే పరిస్థితి ఉందని.. పైగా, ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర నెలలకే ఓటమి చవిచూస్తే ఆ ప్రభావం తట్టుకోవడం కష్టమనే పోటీకి ఎవరూ ముందుకు రాకపోవడంతో చంద్రబాబు చేతులెత్తేసినట్టు సమాచారం.

బొత్స ఎన్నిక లాంఛనమే

మరోవైపు.. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ సవాల్‌గా తీసుకుంది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహాత్మకంగా మాజీమంత్రి, సీనియర్ నేత బొత్స సత్యనారాయణను బరిలోకి దించారు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్సతోపాటు మరో స్వతంత్ర అభ్యర్థి షఫీ ఉల్లా కూడా నామినేషన్ వేశారు. గడువులోగా ఈయన నామినేషన్ ఉపసంహరించుకుంటే పోలింగ్ లేకుండానే బొత్సను విజేతగా ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ పోటీ జరిగినా బొత్స ఎన్నిక లాంఛనమే.

దిలీప్‌కు హితోపదేశం..!

ఇదిలా ఉంటే.. దిలీప్ పేరుని ప్రతిపాదించిన లోకేశ్ వ్యవహారశైలిని వ్యతిరేకిస్తూ.. ఆ ప్రతిపాదనలకు చెక్ పెట్టేందుకు వీలుగా టీడీపీ ఉత్తరాంధ్ర సీనియర్లు పావులు కదిపారు. టీడీపీకి చెందిన ఓ మాజీమంత్రి చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. దిలీప్ చక్రవర్తికి వ్యాపార భాగస్వామిగా ఉన్న ఓ ఎమ్మెల్సీ ద్వారా మంతనాలు ప్రారంభించారు. సదరు అభ్యర్థిగా భావిస్తున్న వ్యక్తికి హితోపదేశం చేయడం ప్రారంభించారు. రూ.100 కోట్లు కాదు.. రూ.200 కోట్లు ఖర్చుచేసినా.. గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్నాయని.. డబ్బులు, టైమ్ వేస్ట్ అంటూ బ్రెయిన్‌వాష్ చేశారని సమాచారం. ఓట్ల అంతరం చాలా ఉందనీ.. దాన్ని అధిగమించడం కష్టమనీ.. అందుకే ఓడిపోయే సీటును అంటగట్టేందుకు చూస్తున్నారని చెప్పారు. నామినేషన్ వేసి.. కోట్ల రూపాయలు నష్టపోయే కంటే.. అసలు పోటీలో ఉండకపోవడం మంచిదని సూచించినట్లు తెలుస్తోంది. ఈ విషయం గ్రహించే గండి బాబ్జీ, పీలా గోవింద్‌లు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కూడా వివరించారు. అంతా విన్న దిలీప్ పోటీచేయలేనంటూ లోకేశ్‌కి తెగేసి చెప్పేశారు.

టార్గెట్ జోగి రమేష్!

చంద్రబాబు ఇంటి వద్ద నాటి నిరసనకు నేడు కక్ష సాధింపు

- చట్ట ప్రకారం భూమి కొనుగోలు చేసి విక్రయించిన జోగి కుటుంబం
- అయినా సరే అక్రమ కేసు నమోదు చేసిన టీడీపీ ప్రభుత్వం
- ఇబ్రహీంపట్నం జోగి నివాసంలో వేకువజాము నుంచే ఏసీబీ తనిఖీలు
- జోగి తనయుడిని అరెస్టుచేసి, గొల్లపూడి ఏసీబీ కార్యాలయానికి తరలింపు
- తన కుమారుణ్ణి అన్యాయంగా అరెస్టు చేశారన్న జోగి
- కన్నీటిపర్యంతమైన జోగి సతీమణి
- అక్రమ కేసులపై పోరాడతామన్న వైఎస్సార్‌సీపీ నేతలు



అడ్వకేట్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని నాని, వెలంపల్లి, తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి. చిత్రంలో జోగి రమేష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ/ఇబ్రహీంపట్నం: మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం వేధింపులకు తెరతీసింది. చట్టానికి లోబడి, నిబంధనల ప్రకారం భూమి కొనుగోలు చేసి, దానిని విక్రయించిన వ్యవహారంలో అక్రమ కేసు నమోదు చేసింది. పత్రికల్లో ప్రకటన ఇచ్చి మరీ కొనుగోలు చేసిన ఓ భూ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టిస్తూ, అక్రమ కేసు నమోదు చేశారు. జోగి రమేష్ కుమారుడు రాజీవ్‌తోపాటు, చిన్నాన్న వెంకటేశ్వరరావును నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంతేకాక.. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల తర్వాత ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ నివాసంలో సోదాలతో పేరుతో హల్‌చల్ చేశారు. అనంతరం.. జోగి రాజీవ్‌ను ఎలాంటి నోటీసులివ్వకుండానే అదుపులోకి తీసుకుని గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోగి సతీమణి శకుంతల.. మా బిడ్డ ఏం పాపం చేశాడంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం.. ఏసీబీ కార్యాలయం వద్దకు జోగి రమేష్ చేరుకుని, అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. నిజానికి.. గతంలో టీడీపీ నేతలు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపేందుకు జోగి రమేష్ చంద్రబాబు నివాసం వద్దకు వెళ్లారు. ఆ ఉదంతంతో చంద్రబాబు అతనిపై కక్షగట్టి ఇప్పుడు వేధింపులకు పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇక జోగి రమేష్ తనయుని అరెస్టు వార్త తెలియగానే వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, వెలంపల్లి, దేవినేని అవినాష్, మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతోపాటు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయం వద్దకు వచ్చారు. వారిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అక్రమ అరెస్టులపై పోరాడతామని, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులన్నింటిని ఎదుర్కొంటామని చెప్పారు.

తొమ్మిది మందిపై సీఐడీ అక్రమ కేసు

ఈ కేసుకు సంబంధించి తొమ్మిది మందిపై సీఐడీ అక్రమ కేసు నమోదు చేసింది. ఇందులో జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి మోహనరంగాదాసు, వెంకట సీతామహాలక్ష్మి, సర్వేయర్ దేదీప్య, మండల సర్వేయర్ రమేశ్, డిప్యూటీ తహశీల్దార్ విజయకుమార్, విజయవాడ రూరల్ తహశీల్దారు, నున్న సబ్‌రిజిస్ట్రార్ ఉన్నారు. సీఐడీ కేసు విచారణలో ఉండగానే ఏసీబీ హడావిడిగా కేసు నమోదు చేయడం గమనార్హం. ఇక ఏసీబీ కార్యాలయంలో మంగళవారం దేదీప్యను విచారించారు. మరోవైపు.. గతంలో చంద్రబాబు ఇంటివద్ద నిరసన చేపట్టిన కేసులో జోగి రమేష్‌కు మంగళవారం తాడేపల్లి పోలీసులు నోటీసులు జారీచేశారు. మంగళగిరి డీఎస్పీ కార్యాలయానికి విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇక ఈ ఘటనపై విజయవాడ ఏసీబీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

అక్రమ కేసులపై పోరాటం చేస్తాం

మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు పెడతారని, అక్రమంగా అరెస్టులు చేస్తారన్నారు. అసలు ఈ కేసులో లీగల్ ప్రొసీజర్ ఫాలో అయ్యారా? అని ప్రశ్నించారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా, విచారణకు పిలవకుండా జోగి రమేష్‌ను టార్గెట్ చేశారన్నారు. చంద్రబాబును నిలదీయకుండా వదలమన్నారు. జోగి రమేష్‌కు పొలం అమ్మిన వారు ముద్దాయిలు కారు.. కొనుక్కున్న వారు లేరు.. మరి అలాంటప్పుడు జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే ముద్దాయిలా? అని ప్రశ్నించారు. ఈ తప్పుడు కేసులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. నిజానికి అగ్రిగోల్డ్ ఆస్తులు చంద్రబాబు మనుషులే కొన్నారని నాని చెప్పారు. జోగి రమేష్ సతీమణి మాట్లాడుతూ.. అప్పటి సీఎం జగన్‌గారిని ఉద్దేశించి టీడీపీ నేతలు దారుణంగా మాట్లాడడం వల్లే తన భర్త నిరసన తెలపడానికి చంద్రబాబు నివాసానికి వెళ్లారని.. దాన్ని మనసులో పెట్టుకుని ఇలా వేధిస్తారా? అని ప్రశ్నించారు. ఇక రాష్ట్రంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని, అందుకే బీసీ అయిన జోగి రమేష్ కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీమంత్రి వెలంపల్లి అన్నారు. ఏ తప్పూ చేయకపోయినా జోగి రమేష్ కుటుంబాన్ని వేధిస్తున్నారని.. తాము పరామర్శకు రావొద్దా అని మాజీమంత్రి మేరుగ నాగార్జున ప్రశ్నించారు. అలాగే, జోగి రమేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని.. అందుకే జగన్ ఆదేశాల మేరకు తామంతా ఇక్కడకు వచ్చామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు.

14 రోజులపాటు రిమాండ్

ఇదిలా ఉంటే.. జోగి రాజీవ్, సర్వేయర్ రమేష్‌కు ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏసీబీ కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి ఏసీబీ అధికారులు న్యాయమూర్తి హిమబిందు ఎదుట హాజరుపర్చగా ఇరువర్గాల వాదనల అనంతరం న్యాయమూర్తి ఈనెల 28వరకు రిమాండ్ విధించారు. నిందితుని తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు.

మా నాన్నపై కక్ష తీర్చుకునేందుకే..



జోగి రాజీవ్‌ను అరెస్ట్ చేసి కారులో ఎక్కిస్తున్న ఏసీబీ అధికారులు

నా తండ్రిపై రాజకీయ కక్ష తీర్చుకునేందుకే అక్రమ కేసులు పెట్టారు. ఈనాడులో ప్రకటన చూసే కొన్నాం.. అలాగే, ప్రకటన ఇచ్చే అమ్మాం. ఈ వ్యవహారాన్ని లీగల్‌గానే కోర్టులోనే తేల్చుకుంటాం.

– జోగి రాజీవ్, జోగి రమేష్ తనయుడు

నాపై కక్షతో నా కొడుకుపై కేసు..



మా అబ్బాయి మీద కేసు నమోదు చేయడం దుర్మార్గం. చంద్రబాబూ.. నీకు నా మీద కక్ష ఉంటే ఉండొచ్చు. అటాచ్ అయిన అగ్రిగోల్డ్ భూములు ఎవరైనా కొంటారా? కావాలనే కక్షతోనే నా కొడుకుని అరెస్టుచేశారు. ఇది బలహీనవర్గాలపైన, గౌడ కులస్తుపైన దాడిగా నేను భావిస్తున్నా. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో తమ కుటుంబం తప్పుచేసినట్లు రుజువుచేస్తే ఆత్మహత్య చేసుకుంటాం.

– జోగి రమేష్, మాజీమంత్రి

ఇద్దరిని అరెస్టు చేశాం

విజయవాడ రూరల్ అంబాపురం గ్రామంలో సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అవ్వా శేషనారాయణకు చెందిన అగ్రిగోల్డ్ భూమి కొనుగోలుపై వచ్చిన ఫిర్యాదుతో ప్రస్తుతం జోగి రాజీవ్, సర్వేయర్ రమేష్‌లను అరెస్ట్‌చేశాం. ఇందులో ఐదుగురు నిందితులను గుర్తించాం. తదుపరి విచారణ తరువాత మిగిలిన వారిని అరెస్టుచేస్తాం.

– సౌమ్యలత, ఏసీబీ అడిషనల్ ఎస్పీ

సేవాపథం



మనిషికి మనిషిని జతకలిపే దర్జీలు

శ్రుతి



హరిత కర్మ సేన సభ్యులు

వారధి నిర్మాణ పనుల్లో 'నేనెంత' అనుకోలేదు ఉడుత. 'నేను కూడా కొంత' అనుకొని పనుల్లోకి దిగింది. వయనాడ్ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులకు అండగా నిలవడానికి, తమ వంతు సహాయం అందించడానికి స్థాయి భేదాలు లేకుండా ఎంతోమంది మహిళలు వస్తున్నారు. శిబిరంలోని మహిళలకు బట్టలు కుట్టి ఇవ్వడం నుంచి పరిసరాల శుభ్రత వరకు దీక్షతో పనిచేస్తున్నారు...

శ్రుతికి చారమాలలో చాలా మంది బంధువులు ఉన్నారు. కొండచరియలు విరిగిపడిన సంఘటనలో కొందరు చనిపోయారు. మరికొందరు మెప్పడిలోని సహాయ శిబిరంలో ఉన్నారు. కొంతమంది మహిళలు స్నానం చేయడానికి శ్రుతి ఇంటికి వచ్చినప్పుడు తమకు ఇచ్చిన దుస్తులకు సంబంధించిన సమస్యల గురించి చెప్పుకున్నారు. ఆల్ట్రేషన్‌కు అవకాశం లేకపోవడంతో తమకు సరిపోయే ఒకే జత దుస్తులనే వాడాల్సి వస్తోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని స్నేహితురాలి దగ్గర కుట్టుమిషన్ తీసుకొని నిర్వాసిత కుటుంబాల సహాయ శిబిరానికి బయలుదేరింది శ్రుతి.

ప్రతి గదికి వెళ్లి 'నేను రెండు రోజులు ఇక్కడే ఉంటాను. దుస్తుల సైజ్ సర్దుబాటు సమస్యలు ఉంటే నాకు చెప్పండి' అని అడిగింది. ఇక ఆరోజు నుంచి చిరిగిపోయిన దుస్తులు, సైజు సరిగా లేని దుస్తులను సరి చేసే పని మొదలైంది.

టైలరింగ్ వల్ల జరిగిన మరో మేలు ఏమిటంటే మనసును దారి మళ్లించడం. ఈ శిబిరంలో కొద్దిమంది టైలరింగ్ పని తెలిసిన వారు కూడా ఉన్నారు. అలాంటి వారిలో రమ్య మనోజ్ ఒకరు.

'భయపెట్టే జ్ఞాపకాల నుంచి బయటపడడానికి టైలరింగ్ అనేది చికిత్సామార్గంలా ఉపయోగపడింది. చాలా రోజులుగా మేము శిబిరంలో ఖాళీగా ఉన్నాం. ప్రతిరోజూ విషాద జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉండేవి. మెషిన్‌పై ఆల్ట్రేషన్ పనులు మొదలు పెట్టిన తరువాత నాకు ఎంతో ఉపశమనం లభించింది' అంటుంది రమ్య మనోజ్.

శ్రుతి, రమ్య... మొదలైన వారిని దృష్టిలో పెట్టుకొని సహాయ శిబిరానికి కుట్టుమిషన్‌లను ఒక స్వచ్ఛంద సంస్థ విరాళంగా ఇవ్వనుంది.

'మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు రెండు రోజులు ఉండాలనుకున్నాను. ఇప్పుడు మాత్రం శిబిరం ఉన్నంతవరకు రోజూ వచ్చి పోవాలనుకుంటున్నాను' అంటుంది శ్రుతి.

సహాయ శిబిరానికి శ్రుతి రోజూ రావాలనుకోవడానికి కారణం కేవలం టైలరింగ్ పనులు కాదు. ఇప్పుడు అక్కడ ఆమె ఎంతో మంది బాధితులకు ఓదార్పునిస్తోంది. బాధితులు విషాద జ్ఞాపకాల నుంచి బయటపడడానికి సినిమాల నుంచి ఆటల వరకు ఎన్నో విషయాలు మాట్లాడుతుంటుంది.

'శిబిరానికి శ్రుతి రావడానికి ముందు మా మాటల్లో బాధలు, కష్టాలు, చేదు జ్ఞాపకాలు మాత్రమే ఉండేవి. అయితే శ్రుతి మమ్మల్ని అటువైపు వెళ్లనివ్వకుండా రకరకాల విషయాలు మాట్లాడుతుంటుంది. ధైర్యం చెబుతుంటుంది' అంటుంది సహాయ శిబిరంలో తలదాచుకుంటున్న ఆశ.

హరిత కర్మ సేన ఆల్ ఉమెన్ గ్రూప్

పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిలో కొందరు జ్వరం, దగ్గులాంటి సమస్యలతో బాధ పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పునరావాస శిబిరం పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత ఆనవాలు లేకుండా చేస్తున్నారు. పునరావాస శిబిరాలుగా మారిన పాఠశాలలు శుభ్రంగా కనిపించడానికి కారణం హరిత కర్మ సేన–ఆల్ ఉమెన్ గ్రూప్. భోజనాల తరువాత టేబుళ్లు, నేలను శానిటైజ్ చేస్తున్నారు. క్రిములు పెరగకుండా, వ్యాధులు వ్యాప్తి చెందకుండా, సహాయ శిబిరం చుట్టుపక్కల ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు కనిపించకుండా చూస్తున్నారు. కేరళలో మొత్తం 1018 హరిత కర్మ సేన యూనిట్‌లు పని చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 4,678, గ్రామీణ ప్రాంతాల్లో 26, 546 మంది మహిళలు పనిచేస్తున్నారు. 'వేస్ట్ ఫ్రీ కేరళ' నినాదాన్ని భుజాల కెత్తుకున్న హరిత కర్మ సేన కలెక్టింగ్, ట్రాన్స్‌పోర్టింగ్, ప్రాసెసింగ్, రీసైకిలింగ్, వేస్ట్ మెటీరియల్స్ డిస్పోజల్ అండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి వివిధ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. 'సమాజానికి ఉపయోగపడే మంచి పని చేస్తున్నాను అనే భావన మనసులో ఉండడం వల్ల కావచ్చు ఎంత పని చేసినా శ్రమగా అనిపించదు' అంటుంది హరిత కర్మ సేన సభ్యురాలు ఉద్విత.

బ్యూటిప్స్



● రెండు స్పూన్ల కీరా రసంలో స్పూన్ రోజ్‌వాటర్, స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. రాత్రి పడుకోబోయేముందు ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకోవాలి. మరునటి రోజు ఉదయాన్నే శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల జిడ్డు తగ్గి, ముఖం తాజాగా కనిపిస్తుంది.

● రెండు టీ స్పూన్ల క్యాబేజీ రసంలో టీ స్పూన్ తేనె కలిపి, ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై మొటిమలు, ముడతలు తగ్గుతాయి.



క్యాన్సర్ కాటుకు వర్కవుట్ ఫిట్ ఫర్ టాట్

హీనా ఖాన్

ప్రముఖ నటి. హిందీ టీవీరంగంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటి. కెరీర్ కాంతి పుంజంలా వెలుగుతున్న కాలంలో అనారోగ్యం ఆమె మీద దాడి చేసింది. ఆమె తాను బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించేటప్పటికే మూడవ దశకు చేరినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. అయితే క్యాన్సర్ బారిన పడినందుకు ఏ మాత్రం కుంగిపోవడంలేదు. కీమోథెరపీ చేయించుకుంటూ తన ఆరోగ్యంతోపాటు ఫిట్‌నెస్ మెయింటెయిన్ చేసుకోవడానికి క్రమం తప్పకుండా జిమ్‌కెళ్తోంది. వివరాల్లోకి వెళితే...

కాళ్లు మొద్దుబారుతున్నాయి

కీమోథెరపీ బాధలు, న్యూరోపతిక్ పెయిన్‌ను భరిస్తూ కూడా హెల్దీ లైఫ్ స్టయిల్‌ను అనుసరిస్తోంది. 'కీమోథెరపీ దేహాన్ని పిండేస్తుంది. వర్కవుట్స్ చేసేటప్పుడు కాళ్లు పట్టుతప్పుతున్నాయి, ఒక్కసారిగా పడిపోతున్నాను' అని ఒక పోస్ట్ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయడం లేదామె. మెంటల్, ఫిజికల్ వెల్‌నెస్ కోసం నొప్పుల బాధలను పళ్లబిగువున భరిస్తూ వ్యాయామం చేస్తోంది. 'అనారోగ్యంతో కుంగిపోయిన వ్యక్తిలా అభివర్ణించుకోవడం నాకిష్టం లేదు. పడినప్పటికీ తిరిగి లేచి నిలబడాలి. వర్కవుట్ చేసే ప్రతిసారీ 'గెట్టింగ్ బ్యాక్ అప్... అని నాకు నేను చెప్పుకుంటాను. అలా చెప్పుకోకపోతే మానసిక శక్తి రాదు. మానసిక శక్తి లోపిస్తే వ్యాయామం చేయడానికి దేహం సహకరించదు' అని తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్‌తో పంచుకుంది. ఈ నేపథ్యంలో ఆమె రకరకాల వీడియోలను కూడా పోస్ట్ చేసింది. ఒక వీడియోలో జుత్తును తల నుంచి చివరి వరకు నిమిరి అరచేతిలోకి వచ్చిన జుత్తును చూపించింది. గుండు గీసుకుంటూ ఒక వీడియో పోస్ట్ చేసింది. మరొక వీడియోలో వర్షంలో గొడుగు వేసుకుని, ప్రొటీన్ షేక్ ఉన్న ఫ్లాస్క్ పట్టుకుని జిమ్ ఆవరణలో ప్రవేశించింది. గొడుగు మూస్తూ హాయ్ అని పలకరించి విక్టరీ సింబల్ చూపించి జిమ్ గదిలోకి వెళ్లడంతో వీడియో పూర్తయింది. 'స్టే స్ట్రాంగ్' అంటూ ఆమె ఫ్లయింగ్ కిస్ విసిరి వీక్షకులకు మనోధైర్యాన్నిచ్చింది.



ఫిట్‌నెస్ చాలెంజ్

అమెరికాలోని స్లోన్ కెట్టరింగ్ క్యాన్సర్ సెంటర్ సూచనల మేరకు...

తేలికపాటి వ్యాయామాలు... రిలాక్స్‌డ్ బైకింగ్ (గంటకు ఐదు మైళ్ల కంటే తక్కువ వేగంతో సాఫీగా ఉన్న నేల మీద సైక్లింగ్), స్లో వాకింగ్ (చదునుగా ఉన్న నేల మీద గంటకు మూడు మైళ్లకంటే తక్కువ వేగంతో నడవడం). చిన్న చిన్న ఇంటిపనులు, తాయ్ చాయ్ (దేహాన్ని నిదానంగా కదిలిస్తూ దీర్ఘంగా శ్వాస తీసుకోవడం), ఫ్లైయింగ్ క్యాచ్ (బాల్‌ను లేదా ఫ్రిస్‌బీ ప్లేట్‌ను గురి చూసి విసరడం)

తీవ్రమైన వ్యాయామాలు... బైకింగ్... (గంటకు పది మైళ్లకు మించకుండా సైక్లింగ్), బ్రిస్క్ వాక్ (గంటకు మూడు నుంచి నాలుగున్నర మైళ్ల వేగం), ఇంటి పనుల్లో బరువైనవి కూడా, యోగసాధన, టెన్నిస్ వంటి ఆటలు.

● అమెరికన్ కాలేజ్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్, అమెరికన్ క్యాన్సర్ సొసైటీలు... క్యాన్సర్ పేషెంట్‌లు వారానికి 150 నుంచి 300 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని, రోజుకు అరగంట చొప్పున వారానికి ఐదు రోజుల వర్కవుట్ షెడ్యూల్ ఉండాలని చెప్తున్నాయి.


మీ ఆదరణకు కృతజ్ఞతలు

సోషల్ మీడియాలో ఫాలోవర్స్ నుంచి అందుతున్న ఆదరణకు ఎప్పటికప్పుడు ప్రతిస్పందిస్తూ 'మీ అభిమానానికి, ప్రేమకు కృతజ్ఞతతో ఉంటాను. ఈ చాలెంజ్‌లో నేను గెలుస్తాను' అన్నది. కష్టం వచ్చినప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదు. అనారోగ్యం వస్తే డీలా పడిపోకూడదు. పోరాడి గెలవాలి అనే సందేశం ఇస్తున్న ఆమె వీడియోలు పలువురికి స్ఫూర్తినిస్తున్నాయి. వైద్యం ఎంతగా అభివృద్ధి చెందిందో వివరిస్తూ, క్యాన్సర్‌కు చికిత్స చేయించుకున్న తర్వాత సాధారణ వ్యక్తుల్లాగే క్వాలిటీ లైఫ్‌ను లీడ్ చేయడం మన చేతుల్లోనే ఉందని సమాజానికి ధైర్యం చెబుతున్న వారిలో హీనాఖాన్ ఒకరు.

ప్రతిఘటన



అర్ధరాత్రి స్వతంత్ర పోరాటం



క్యాండిల్స్‌తో డాక్టర్ల నిరసన

'నైట్ ఈజ్ అవర్స్' పేరుతో ఆగస్టు 14 అర్ధరాత్రి కోల్‌కతాలో మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలుపనున్నారు. అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది కాని అర్ధరాత్రి సురక్షితంగా జీవించే హక్కు స్త్రీలకు రాకపోవడంపై ఈ నిరసన. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య జరిగిన నేపథ్యంలో రాత్రిని చూసి భయపడుతూ బతకవలసిందేనా అని నిలదీస్తున్నారు స్త్రీలు. ఈ నిరసన, గతంలో ఇలాంటి ప్రతిఘటనలపై కథనం.

'ఏ రోజైతే అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా రోడ్డు మీద నడవగలదో ఆ రోజు ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అన్నారు గాంధీజీ. ఆయన కలలుగన్న స్వాతంత్ర్యం ఇంకా ఒడిదుడుకుల్లోనే ఉంది. డిసెంబర్ 16, 2012లో ఢిల్లీలో అర్ధరాత్రి ఒక నిర్భయ దారుణంగా లైంగికదాడికి లోనై మరణిస్తే మొన్న గురువారం (ఆగస్టు 8) అర్ధరాత్రి కోల్‌కతాలోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఒక ట్రయినీ డాక్టర్ దారుణంగా అత్యాచారానికీ హత్యకూ లోనైంది. దీంతో దేశవ్యాప్తంగా వైద్యబృందాలు భగ్గుమన్నాయి. నిరసనలు సాగుతున్నాయి. వైద్యులు వైద్యసేవలు మాని ఈ అన్యాయానికి జవాబేమిటని ప్రశ్నిస్తున్నారు. తక్షణ న్యాయం కోసం డిమాండ్ చేస్తున్నారు.

అర్ధరాత్రి నిరసన

'ఆగస్టు 14 అర్ధరాత్రి మనకు స్వాతంత్ర్యం వచ్చింది. కాని స్త్రీలకు తమ ఇంట్లో, పని చోట, బహిరంగ ప్రదేశాల్లో రాత్రుళ్లు ఎటువంటి స్వేచ్ఛ లేని బానిసత్వమే మిగిలింది. కోల్‌కతాలో జరిగిన దారుణకాండకు నిరసనగా ఈ ఆగస్టు 14 అర్ధరాత్రి మహిళలందరం నిరసన చేయనున్నాం' అని కోల్‌కతాలోని మహిళలు తెలియచేస్తున్నారు. ఈ నిరసకు స్త్రీలు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. మనదేశంలో సూర్యుడు అస్తమించగానే స్త్రీలలో, వారి కుటుంబ సభ్యుల్లో ఆ స్త్రీలు ఇంటికి చేరే వరకు ఆందోళన ఉంటుంది. వారి మీద ఏదోవిధమైన దాడి జరిగే వాతావరణం ఉండటమే ఇందుకు కారణం. ఒంటరి స్త్రీ బహిరంగ ప్రదేశాలలో కనిపిస్తే ఆమెతో ఎలాగైనా వ్యవహరించవచ్చనే తెగింపు కొన్ని మూకలలో ఈ సమాజంలో ఉంది. స్త్రీలకు పరిమిత సమయాలలో పరిమిత స్థలాలలోనే రక్షణ. లేదంటే లేదు. అయితే నిర్భయ ఘటన ఆమె రోడ్డు మీద ఉన్నప్పుడు జరిగితే కోల్‌కతాలో బాధితురాలు ఆస్పత్రిలో తన డ్యూటీలో ఉండగా దాడి జరగడం తీవ్రమైన ప్రశ్నను లేవదీసేలా ఉంది.

మీట్ టు స్లీప్

నిర్భయ ఘటన జరిగాక ఆమెను తలుచుకుంటూ ప్రతి డిసెంబర్ 16న పార్కుల్లో మహిళలు బృందాలుగా నిదురించే కార్యక్రమం 'మీట్ టు స్లీప్' నిర్వహించాలని బెంగళూరుకు చెందిన 'బ్లాక్ నాయిస్' అనే సంస్థ పిలుపునిస్తే దేశంలోని అన్ని మెట్రో నగరాలలో ఆ కార్యక్రమం కొనసాగుతోంది. 'పబ్లిక్ ప్లేసులపై మా హక్కు కూడా ఉంది. మేము అక్కడ సురక్షితంగా ఉంచే పరిస్థితిని డిమాండ్ చేస్తున్నాం' అని ఈ కార్యక్రమం కోరుతోంది. బ్లాక్ నాయిస్ ఫౌండర్ జాస్మిన్ పతేజా దీని రూపకర్త.

విమెన్ వాక్ ఎట్ మిడ్‌నైట్:

ఢిల్లీ రోడ్ల మీద అర్ధరాత్రి స్వేచ్ఛగా నడిచే హక్కు స్త్రీలకు ఉంది అని 'విమెన్ వాక్ ఎట్ మిడ్‌నైట్' పేరుతో అక్కడి మహిళా బృందాలు రాత్రుళ్లు నడిచి తమ గళాన్ని వినిపించాయి. మల్లికా తనేజా అనే థియేటర్ ఆర్టిస్ట్ ఇందుకు పిలుపునిచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. 'రాత్రిపూట ఖాళీ ఫుట్‌పాత్ మీద స్వేచ్ఛగా కూచునే అనుభూతి ఇప్పుడు పొందాను' అని ఈ అర్ధరాత్రి నడకలో పాల్గొన్న ఒక మహిళ అంది.

సమాజంలో స్త్రీకి గౌరవం దక్కాలన్నా ఆమె సురక్షితంగా ఉండాలన్నా ఇంటిలో బడిలో పని చోట్ల ప్రభుత్వ విధానాలలో సినిమాలలో కళల్లో ఆమెను గౌరవించే వాతావరణం, బౌద్ధిక శిక్షణ అవసరం. కఠినమైన చట్టాలతో పాటు విలువల ఔన్నత్యం కూడా అవసరం. స్త్రీలను కించపరిచే భావజాలం ఎక్కడ ఉన్నా దానిని నిరసించడం అందరూ నేర్వాలి. లేని పక్షంలో అర్ధరాత్రి నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతూనే ఉంటాయి.

యోగం



విల్లులా వంచుదాం

వెన్నెముక కండరాలను బలోపేతం చేయడంలోనూ, శరీర సమతుల్యతను మెరుగుపరచడంలోనూ .. ఎన్నో ప్రయోజనాలను అర్ధచక్రాసన ద్వారా పొందవచ్చు.


ఈ ఆసనం విల్లు భంగిమను పోలిఉంటుంది. అర్ధ చక్రం (హాఫ్ వీల్ ఆసన) అంటే సగం చక్రం అన్నమాట.

చురుకైన కండరాలు

దీనిని సాధన చేయడానికి మ్యాట్ పైన నిటారుగా నిల్చోవాలి. చేతులను, తలను భుజాల నుంచి వెనక్కి తీసుకుంటూ నడుమును వంచాలి. దీని వల్ల వెన్ను భాగం సాగుతుంది. ఎంత వీలైతే అంతగా నడుము భాగాన్ని ముందుకు, తల భాగాన్ని వెనక్కి వంచుతూ కాళ్లను నిటారుగా ఉంచాలి. దీంతో కండరాలన్నీ పూర్తి చురుగ్గా అవుతాయి. వెనుకకు వంగేటప్పుడు దీర్ఘ శ్వాస పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి. అదే విధంగా యథాస్థితికి చేరుకున్నప్పుడు దీర్ఘశ్వాస తీసుకుంటూ, వదలాలి.

మూడు నుంచి ఐదు సార్లు

సాధారణంగా శ్వాస తీసుకునేటప్పుడు సమతుల్యతను కోల్పోకుండా ఉండేలా చూసుకోవాలి. మూడు నుంచి ఐదు సార్లు ఈ భంగిమను తిరిగి చేయాలి. తర్వాత విశ్రాంతి తీసుకోవడానికి కొంత సమయం కేటాయించాలి. ఈ ఆసనం వల్ల వెన్నెముక నొప్పి తీవ్రత తగ్గుతుంది. కడుపుపై ఒత్తిడి పెరిగి, అదనపు కొవ్వు తగ్గిపోతుంది. ఊబకాయంపై ప్రభావవంతంగా పనిచేస్తుంది. హృదయ స్పందన రేటును సమర్థంగా నిర్వహిస్తుంది. ఫలితంగా గుండె పనితీరు మెరుగుపడుతుంది.



– జి.అనూషా రాకేష్, యోగా ట్రైనర్

లీగల్

రెండవ భార్యకు, పిల్లలకు ఆస్తి వస్తుందా?



భార్య లేదా భర్త బతికి ఉండగా, చట్టరీత్యా విడాకులు తీసుకోకుండా చేసుకున్న రెండవ పెళ్లి చెల్లదు. ప్రస్తుతం ఉన్న చట్టాలలో, (ముస్లింలకు, కొన్ని ప్రత్యేక మతాచారాలు వున్నవారికి తప్ప) అది నేరం కూడా. అందుకనే రెండవ భార్యకి భర్త ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండదు. మొదటి భార్య సంతానానికి, రెండవ భార్య సంతానానికి మాత్రం ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. అయితే మొదటి భార్య చనిపోయిన తర్వాత లేదా విడాకులు తీసుకున్న తర్వాత రెండో పెళ్లి చేసుకుంటే, ఆ రెండవ భార్యకి కూడా మొదటి భార్య సంతానం – రెండవ భార్య సంతానంతో పాటు ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. ఉదాహరణకు: చనిపోయిన మొదటి భార్యకి భర్తకి కలిపి ఇద్దరు సంతానం ఉన్నారు. అలాగే రెండవ భార్యకి ఇద్దరు సంతానం ఉన్నారు. ఎటువంటి వీలునామా రాయకుండా చనిపోయిన భర్త స్వార్జితంలో – పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తిలో 5 భాగాలు అవుతాయి. అందులో నాలుగు భాగాలు మొదటి – రెండవ భార్య సంతానానికి, ఒక భాగం రెండవ భార్యకి చెందుతుంది.

ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ – పదోన్నతి తర్వాత సంక్రమించే సర్వీస్ బెనిఫిట్స్‌కి సంబంధించి మాత్రం చట్టం కొంత వేరుగా ఉంటుంది. సాధారణ పరిస్థితులలో, పైన తెలిపిన విధంగా చెల్లుబాటు కాని పెళ్లి చేసుకున్న రెండవ భార్యకి పెన్షన్, సర్వీస్ బెనిఫిట్స్ లో ఎటువంటి హక్కు ఉండదు. కానీ అన్నివేళలా అలా వుండదు. ఇటీవలే 2023లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పులో మొదటి భార్య బతికి ఉన్నప్పటికీ, చట్టరీత్యా విడాకులు తీసుకోనప్పటికీ రెండవ భార్యకి కూడా పెన్షన్ – సర్వీస్ బెనిఫిట్స్‌లో సమాన హక్కు కల్పించింది. మొదటి భార్య నుంచి విడాకులు కావాలి అంటూ చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగి డైవర్స్ కేసు ఫైల్ చేసి ఉండడం ఆ కేసులో గమనించదగ్గ అంశం. అంతేకాక ఫ్యామిలీ పెన్షన్ ఉద్దేశానికి, మెయింటెనెన్స్ చట్టం వెనుక ఉన్న ఉద్దేశానికి తేడా ఏమీ లేదు అని అంటూ, మొదటి భార్యకి, రెండవ భార్యకి పెన్షన్ సమానంగా రెండు భాగాలుగా పంచాలి అని కోర్టు తన తీర్పు వెలువరించింది. రైల్వే విభాగంలో మాత్రం, పెన్షన్ రూల్స్ లోని సెక్షన్ 75 ప్రకారం, మొదటి భార్యకి – రెండవ భార్యకి కూడా పెన్షన్‌లో సమాన హక్కు ఉంటుంది అని గతంలో పలు హైకోర్టులు పేర్కొన్నాయి. కొన్ని హక్కులు రెండవ భార్యకి వర్తిస్తాయా లేదా అన్నది కేసు పూర్వాపరాలను బట్టి, ఆయా కేసులోని ప్రత్యేక అంశాలపైనా ఆధారపడి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్ట్ అడ్వకేట్



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో యూకీ 48వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఏడాది మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీలతో కలిపి మొత్తం 22 టోర్నీల్లో పాల్గొన్న 32 ఏళ్ల యూకీ స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో, మ్యూనిక్ ఏటీపీ–250 టోర్నీలో అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)తో కలిసి డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

శ్రీలంక జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఇయాన్ బెల్

ఇంగ్లండ్ జట్టుతో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఇయాన్ బెల్ వ్యవహరించనున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన ఇయాన్ బెల్ 118 టెస్టులు ఆడి 7727 పరుగులు సాధించాడు. ఈనెల 16 నుంచి శ్రీలంక జట్టుతో కలిసి బెల్ పనిచేస్తాడని శ్రీలంక క్రికెట్ సీఈఓ ఆష్లే డిసిల్వా తెలిపారు. ఇంగ్లండ్, శ్రీలంక మధ్య తొలి టెస్టు ఈనెల 21 నుంచి 25 వరకు మాంచెస్టర్‌లో జరుగుతుంది. ఆ తర్వాత రెండో టెస్టు లార్డ్స్‌లో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు... చివరిదైన మూడో టెస్టు సెప్టెంబర్ 6 నుంచి 10 వరకు ఓవల్‌లో జరుగుతాయి.



మూడు రోజుల తర్వాత...

వినేశ్ కేసు మరోసారి వాయిదా



పారిస్: భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకం కోసం చేస్తున్న న్యాయ పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆమెకు పతకం ఇవ్వాలా వద్దా అనే అంశంపై మంగళవారం రావాల్సిన కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తీర్పు మరోసారి వాయిదా పడింది. దీనిని మరో మూడు రోజులకు వాయిదా వేస్తున్నట్లు సీఏఎస్ ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 16న భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు తీర్పు వస్తుంది. 50 కేజీల కేటగిరీలో 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో అనర్హతకు గురైన వినేశ్ తాను అనుమతించిన బరువుతోనే ఫైనల్ వరకు చేరాను కాబట్టి తనకు సంయుక్తంగా రజత పతకం అందించాలని సీఏఎస్‌ను ఆశ్రయించింది. మరోవైపు ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమం వరకు పారిస్ క్రీడా గ్రామంలోనే ఉన్న వినేశ్ అక్కడి నుంచి బయలుదేరి మంగళవారమే భారత్‌కు చేరుకుంది.

అంతా అబద్ధం

నాపై రూ. కోటిన్నర ఖర్చు చేయలేదు

- కేంద్ర క్రీడా శాఖ వ్యయ నివేదికపై షట్లర్ అశ్విని పొన్నప్ప అసంతృప్తి

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ ఒలింపిక్స్ లక్ష్యంగా ఒక్కో క్రీడాకారుడిపై చేసిన ఖర్చుపై నివేదికను విడుదల చేస్తుంది. అయితే మహిళా డబుల్స్ స్టార్ షట్లర్ అశ్విని పొన్నప్పపై ఆ శాఖ విడుదల చేసిన వ్యయ నివేదికపై ఆమె మండిపడింది. అత్తెసరు, అరకొర సాయం తప్ప అవసరమైన వ్యక్తిగత కోచ్‌నే ఇవ్వలేదని... అలాంటపుడు ఏకంగా రూ. కోటిన్నర తనపై ఖర్చు చేసినట్లు ఎలా చెబుతారని కేంద్ర క్రీడా శాఖ నిర్వాకంపై అసంతృప్తి వెలిబుచ్చింది. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్) కింద రూ. 4.5 లక్షలు, అలాగే వార్షిక శిక్షణ, టోర్నీల్లో పాల్గొనడం (ఏసీటీసీ) కోసం రూ. 1 కోటి 48.04 లక్షలను అశ్వినిపై ఖర్చు చేసినట్లుగా 'సాయ్' వ్యయ నివేదికలో పేర్కొంది. దీనిపై స్పందించిన షట్లర్ 'ఇది చూసి నేనైతే తేరుకోలేనంత షాక్‌కు గురయ్యాను. నాకు ఆర్థిక సాయం అందలేదనే చింత లేదు కానీ అంత మొత్తం నాకు కేటాయించారనే తప్పుడు నివేదిక ఇవ్వడం ఏంటి. నిజంగా చెబుతున్నా. 'సాయ్'... క్రీడా శాఖ నివేదికలో వివరించినట్లుగా నేనెలాంటి నిధులు అందుకోలేదు. జాతీయ శిక్షణ విషయానికొస్తే... రూ. కోటిన్నర నిధుల్ని మొత్తం శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులపై ఖర్చు పెట్టారు. అంతేతప్ప నా ఒక్కరికే అంత మొత్తం ఇవ్వనేలేదు. ఇంకా చెప్పాలంటే నాకు వ్యక్తిగత కోచే లేడు. క్రీడా శాఖ నియమించనూ లేదు. నా వ్యక్తిగత ట్రెయినర్‌ను సొంతడబ్బులతో నేనే ఏర్పాటు చేసుకున్నా. ఇలా చెబుతున్నది నిజం తెలియాలనే తప్పా నాకు డబ్బులు ఇవ్వాలని కానే కాదు. 2023 నవంబర్ వరకు కూడా నా సొంత ఖర్చులతోనే శిక్షణ తీసుకున్నా, పోటీల్లో పాల్గొన్నా... ఆ తర్వాతే టాప్స్‌కు ఎంపికయ్యా' అని 34 ఏళ్ల అశ్విని వివరించింది. మేటి డబుల్స్ షట్లర్‌గా ఎదిగిన అశ్విని కామన్వెల్త్ క్రీడల్లో 2010లో స్వర్ణం, 2014లో రజతం, 2018లో కాంస్యం గెలిచింది. 2011 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో గుత్తా జ్వాలతో కలిసి మహిళల డబుల్స్‌లో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. జ్వాలతోనే కలిసి 2012 లండన్ ఒలింపిక్స్, 2016 రియో ఒలింపిక్స్‌లలో డబుల్స్‌లో పోటీపడింది. పారిస్ ఒలింపిక్స్‌లో తనీషాతో కలిసి బరిలోకి దిగిన అశ్విని గ్రూప్ దశలోనే వెనుదిరిగింది.



పారాలింపిక్స్‌కు ముందే భారత్‌కు ఎదురుదెబ్బ

- బ్యాడ్మింటన్ స్టార్ ప్రమోద్ భగత్‌పై 18 నెలలు నిషేధం
- పారాలింపిక్స్‌కు దూరమైన డిఫెండింగ్ చాంపియన్
- డోపింగ్ నియమావళి ఉల్లంఘనతో బీడబ్ల్యూఎఫ్ చర్యలు



భువనేశ్వర్: పారాలింపిక్స్ ప్రారంభం కాకముందే భారత్‌కు గట్టి దెబ్బ తగిలింది. కచ్చితంగా పతకంతో తిరిగి వస్తాడనుకున్న భారత పారా షట్లర్, టోక్యో పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రమోద్ భగత్‌పై నిషేధం పడింది. డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినందుకు ప్రమోద్‌పై 18 నెలలపాటు సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం వెల్లడించింది. దీంతో 2020 టోక్యో పారాలింపిక్స్‌లో పసిడి పతకం గెలిచిన ప్రమోద్.. ఈ నెల 28న ప్రారంభం కానున్న పారిస్ పారాలింపిక్స్‌కు దూరమయ్యాడు. పోటీలు లేని సమయంలో క్రీడాకారులు డోపింగ్ పరీక్షలకు అందుబాటులో ఉండేందుకు తాము ఎక్కడ ఉన్నామనే వివరాలు అందించాల్సి ఉంటుంది. మూడుసార్లు వివరాలు ఇవ్వని పక్షంలో ఆ క్రీడాకారుడిపై చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో ప్రమోద్ విఫలమయ్యాడు. ఏడాది వ్యవధిలో ఎక్కడెక్కడ ఉన్నారనే వివరాలు ప్రమోద్ అందించని కారణంగా అతడిపై బీడబ్ల్యూఎఫ్ సస్పెన్షన్ విధించింది. 'టోక్యో పారాలింపిక్స్ చాంపియన్ ప్రమోద్ భగత్‌పై ఏడాదిన్నర పాటు సస్పెన్షన్ విధించాం. బీడబ్ల్యూఎఫ్ డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నాం. గత 12 నెలల్లో ఎక్కడ ఉన్నాడనే వివరాలు ఇవ్వకపోవడంతోనే నిషేధం విధించాం' అని బీడబ్ల్యూఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. 'ఇది చాలా కఠిన నిర్ణయం. ఎక్కడున్నానో చెప్పడంలో జరిగిన పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. గత ఏడాదిలో రెండుసార్లు టెస్టుకు అందుబాటులో లేను. మూడోసారి పూర్తి వివరాలు సమర్పించా. అయినా నా అప్పీల్‌ను స్వీకరించలేదు. పారిస్ పారాలింపిక్స్ కోసం సిద్ధమవుతున్న సమయంలో ఇలాంటి అనూహ్య ఘటన ఎదురవడం చాలా బాధగా ఉంది. గుండె పగిలినట్లయింది. నా బృందం ఎంతో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ (సీఏఎస్) నిర్ణయాన్ని గౌరవిస్తున్నా' అని ప్రమోద్ వివరించాడు. నిషేధం విషయంలో గత నెలలో సీఏఎస్‌లో ప్రమోద్ అప్పీల్ చేసుకోగా.. సీఏఎస్ డోపింగ్ నిరోధక విభాగం దాన్ని తాజాగా తోసిపుచ్చింది. ఈ ఏడాది మార్చి 1 నుంచే ఈ నిషేధం అమల్లోకి రాగా.. వచ్చే ఏడాది సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగనుంది. ఒడిశాకు చెందిన ప్రమోద్ కేంద్రం నుంచి 2021లో దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న'... 2022లో 'పద్మశ్రీ' అందుకున్నాడు. టోక్యో పారాలింపిక్స్ సింగిల్స్ ఎస్ఎల్ 3 విభాగంలో స్వర్ణం గెలిచిన ప్రమోద్... పారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఐదుసార్లు టైటిల్స్ గెలిచాడు.

తదుపరి లక్ష్యం స్వర్ణ పతకం: అమన్



న్యూఢిల్లీ: వచ్చే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే తన లక్ష్యమని 'పారిస్' క్రీడల్లో కాంస్యం నెగ్గిన భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ పేర్కొన్నాడు. పురుషుల 57 కేజీల విభాగంలో కాంస్యం గెలవడం ద్వారా భారత్ తరఫున అతి పిన్న వయసులో ఒలింపిక్ మెడల్ సాధించిన అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కిన అమన్... భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తానని అన్నాడు. 'తదుపరి ఒలింపిక్స్‌లో పసిడి పతకం గెలవాలనుకుంటున్నా. దాని కోసం మరింత కఠిన సాధన చేస్తా. పారిస్ క్రీడల్లో కాంస్యం గెలవడం ఆనందంగా ఉంది. పతక పోరుకు ముందు బరువు పెరిగినా... పెద్దగా ఆందోళన చెందలేదు' అని అమన్ అన్నాడు. మంగళవారం స్వదేశానికి చేరుకున్న అమన్‌ను కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సన్మానించి రూ. 30 లక్షల చెక్ అందజేశారు.

పతక విజేతలపై నజరానాల వర్షం

- ఫిలిప్పీన్స్ ఒలింపిక్ విజేతకు ఏకంగా 'రిసార్ట్ హోమ్' బహుమతి
- పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ నదీమ్‌కు రూ. 10 కోట్లు అందజేత



మనీలా: విశ్వక్రీడల పతకాలకు ఉన్న ప్రతిష్టకు ఇదొక మచ్చుతునక. ఫిలిప్పీన్స్‌కు చెందిన జిమ్నాస్ట్ కార్లోస్ యులో పారిస్ ఒలింపిక్స్‌లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, వాల్ట్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. దాంతో ఆ దేశ ప్రభుత్వం 'రిసార్ట్ హోమ్'ను బహుకరించాలని నిర్ణయించింది. సాధారణంగా విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, క్రీడా అవార్డులు, స్థానిక ప్రభుత్వాలైతే విలువైన ఇంటి స్థలాల్ని ఇవ్వడం పరిపాటి! కానీ ఫిలిప్పీన్స్ మాత్రం కార్లోస్‌కు అద్వితీయ కానుకను సిద్ధం చేస్తోంది. అంతేనా... తమ దేశ చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో ఘనస్వాగతం పలికింది. పారిస్ నుంచి మంగళవారం స్వదేశం చేరుకున్న 24 ఏళ్ల చాంపియన్‌కు అసాధారణ ఏర్పాట్లతో వెల్‌కమ్ చెప్పిన ఆ దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ 10 లక్షల అమెరికా డాలర్లు (రూ. 8.39 కోట్లు) చెక్ ఇవ్వడంతోపాటు ఒక రిసార్ట్ హోమ్‌నే బహుమతి ఇస్తామని ఆ రిసార్టులో జీవితకాలం ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని ప్రకటించారు. కార్లోస్ రెండు స్వర్ణాలతో పారిస్ గేమ్స్ పతకాల పట్టికలో ఫిలిప్పీన్స్ 37వ స్థానంలో నిలిచింది.



నదీమ్‌కు కారు 92.97

లాహోర్: పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌కు పాక్ కరెన్సీలో రూ. 10 కోట్లు (భారత్ కరెన్సీలో రూ. 3 కోట్లు) నజరానాను మంగళవారం బహూకరించారు. పంజాబ్ (పాక్) ముఖ్యమంత్రి మరియం నవాజ్ (మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె) నదీమ్ స్వగ్రామానికి వెళ్లి మరీ ప్రోత్సాహకాన్ని చెక్ రూపంలో అందజేసింది. వారి కుటుంబసభ్యులతో ముచ్చటించిన ఆమె ఒలింపిక్ చాంపియన్‌ను తయారు చేసిన కోచ్ సల్మాన్ ఇక్బాల్ భట్‌కూ రూ. 50 లక్షల (రూ.15 లక్షలు) చెక్‌కు అందజేసింది. ఈ నెల 8న పారిస్‌లో జరిగిన ఫైనల్ ఈవెంట్‌లో భారత హాట్ ఫేవరెట్ నీరజ్ చోప్రా (89.45 మీటర్లు; రజతం)ను వెనక్కినెట్టి 92.97 మీటర్లతో కొత్త ఒలింపిక్ రికార్డును నెలకొల్పాడు. ఈ ఒలింపిక్ రికార్డు స్కోరుతో కూడిన నేమ్ ప్లేట్ ఉన్న కారును కూడా నదీమ్‌కు అందజేశారు.



ధర్మశాలలో కాదు... గ్వాలియర్‌లో తొలి టి20

కొత్త స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ పోరు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గ్వాలియర్‌లో కొత్త స్టేడియాన్ని ముస్తాబు చేసింది. బంగ్లాదేశ్‌తో త్వరలో జరగబోయే టి20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను ఈ కొత్త మైదానంలో నిర్వహించనుంది. షెడ్యూలు ప్రకారం అక్టోబర్ 6న తొలి టి20 ధర్మశాలలో జరగాలి. కానీ అక్కడ నవీకరణ పనులు మ్యాచ్ సమయానికల్లా పూర్తయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో బోర్డు వేదికను మార్చింది. గ్వాలియర్ నగరంలో కొత్తగా నిర్మించిన 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ జరుగుతుంది.



వచ్చే జనవరిలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య చెన్నై, కోల్‌కతాల్లో జరగాల్సిన మ్యాచ్ వేదికల్ని పరస్పరం మార్చారు. జనవరి 22న చెన్నైలో జరగాల్సిన మొదటి టి20 కోల్‌కతాలో, 25న కోల్‌కతాలో జరగాల్సిన మ్యాచ్‌ను చెన్నైలో నిర్వహిస్తారు.

సినిమా



ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ (2013) విజేతగా, మోడల్‌గా 'గూఢచారి, మేజర్' వంటి తెలుగు చిత్రాలతో, హిందీ 'రామన్ రాఘవ్ 2.ఓ' చిత్రంతో, 'మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్' వంటి సిరీస్‌లతో... ఇలా శోభితా ధూళిపాళ్ల చాలా పాపులార్టీ సంపాదించుకున్నారు. అయితే హీరో నాగచైతన్యతో ఎంగేజ్‌మెంట్ తర్వాత ఒక్కసారిగా వార్తల్లో ట్రెండింగ్‌గా నిలిచారామె. అందుకు నిదర్శనం ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ 'ఐఎండీబీ' (ఇంటర్నెట్ మూవీ డేటా బేస్) తాజాగా రిలీజ్ చేసిన భారతీయ సెలబ్రిటీల జాబితా. ఈ జాబితాలో శోభిత రెండో స్థానంలో నిలిచారు. గత వారానికి సంబంధించిన పాపులర్ ఇండియన్ సెలబ్రిటీల లిస్టును ఐఎండీబీ తాజాగా విడుదల చేసింది. బాలీవుడ్ నటి శార్వరీ వాఘ్ ('ముంజ్యా' మూవీ ఫేమ్) తొలి స్థానంలో నిలవగా, శోభిత ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్‌కి మూడో స్థానం దక్కింది. నాగచైతన్య–శోభితల నిశ్చితార్థం ఈ నెల 8న హైదరాబాద్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు ఆమె గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఈ కారణంగా గత వారం ఇండియన్ పాపులర్ సెలబ్రిటీగా నిలిచారు శోభిత. ఇక 'ఐఎండీబీ' జాబితాలో కాజోల్ నాలుగో స్థానం, జాన్వీ కపూర్ ఐదో స్థానం, బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్ ఆరు, దీపికా పదుకోన్ ఏడు, విజయ్ సేతుపతి ఎనిమిది, మృణాల్ ఠాకూర్ తొమ్మిది, ఐశ్వర్యా రాయ్ పదో స్థానాల్లో నిలిచారు.

ఐఎండీబీలో...

రెండో స్థానంలో శోభిత... మూడో స్థానంలో షారుక్

మన సినిమాతో ఈ నెలాఖరు అదిరిపోతుంది

– నాని



● ఎస్‌జే సూర్య, ప్రియాంక, డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్, నాని, హన్షిత, హర్షిత్

''హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్ నాకు చాలా స్పెషల్. ఈ థియేటర్‌లో మీ అందరితో (అభిమానులు, ప్రేక్షకులు) కలసి 'సరిపోదా శనివారం' ట్రైలర్ లాంచ్ వేడుక చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మన సినిమాతో ఈ నెలాఖరు అదిరిపోతుంది. మీ ప్రేమను నాపై ఇలానే చూపిస్తూ ఉంటే వంద శాతం కష్టపడి మరిన్ని మంచి చిత్రాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉంటా'' అని హీరో నాని అన్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నాని, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ– ''29న థియేటర్స్‌లో 'సరిపోదా శనివారం'ని సెలబ్రేట్ చేసుకుందాం'' అన్నారు. నటుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రం ఇది.. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది'' అని పేర్కొన్నారు. ''గ్యాంగ్ లీడర్' సినిమా తర్వాత నానీగారితో 'సరిపోదా శనివారం' చేశాను. అందరూ కుటుంబంతో వెళ్లి మా సినిమా చూడండి'' అని ప్రియాంకా అరుళ్ మోహన్ చెప్పారు. ''మా సినిమా మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది'' అన్నారు డీవీవీ దానయ్య.

"సినిమాలు చూసి ప్రేక్షకులు ప్రభావితమవుతారంటే అంతగా నమ్మను. 'పుష్ప' సినిమా చూసి గొడ్డలి పట్టుకుని ఎవరూ అడవులకు వెళ్లలేదు. గాంధీగారి సినిమాలు చూసి ఎవరూ గాంధీగారిలా మారలేదు. సినిమాల ప్రభావం ప్రేక్షకులపై కొన్ని గంటల పాటు మాత్రమే ఉంటుందన్నది నా అభిప్రాయం" అని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా సినిమా 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో హరీష్ శంకర్ చెప్పిన విశేషాలు.

పాత రవితేజను కొత్తగా చూస్తారు

– హరీష్ శంకర్



● ఉత్తర భారతదేశంలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా 'మిస్టర్ బచ్చన్' సినిమా ఉంటుంది. కొంత సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నాను. ఈ సినిమాలో హీరో బచ్చన్ పాత్రలో నిజాయితీ ఉన్న హీరోయిజమ్ ఉంటుంది. 1980లో లక్షల రూపాయలంటే పెద్ద మొత్తం. అంత మొత్తం లంచం రూపంలో వస్తుందన్నా కూడా ఓ అధికారి ఒప్పుకోలేదు.. లొంగలేదు. నాకు ఈ పాయింట్ నచ్చింది. ఇలాంటి నిజాయితీ గల ఆఫీసర్ జీవితంలో ప్రేమ, ఫ్యామిలీ, రొమాంటిక్ యాంగిల్స్ కూడా ఉంటే ఎలా ఉంటుందని ఆలోచించి రవితేజగారి క్యారెక్టర్‌ను డిజైన్ చేశాను. ప్రేక్షకులు బాగా ఎంటర్‌టైన్ అవుతారు. హిందీ 'రైడ్'కు, 'మిస్టర్ బచ్చన్'కు...అజయ్ దేవగన్‌కు, రవితేజకు మధ్య ఉన్నంత తేడా ఉంది. 'రైడ్'లో అజయ్ దేవగన్ రోల్ సెటిల్డ్‌గా ఉంటే... 'మిస్టర్ బచ్చన్'లో రవితేజగారి రోల్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఉంటుంది. ఇక ఈ కథకు ఓ కొత్త అమ్మాయి అయితే బాగుంటుందని భావించి భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవడం జరిగింది. జిక్కీ పాత్రలో ఆమె ప్రేక్షకులను మెప్పిస్తారు. జగపతి బాబుగారు ఎంపీ పాత్రలో కనిపిస్తాను. ● నేను సినిమా చూడని రోజులు ఉన్నాయేమో కానీ పాటలు వినకుండా ఉన్న రోజులు లేవు. ఓ సినిమా దర్శకుడిగా నేను విఫలం అయ్యానేమో కానీ... సంగీతం విషయంలో కాదు. నా ఫ్లాప్ మూవీ 'షాక్'లోని 'మధురం..' పాట ఇంకా వినిపిస్తూనే ఉంది. ట్యూన్స్ సరైన సమయానికి ఇవ్వకపోవడం వల్ల లిరికల్ వీడియోలు లేట్‌గా విడుదల అవుతున్న రోజులివి. అలాంటిది వారం రోజుల్లో నాలుగు ట్యూన్స్ ఇచ్చారు మిక్కీ జే మేయర్. ఆయన చాలా ప్రతిభావంతుడు. మాస్ సాంగ్స్ చేయలేదు అంటే ఆయనకు రాక కాదు... చాన్స్ రాలేదు అంతే. ● చలం, యండమూరిగార్ల నవలలు చదివి సినిమా ఇండస్ట్రీకి వచ్చాను. సాహిత్యంలో మంచి పట్టు ఉంది నాకు. అలాంటి నేను 'షాక్' సినిమా తీస్తే మూడేళ్లు ఆడియన్స్ నన్ను షాక్‌లో ఉంచారు. ఆ వెంటనే 'మిరపకాయ్' సినిమా తీశాను. ఇక 'ఇడియట్, 'అమ్మానాన్న ఓ తమిళ అమ్మాయి' వంటి సినిమాలు చేసిన రవితేజగారు ఎప్పటికప్పుడు కొత్తగా కనిపించాలని అప్పట్లో 'నా ఆటోగ్రాఫ్..', ఇటీవల 'టైగర్ నాగేశ్వరరావు, ఈగల్' సినిమాలు చేస్తే ఆడియన్స్ ఆదరణ దక్కలేదు. కానీ 'ధమాకా' అంటే హిట్ ఇచ్చారు. అందుకే 'మిస్టర్ బచ్చన్'లో పాత రవితేజనే కొత్తగా చూపిస్తున్నాం. నిర్మాత విశ్వప్రసాద్ గారు లేకపోతే 'మిస్టర్ బచ్చన్' సినిమా ఇంత గ్రాండ్‌గా వచ్చేది కాదు. ఆగస్టు 15న రిలీజ్ చేసేవాళ్లం కాదు. ఆడియన్స్‌కు ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. 'మిస్టర్ బచ్చన్' మళ్లీ మళ్లీ చూసేలా ఉంటుంది. ఈ రోజు సాయంత్రం నుంచి ప్రీమియర్స్ వేస్తున్నాం.

తాల్... ఓ మర్చిపోలేని అనుభూతి

– అనిల్ కపూర్




● అనిల్ కపూర్, ఐశ్వర్యా రాయ్

ఐశ్వర్యా రాయ్, అక్షయ్ ఖన్నా, అనిల్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన హిందీ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'తాల్' (1999). సుభాష్ ఘాయ్ దర్శకత్వం వహించి, నిర్మించిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో పాటు అవార్డులు, రివార్డులను సాధించింది. ఈ చిత్రం విడుదలై పాతికేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు అనిల్ కపూర్. ''తాల్' గురించి ప్రేక్షకులు ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నారు. విక్రాంత్ కపూర్ ('తాల్'లో అనిల్ కపూర్ పాత్ర) రోల్ నా కెరీర్‌లో ఓ మర్చిపోలేని జ్ఞాపకం. ఈ పాత్రను నాకు ఇచ్చిన సుభాష్‌ను గుర్తుపెట్టుకుంటాను. 'రమ్తా జోగి..' నా ఫేవరెట్ సాంగ్. అయితే ఈ పాట నా ఫేవరెట్‌గా మారడం వెనక పెద్ద కథ ఉంది. నిజానికి ఈ పాటకు ఫరా ఖాన్ కొరియోగ్రఫీ చేయాలి. కానీ చివరి నిమిషంలో ఆమె తప్పుకున్నారు. దీంతో ఈ పాటను రేపు చిత్రీకరిస్తామనగా, ముందు రోజు రాత్రి ప్రముఖ కొరియోగ్రాఫర్ సరోజ్ ఖాన్ వచ్చారు. నేను ఎటువంటి రిహార్సల్స్ లేకుండానే ఈ పాటను పూర్తి చేశాను. అదీ... ఐశ్వర్యా రాయ్ వంటి అద్భుతమైన డ్యాన్సర్ సరసన డ్యాన్స్ చేశాను. చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇంకో విశేషం ఏంటంటే...ఫిల్మ్‌ఫేర్, జీ, ఐఎఫ్ఎఫ్ఏ, స్క్రీన్ అవార్డ్స్... ఇలాంటి అవార్డ్స్ ఫంక్షన్స్‌లో ఉత్తమ సహాయనటుడి విభాగం ('తాల్'లో నటనకు గాను...)లో నాకు మేజర్ అవార్డులు వచ్చాయి. ఇలా అన్ని రకాలుగా 'తాల్' మర్చిపోలేని అనుభూతిని మిగిల్చింది'' అంటూ ఇన్‌స్టా వేదికగా పేర్కొన్నారు అనిల్ కపూర్. 12 పాటలు ఉన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'పేరడైజ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

పేరడైజ్‌లో దొంగతనం



ప్రముఖ దర్శకులు మణిరత్నం సమర్పించిన సినిమా 'పేరడైజ్'. శ్రీలంక, ఇండియా రచయితలు కలిసి రాసిన కథతో రూపొందిన చిత్రం ఇది. ఈ సినిమాకు ప్రసన్న దర్శకుడు. రోషన్ మాథ్యూ, దర్శనా రాజేంద్రన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ 'పేరడైజ్' పూర్తిగా శ్రీలంకలో తీసిన సినిమా. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... ఓ జంట తమ ఐదో వివాహ మహోత్సవాన్ని జరుపుకోవడానికి శ్రీలంకలోని ఓ సుదూర గెస్ట్ హౌస్‌కు వెళుతుంది. ఆ గెస్ట్ హౌస్ కొండల మధ్యలో చాలా మారుమూల ప్రాంతంలో ఉంటుంది. దానికి దరిదాపుల్లో ఓ చిన్న గ్రామం ఉంటుంది. వీళ్ళు వెళ్ళేటప్పటికీ శ్రీలంక దేశం మొత్తం ఉద్యమంతో ఉద్రిక్తత నెలకొని ఉంటుంది. ఈ జంట నివసిస్తున్న గెస్ట్ హౌస్‌లో ఓ రాత్రి దొంగతనం జరిగి వారి వస్తువులన్నీ దొంగలు ఎత్తుకెళ్తారు. ఆ దొంగలను పట్టుకునే క్రమంలో వీరు ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అన్నదే కథ. ఈ సినిమా మొత్తంలో స్క్రీన్‌ప్లే కొంత ల్యాగ్ అనిపించినా ఆఖరి ట్విస్ట్ మాత్రం ఎవరూ ఊహించనిది. అలాగే సినిమా మొత్తంలో సీతమ్మ, హనుమంతులు తిరిగిన ప్రదేశాలు చూపించడం, వాటి వివరణ ఇవ్వడం బావుంది. సినిమా మొత్తం చాలావరకు గ్రీనరీ చూడవచ్చు. ఎందుకంటే లంక అనేది రావణుని పేరడైజ్ కాబట్టి. మరి... మీరు కూడా ఈ 'పేరడైజ్'ని ప్రైమ్ వీడియోలో చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

ఆ మ్యాజిక్ రిపీట్ అవుతుంది

– జీవీ ప్రకాశ్‌కుమార్



''టెక్నాలజీని మనం ఎంత వరకూ సద్వినియోగం చేసుకుంటున్నాం అన్నది ముఖ్యం. కృత్రిమ మేథస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించి కొందరు ప్రముఖ సంగీత దర్శకులు చేసిన సంగీతం, పాటలు శ్రోతలను ఎందుకు మెప్పించలేకపోయాయి? అనే విషయాలపై నేను మాట్లాడను. కానీ సినిమా స్క్రిప్ట్, అందులో నుంచి వచ్చే సందర్భాలపైనే సంగీత దర్శకులు ఇచ్చే సంగీతం ఆధారపడి ఉంటుంది'' అన్నారు సంగీత దర్శకుడు–నటుడు జీవీ ప్రకాశ్‌కుమార్. విక్రమ్ హీరోగా నటించిన తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జీవీ ప్రకాశ్‌కుమార్ మాట్లాడుతూ– ''తంగలాన్' కథ ప్రధానంగా ట్రైబల్స్ నేపథ్యంలో ఉంటుంది. దాంతో ఆఫ్రికన్, ఆస్ట్రేలియన్ ట్రైబ్స్‌కు చెందిన సంగీతాన్ని కూడా పరిశీలించాను. సినిమా సంగీతానికి, ట్రైబల్స్ సంగీతానికి మధ్యలో నేను ఓ వారధిగా ఉంటూ ఈ సినిమా మ్యూజిక్‌ను ప్రేక్షకులకు చేరువ చేయడం సవాల్‌గా అనిపించింది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా అద్భుతంగా ఉంటుంది. విక్రమ్‌గారితో ఇది నా మూడో సినిమా. నా సంగీత దర్శకత్వంలో వచ్చిన 'అసురన్, ఆకాశం నీ హద్దురా!' లాంటి మ్యాజిక్ 'తంగలాన్'తో రిపీట్ అవుతుందని అనుకుంటున్నాను'' అని అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
14-8-2024

స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽ 693	78,956
	నిఫ్టీ ▽ 208	24,139

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,318	△ 357
డోజోన్స్	39,664	△ 307
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,235	△ 25
డాక్స్	17,812	△ 86
షాంఘై	2,867	△ 10
నికాయ్	36,232	△ 1,208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	70,444	△ 554
బంగారం (99.5 స్వచ్ఛత)	70,162	△ 552
వెండి (కేజీ)	80,702	▽ 422

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.55	84.57
£	బ్రిటన్ పౌండ్		105.98	108.53
€	యూరో		90.56	92.95
¥	జపాన్ ఎన్ (100)		56.56	57.83
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.41	56.34
S$	సింగపూర్ డాలర్		61.09	65.74
SAR	సౌదీ రియాల్		21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్		21.98	23.76
¥	చైనా యువాన్		10.83	12.65

స్పామ్ కాల్స్ టెలీమార్కెటర్లను బ్లాక్‌లిస్ట్ చేయండి

టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు



న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్ చేసే టెలీమార్కెటర్లపై టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠిన చర్యలు ప్రకటించింది. అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటింగ్ సంస్థలు వ్యాపారపరమైన స్పామ్ కాల్స్ చేస్తున్నట్లుగా తేలినట్లయితే వాటి టెలికం వనరుల న్నింటినీ డిస్కనెక్ట్ చేయాలని, రెండేళ్ల పాటు వాటిని బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని టెల్కోలను ఆదేశించింది. బ్లాక్‌లిస్ట్‌లో ఉంచినప్పుడు ఆయా సంస్థలకు కొత్తగా టెలికం వనరులను కేటాయించరాదని పేర్కొంది. ఎస్ఐపీ, పీఆర్ఐ వంటి టెలికం వనరులను ఉపయోగిస్తున్న అన్‌రిజిస్టర్డ్ టెలీమార్కెటర్లు ఈ ఆదేశాలు వచ్చిన నెల రోజుల్లోగా డీఎల్‌టీ ప్లాట్‌ఫాంనకు మారాలని తెలిపింది. ఈ ఆదేశాలను తక్షణం పాటించాలని, ఈ విషయంలో తీసుకున్న చర్యలపై ప్రతి పదిహేను రోజులకు ఓసారి (ప్రతి నెలా ఒకటి, పదహారో తారీఖుల్లో) అప్‌డేట్ ఇవ్వాలని టెల్కోలకు ట్రాయ్ సూచించింది. ఈ 'నిర్ణయాత్మక చర్య'తో స్పామ్ కాల్స్ బెడద గణనీయంగా తగ్గగలదని, వినియోగదారులకు ఉపశమనం కలగగలదని అభిప్రాయపడింది.

హీరో మోటో లాభం జూమ్

క్యూ1లో రూ. 1,032 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో హీరోమోటో కార్ప్ కన్సాలిడేటెడ్ నికర లాభం 47% పెరిగి రూ. 1,032 కోట్లను తాకింది. వాహన అమ్మకాల జోరు ఇందుకు దోహదపడింది. గతేడాది క్యూ1లో కేవలం రూ. 701 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,851 కోట్ల నుంచి రూ. 10,211 కోట్లకు ఎగసింది.కంపెనీ చరిత్రలో తొలిసారి ఒక క్వార్టర్లో రూ. 10,000 కోట్ల టర్నోవర్ అందుకున్నట్లు హీరో మోటో సీఈవో నిరంజన్ గుప్తా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు 1.4% తగ్గి రూ. 5,240 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో ట్రైనెట్ జీసీసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు హ్యూమన్ రిసోర్సెస్ సొల్యూషన్స్ అందించే ట్రైనెట్ తాజాగా హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ప్రారంభించింది. సుమారు 600 మంది సిబ్బంది సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రెసిడెంట్ మైక్ సిమండ్స్ తెలిపారు. తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే ప్రణాళికల్లో ఉన్నట్లు వివరించారు. తమ వ్యాపారానికి, సాంకేతిక ఆవిష్కరణలకు, క్లయింట్లకి మెరుగైన సేవలు అందించేందుకు హైదరాబాద్ కార్యాలయం హబ్‌గా ఉపయోగపడగలదని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ మేకల పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
స్మార్ట్ ఫోన్స్ మార్కెట్ జోరు | 350 బిలియన్ డాలర్లకు ఈ-కామర్స్ ఎగుమతులు!

పండుగ డిమాండ్.. లక్షల్లో గిగ్ జాబ్స్!

పండుగ సీజన్ కోసం కంపెనీల తాత్కాలిక హైరింగ్ జోరు

- 7 లక్షల గిగ్ వర్కర్లను నియమించుకోవచ్చు
- ఈ-కామర్స్, లాజిస్టిక్స్ టాప్
- గతేడాదితో పోలిస్తే 15–20% అధికం
- తర్వాత స్థానాల్లో బీఎఫ్ఎస్ఐ, రిటైల్, ఆతిథ్యం



గిగ్ వర్కర్లకు జీతాల రేంజ్... (రూ.లలో)

డెలివరీ	15,000-18,000
బీఎఫ్ఎస్ఐ సేల్స్	22,000-24,000
గిడ్డంగులు	15,000-18,000
అసెంబ్లింగ్ లైన్ వర్కర్లు	16,000-19,000
రిటైల్ స్టోర్ సేల్స్	18,000-22,000

* దీనికి ఇతర ప్రోత్సాహకాలు అదనం. సేల్స్, డెలివరీ రంగాల్లోని వారు మరిన్ని ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది.

[illegible] పండుగల పుణ్యమా అని తాత్కాలిక [illegible] ... గ్రామీణ డిమాండ్ కూడా దన్నుగా నిలుస్తుందని [illegible] ... రెడీ అవుతున్నాయని క్వెస్, ర్యాండ్‌స్టాడ్, అడెకో [illegible] ... సంస్థలు చెబుతున్నాయి. ఓనమ్‌తో మొదలయ్యే పండుగ సీజన్.. కేరళ ఓనమ్, వినాయక చవితి, దసరా, దీపావళి, చివర్లో క్రిస్మస్, కొత్త సంవత్సరం వేడుకలతో ముగుస్తుంది. దీంతో ఈకామర్స్ సంస్థలు, రిటైల్ స్టోర్లు రకరకాల ఆఫర్లతో [illegible] ... దుగా ఉంది. అన్ని రంగాల్లోనూ కలిపి 6 లక్షల నుంచి 7 లక్షల మేర తాత్కాలిక ఉద్యోగాలు వెల్లువెత్తొచ్చని భావిస్తున్నాం' అని క్వెస్ [illegible] ... నుంచి 7 లక్షల [illegible]

ఈ రంగాల్లో జోష్...

[illegible] ... ల్స్/గూడ్స్ కంపెనీలు కొత్త ఉత్పత్తులతో పండుగ సీజన్‌కు కొత్త కళ తీసుకొస్తున్నాయి. ... బీఎఫ్ఎస్ఐలు సైతం లోన్లు, క్రెడిట్ కార్డుల జారీపై మరింత దృష్టి సారిస్తున్నాయి. రిటైల్ స్టోర్లలో తాత్కాలిక ఉద్యోగుల [illegible] ... చాలా కంపెనీల [illegible]

చిన్న నగరాల్లో మరింత అధికం

చిన్న నగరాల్లో [illegible] వేగంగా పెరుగుతుం డటంతో [illegible] ... విస్తరిస్తుం డటం [illegible] ... కోయంబత్తూరు, లక్నో, సూరత్, [illegible] తాత్కాలిక [illegible] హాట్ స్పాట్లుగా [illegible] ... జైపూర్, [illegible] లక్నో, సూరత్, భువనేశ్వర్, భోపాల్, లూధియానా, చండీగఢ్ వంటి పలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు తాత్కాలిక ఉద్యోగులకు హాట్ స్పాట్లుగా నిలుస్తున్నాయి. గత సీజన్‌తో పోలిస్తే ఇక్కడ గిగ్ వర్కర్ల డిమాండ్ [illegible] ... లేబులింగ్, క్వాలిటీ కంట్రోల్, ఆర్డర్ ఫుల్‌ఫిల్మెంట్ సిబ్బంది నియామకాలు జోరందుకున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణియన్ తెలిపారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

79,000 దిగువకు సెన్సెక్స్



- నిఫ్టీకి 208 పాయింట్ల నష్టం
- సూచీలకు రెండోరోజూ నష్టాలు
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు పడేశాయ్
- రూ.4.52 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ పడ్డాయి. ఎఫ్ఐఐల విక్రయాలు కూడా సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.50% నష్టపోయి సూచీల పతనాన్ని శాసించింది. ఫలితంగా సెన్సెక్స్ 693 పాయింట్లు క్షీణించి 79 వేల స్థాయి దిగువన 78,956 వద్ద నిలిచింది. నిఫ్టీ 208 పాయింట్లు నష్టపోయి 24,139 వద్ద స్థిరపడింది. కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 760 పాయింట్లు పతనమై 78,889 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు క్షీణించి 24,116 వద్ద కనిష్టాలు తాకాయి.

- హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావంతో అదానీ గ్రూపులోని మొత్తం 11 లిస్టెడ్ కంపెనీల షేర్లలో 8 నష్టపోయాయి.
- సెన్సెక్స్ దాదాపు శాతం పతనంతో ఒక్కరోజులో రూ.4.52 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.445 లక్షల కోట్ల(5.30 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.465)తో పోలిస్తే 34% ప్రీమియంతో రూ.625 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 52% పెరిగి రూ.707 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 46% లాభంతో రూ.678 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35,214 కోట్లుగా నమోదైంది.



సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు పెట్టిన యూనికామర్స్ ఈ సొల్యూషన్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.108)తో పోలిస్తే 113% ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 137% పెరిగి రూ.256 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖర్లో లాభాల స్వీకరణతో చివరికి 95% లాభంతో రూ.210 వద్ద స్థిరపడింది.

పలువురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్ అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్‌కు ఏపీఎస్ఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీతకు రైతుబజార్ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. హిమాన్షు శుక్లా హోదాను సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నుంచి ఎక్స్‌అఫీషియో జాయింట్ కార్యదర్శిగా మార్చారు. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శుక్లాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి.రాజాబాబు ఏపీ బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమం కమిషనర్‌గా కూడా వ్యవహరిస్తారు.

'భూసాగుదారుల పేరిటే ఈ-క్రాప్ నమోదు'



సాక్షి, అమరావతి: భూముల క్లాసిఫికేషన్‌తో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులను గుర్తించి, వారి పేరిటే ఈ-క్రాప్ నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులసంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో పలు దేవాదాయాలకు చెందిన భూములను బహిరంగ వేలం వేస్తున్నారని, అయితే ఆర్థిక స్తోమత లేక కౌలు రైతులు వాటిని పొందలేకపోతున్నారని చెప్పారు. పలుకుబడి కలిగిన, డబ్బున్న బడాబాబులు ఈ భూములను బహిరంగ వేలంలో పొందుతూ అధిక ధరలకు కౌలుకు లేదా సబ్ లీజుకు ఇస్తున్నారని చెప్పారు. లీజుదారుల పేరిట ఈ-క్రాప్ నమోదు చేయడం వలన, కౌలుదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలు కోల్పోతున్నారని, వాస్తవ సాగుదారుల పేరిట ఈ క్రాప్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'నిఘా'కు నలుగురు అదనపు ఎస్పీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర నిఘా విభాగానికి నలుగురు అదనపు ఎస్పీలను ప్రభుత్వం నియమించింది. రాజపు రమణ(విజయవాడ కమాండ్ కంట్రోల్ సెంటర్), బి.విజయ్ భాస్కర్(అదనపు ఎస్పీ-పరిపాలన, అనకాపల్లి జిల్లా), ఆర్.రాఘవేంద్ర (అదనపు ఎస్పీ, పల్నాడు జిల్లా), జి.వెంకట రాముడు(అదనపు ఎస్పీ-సెబ్, వైఎస్సార్ జిల్లా)లను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగంలో అదనపు ఎస్పీలుగా బదిలీ చేశారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంటుపై బాబు కథ తప్పే..

'సెకీ' విద్యుత్ వల్ల రాష్ట్రంపై అంతర్రాష్ట్ర సరఫరా చార్జీలు పడవు

- ప్రభుత్వానికి తేల్చి చెప్పిన విద్యుత్ నియంత్రణ మండలి
- 30 ఏళ్లు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించాలనుకున్న గత ప్రభుత్వం
- తక్కువ ధరకే కొనేలా కేంద్ర సంస్థ సెకీతో ఒప్పందం
- ఈ ఒప్పందంపై విషం చిమ్మిన బాబు ప్రభుత్వం
- రూ.3500 కోట్ల చార్జీలు పడతాయంటూ శ్వేతపత్రంలో అబద్ధాలు
- అదంతా ఉత్తిదేనని తేల్చిన ఏపీఈఆర్‌సీ




సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయ ఉచిత విద్యుత్ అందించడంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయం బయటపడింది. ఉచిత విద్యుత్‌ను ఆపాలన్న దురాలోచనతో కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో వైఎస్ జగన్ ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందంపై దుష్ప్రచారానికి తెరతీసింది. సీఎం చంద్రబాబు విద్యుత్ రంగంపై ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలో సెకీ ఒప్పందాన్ని తప్పుబడుతూ పచ్చి అబద్ధాలతో ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేశారు. సెకీ విద్యుత్ తీసుకుంటే జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జీఎన్ఏ) నిబంధనల ప్రకారం రూ.3 వేల కోట్ల నుంచి రూ.3,500 కోట్ల వరకూ అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా చార్జీలు (ఐఎస్‌టీఎస్) చెల్లించాల్సి వస్తుందని నమ్మించాలనుకున్నారు. కానీ ఆయన చెప్పినదంతా అబద్ధమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. గ్రామీణ వ్యవసాయ విద్యుత్ సరఫరా కంపెనీ ద్వారా అంతర్రాష్ట్ర చార్జీలు ఉండవని రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం స్పష్టంగా చెప్పింది.

చీకటి రోజుల నుంచి రైతులకు విముక్తి


గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పంటలకు నీరు పెట్టుకోవడం కోసం మీటర్లు వేసుకొనేందుకు రైతులు అర్ధరాత్రివేళ పొలాలకు వెళ్లి, విద్యుత్ షాక్‌కు, పాము కాట్లకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న చీకటి రోజుల నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం విముక్తి కలిగించింది. వ్యవసాయానికి పగటిపూటే నిరంతరాయంగా 9 గంటల ఉచిత విద్యుత్ అందించింది. దాంతోపాటు రానున్న 30 ఏళ్లలో వ్యవసాయానికి ఎలాంటి విద్యుత్ కష్టాలు లేకుండా సౌర విద్యుత్ సమకూర్చే చర్యలు చేపట్టింది. అది కూడా ప్రైవేటు నుంచి కాకుండా, 'ఏఏఏ' రేటింగ్ కలిగిన వంద శాతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ నుంచి 7 వేల మెగావాట్లు తీసుకుని రైతులకు ఉచితంగా అందించాలని సంకల్పించింది. సెకీతో ఒప్పందం అనంతరం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలు అమలులోకి వచ్చాయి. వీటి ప్రకారం అన్ని రకాల విద్యుత్‌ను కొనేందుకు అనుమతి ఉన్న డిస్కంలు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు పొందలేవు. దీనిని ముందే గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రామీణ వ్యవసాయ విద్యుత్ సరఫరా కంపెనీని ఏర్పాటు చేసింది.

వంద శాతం మినహాయింపు

సెకీతో ఒప్పందమే పెద్ద భారమైనట్టు, ఓ నేరమైనట్టు సీఎం చంద్రబాబు శ్వేతపత్రంలో చెప్పుకొచ్చారు. ఐఎస్‌టీఎస్ చార్జీలపై అపోహల నేపథ్యంలో ఈ నెల 2న కర్నూలులో జరిగిన సదరన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్స్ ఫోరం (ఎస్ఈఆర్ఎఫ్) సమావేశంలో, ఈ నెల 9న ఢిల్లీలో జరిగిన వర్కింగ్ గ్రూప్ భేటీలోనూ ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి చర్చించారు. నిపుణుల అభిప్రాయాలు, చట్టాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం సెకీ విద్యుత్‌పై ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి వంద శాతం మినహాయింపు పొందవచ్చనే నిర్ణయానికి వచ్చినట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. తద్వారా 25 సంవత్సరాల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు వస్తోంది. దీని విలువ చంద్రబాబు చెప్పిన దాని ప్రకారమే దాదాపు రూ.3,500 కోట్లు.



సెకీపై చంద్రబాబు అబద్ధాల శ్వేతపత్రం



అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా చార్జీలు ఉండవని ఏపీఈఆర్‌సీ విడుదల చేసిన పత్రం

తక్కువ ధరతోనూ రూ.3,750 కోట్లు ఆదా

సెకీ నుంచి 2024 సెప్టెంబర్ నుంచి విద్యుత్ కొనుగోలు మొదలవుతుంది. తొలి ఏడాది 3 వేల మెగావాట్లు, 2025లో మరో 3 వేల మెగావాట్లు, 2026లో మరో 1000 మెగావాట్లు చొప్పున మొత్తం 7 వేల మెగావాట్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుంది. ప్రస్తుత సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.5.10 ఉండగా, సెకీ విద్యుత్ యూనిట్ రూ.2.49 కే వస్తోంది. ఎన్టీపీసీ సౌర విద్యుత్ ధర యూనిట్ రూ.2.79 కన్నా కూడా ఇది తక్కువ. దీనిద్వారా ఏటా దాదాపు రూ.3,750 కోట్లు రాష్ట్రానికి ఆదా అవుతుంది.


నష్టం తెచ్చిందే టీడీపీ

వాస్తవంగా విద్యుత్ రంగాన్ని నష్టాల పాలు చేసిందే గత చంద్రబాబు ప్రభుత్వం. అప్పట్లో మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.44కు లభిస్తుంటే (బ్యాక్ డౌన్ చార్జీలతో కలిపి రూ.3.54), బాబు ప్రభుత్వం ఏకంగా యూనిట్ రూ.6.99కు కొనేలా ఒప్పందాలు చేసుకుంది. పవన విద్యుత్ యూనిట్‌కు రూ.4.84 వరకు అధిక ధర చెల్లించి ఒప్పందాలు చేసుకుంది. 4 వేల మెగావాట్ల సామర్థ్యం మేరకు పవన విద్యుత్ ఒప్పందాలు నామినేషన్ ప్రాతిపదికనే జరిగాయి. పోటీ బిడ్డింగ్ ద్వారా కాదు. దీనివల్ల డిస్కంలపై ఏడాదికి రూ.3,500 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని 25 ఏళ్ల పాటు మోయాల్సిన దుస్థితి ఏర్పడింది. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో దుబారా, దోపిడీని అరికట్టి కరెంటు కొనుగోళ్లు, ఉత్తమ యాజమాన్య విధానాల ద్వారా దాదాపు రూ.4,925 కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేసింది. సెకీతో తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది.

విజయసాయిరెడ్డిపై తప్పుడు కథనాలను తొలగించండి

- ఎల్లో మీడియాపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం
- ఆ వీడియోలను వెంటనే బ్లాక్ చేయాలి





సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టులో ఎల్లో మీడియాకు పెద్ద షాక్ తగిలింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా ప్రసారం చేసిన కథనాలను వెంటనే తొలగించాలని తొమ్మిది మీడియా సంస్థల (ఈటీవీ, ఆంధ్రజ్యోతి, టీవీ-5, మహాన్యూస్, ఆర్‌టీవీ సహా మరో నాలుగు చానెల్స్)ను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా ఎల్లో మీడియాపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారంలో ఎల్లో మీడియా తప్పుడు కథనాలు ప్రసారం చేసి తన పరువుకు భంగం కలిగించిందని, రూ. 10 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని కోరుతూ ఎంపీ విజయసాయిరెడ్డి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ వికాస్ మహాజన్ ధర్మాసనం.. ఎంపీ విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా ప్రసారం చేసిన కథనాలను, వీడియోలను వెంటనే తొలగించాలని మంగళవారం ఆదేశాలిచ్చింది. వెబ్‌సైట్‌లలో తొలగించాల్సిన కథనాల యూఆర్‌ఎల్‌లను కూడా ఆ ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. తప్పుడు కథనాలను ప్రజలకు అందించవద్దని ఎల్లో మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చిల్లర ప్రయోజనాల కోసం నిరాధారమైన, పరువు నష్టం కలిగించే ప్రకటనలు ఇస్తూ.. తద్వారా రాజకీయ కార్యకర్త జీవితకాలంలో కష్టపడి నిర్మించుకున్న ప్రజా ప్రతిష్టను దిగజార్చడాన్ని అనుమతించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. పదిరోజుల్లో పిటిషనర్ పేర్కొన్న వెబ్‌సైట్‌ల లింక్‌లను ప్రతివాదులు తొలగించాలి లేదా బ్లాక్ చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ.. తదుపరి విచారణ నవంబర్ 25కు వాయిదా వేసింది.

కొబ్బరి రైతుకు కష్టకాలం

- జూలై 7న ప్రారంభమైన కొబ్బరి కొనుగోలు
- సేకరణ లక్ష్యం 8 వేల మెట్రిక్ టన్నులు
- కొన్నది 750 క్వింటాళ్లు మాత్రమే



సాక్షి అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరికాయ నాణ్యత లేదనే సాకుతో స్థానికంగా ఉన్న 'నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఎండు కొబ్బరి (మిల్లింగ్ కోప్రా) చేయకపోవడం, తయారు చేస్తున్న కొద్దిపాటి ఎండు కొబ్బరి నాఫెడ్ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం ఓ కారణం కాగా.. దీనికి తోడు కొంతమంది దళారులు కర్ణాటక, తమిళనాడు నుంచి నాణ్యమైన కొబ్బరి కాయలను దిగుమతి చేసుకుని రైతుల ముసుగులో ఈ కేంద్రాల్లో అధిక మొత్తానికి విక్రయిస్తుండడం.. ఇక్కడి రైతుల పాలిట శాపంగా పరిణమించింది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నాఫెడ్ కేంద్రాలు తెరచి నెల రోజులకు పైగా అయ్యింది. జిల్లాలో అంబాజీపేటతోపాటు కొత్తపేట, తాటిపాక, రాజోలు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీలలో ఈ కేంద్రాలను తెరవాల్సి ఉంది. తొలి దఫాగా అంబాజీపేట, కొత్తపేటలలో మాత్రమే ప్రారంభించారు. గత నెలలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వీటిని ఆర్భాటంగా ప్రారంభించారు. ఈ కేంద్రాలు ప్రారంభించిన తరువాత పది రోజుల పాటు భారీ వర్షాల వల్ల తెరవలేదు. తరువాత తెరిచినా పెద్దగా కొనుగోలు లేకుండా పోయింది. ఇంతవరకు కొనుగోలు చేసింది కేవలం 750 క్వింటాళ్లు మాత్రమే కావడం గమనార్హం. ఈ కేంద్రాల్లో వచ్చే అక్టోబర్ నెలాఖరు నాటికి ఎనిమిది వేల క్వింటాళ్ల కొబ్బరి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు జరుగుతున్న తీరు చూస్తుంటే లక్ష్యం మేరకు కొనుగోలు చేస్తారనే నమ్మకం రైతులకు కలగడం లేదు.

కొబ్బరి కాయ కొనుగోలు చేయాలి

నాఫెడ్‌లో దళారుల ప్రమేయాన్ని తగ్గించి తమ వద్ద నుంచి నేరుగా పచ్చి కొబ్బరి కాయ కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 5వ తేదీన మెచ్యూర్ డిహస్క్‌డ్ కోకోనట్ (తయారై వలిచిన కొబ్బరి కాయను) కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం వలిచిన కొబ్బరి కాయలకు క్వింటాల్‌కు రూ.3,013గా ధర నిర్ణయించింది. ఈ ధరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొబ్బరి కాయ కొనుగోలు చేస్తే తమకు మేలు జరుగుతుందని కోనసీమ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



చిరుత కలకలం

శ్రీశైలంలో చిరుతల సంచారం కలకలం రేపుతోంది. పాతాళగంగ రోడ్డు మార్గంలో దేవస్థానం ఏఈవో ఐఎస్‌వీ మోహన్ నివాసం ఉంటున్న ఇంటి ప్రహరీపై చిరుత కనిపించింది. సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కుక్కల అరుపులు వినిపించడంతో ఇంట్లోని వారు బయట లైట్లు వేశారు. దీంతో ప్రహరీపై ఉన్న చిరుత ఒక్కసారిగా లోపలకు దూకి మళ్లీ అదే మార్గంలో బయటకు వెళ్లిపోయింది. –శ్రీశైలం



'గుర్రపు' స్వారీ

శ్రీశైలం జలాశయానికి వరదనీటితో పాటు గుర్రపు డెక్క భారీగా చేరింది. చిన్న చిన్న కాలువలు, నదుల గుండా స్వారీ చేస్తూ ఇక్కడకు తరలివచ్చింది. దీంతో పచ్చని నిండు కుండలా ప్రాజెక్టు దర్శనమిస్తోంది. సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. –శ్రీశైలం ప్రాజెక్ట్



సింధూర ఆకాశం

మనకు కనిపించే ఆకాశం ఎప్పుడూ నీలిరంగుతో కనిపిస్తోంది. అప్పుడప్పుడు ఇంద్ర ధనుస్సులా తళుక్కుమంటుంది. అటువంటి ఆకాశం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, హుకుంపేట ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు ఎర్రబడింది. నీలి ఆకాశం సింధూరంగా మారడంతో స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. –సాక్షి, పాడేరు


రెవెన్యూ సదస్సులు సెప్టెంబర్‌కు వాయిదా

సాక్షి, అమరావతి: ఉద్యోగుల బదిలీల కారణంగా రెవెన్యూ సదస్సులను వాయిదా వేస్తున్నట్టు రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి ప్రారంభించాల్సిన సదస్సులను సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సదస్సుల్లో మొదటి 45 రోజులు భూ వివాదాలు, రీ–సర్వే తప్పిదాలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. అనంతరం 45 రోజుల్లో అర్జీలపై చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూముల విషయంలో మోసపూరిత రిజిస్ట్రేషన్లు జరిగినట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. 'ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చనే' పద్ధతి తీసుకురావడంతో కొన్ని మోసపూరిత రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గుర్తించామన్నారు. ఇలాంటి వాటిపై విచారణ జరిపి నిజమైన అసైనీలకు న్యాయం చేస్తామన్నారు.



పురాతన ఆలయంలో నేలమాళిగ?

- ఆలయ ద్వారానికి నాగబంధం
- కుందుర్పిలో వెలుగు చూసిన వైనం
- భారీ సంపద ఉండొచ్చని అనుమానం




కుందుర్పిలోని పురాతన ఆలయం

కళ్యాణదుర్గం: తిరువనంతపురం ట్రావెన్‌కోర్ దేవస్థానానికి చెందిన అనంత పద్మనాభస్వామి ఆలయంలోని నాగబంధం ఉన్న నేలమాళిగలో నిధులు సంచలనం కాగా, పూరీలో జగన్నాథుడికి సైతం నాగబంధం ఉన్న నేలమాళిగల్లో నిధులు వెలుగు చూశాయి. దీంతో తాజాగా ఓ పురాతన ఆలయానికి నాగబంధం ఉండటం, ఆ రహస్య గదిలో భారీ సంపద ఉండవచ్చునని అక్కడి గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా, కుందుర్పి మండల కేంద్రం చుట్టూ పలు పురాతన ఆలయాలు ఉన్నాయి. గ్రామానికి సమీపంలోని చిన్న కొండ ప్రాంతంలో క్రీ.శ. 15వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన ఆలయం ఉంది. ఈ ఆలయంలోని గర్భగుడిలో శివలింగం ఉందని కొందరు, శ్రీ కృష్ణదేవరాయలు సతీసమేతంగా ఉన్న శిల్పాలు ఉన్నాయని మరికొందరు చెబుతున్నారు. ఆలయంలోని ఓ గది ముఖద్వారానికి నాగబంధం ఉండటం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. దీంతో గదిలో విలువైన భారీ సంపద ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. త్వరలోనే ఆలయాన్ని పురావస్తుశాఖ అధికారులు పరిశీలించనున్నట్లు సమాచారం.

శ్రీశైలానికి స్థిరంగా వరద

ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 880.80 అడుగులు



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. వస్తున్న వరదను అదే పరిమాణంలో దిగువ ప్రాంతాలకు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం సమయానికి సుంకేసుల నుంచి 77,598 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. సోమవారం నుంచి మంగళవారం వరకు సుంకేసుల, సెల్ఫ్ క్యాచ్‌మెంట్ నుంచి 97,230 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దిగువ ప్రాంతాలకు 1,22,953 క్యూసెక్కుల నీరు విడుదలైంది. స్పిల్‌వే ద్వారా 25,781 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన ద్వారా 63,375 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 25వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా సుజల స్రవంతికి 1,397 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.384 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.731 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 192.5300 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 880.80 అడుగులకు చేరుకుంది.

రూ.4.56 కోట్ల బంగారం బిస్కెట్లు సీజ్

- సముద్రమార్గంలో శ్రీలంక నుంచి తమిళనాడుకు..
- ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి, చెన్నై: సముద్ర మార్గంలో శ్రీలంక నుంచి తమిళనాడులోకి బంగారం స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరిని మదురై రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అరెస్టు చేసింది. వీరి నుంచి రూ.4.56 కోట్ల విలువైన 6.6 కేజీల బంగారం బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బంది రామనాథపురం జిల్లా మండపం, రామేశ్వరం సముద్ర తీరంలో నిఘా వేశారు. శ్రీలంక నుంచి ఓ పడవలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు కారులో బంగారం తరలిస్తున్నట్లు గుర్తించి, వారిని వెంబడించారు. తిరుప్పాచెట్టి టోల్‌గేట్ వద్ద కారును చుట్టుముట్టి అందులో ఉన్న 6.6 కేజీల బంగారం బిస్కెట్లు సీజ్ చేశారు. వీటిని తరలిస్తున్న కీలకరైకు చెందిన సాధిక్ అలీ, షేక్ సద్దార్‌ను అరెస్టు చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ రూ.4.56 కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

సెప్టెంబర్ 2 వరకు కవిత కస్టడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం ఈడీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని మూడు వారాలు పొడిగిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కస్టడీ ముగియడంతో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. అనంతరం, ఈడీ విజ్ఞప్తి మేరకు కవిత కస్టడీని సెప్టెంబరు 2 వరకూ పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణకు 122 మంది ఉద్యోగుల రిలీవ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన తెలంగాణకు చెందిన ఉద్యోగులు తమ సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ సొంత రాష్ట్రానికి చెందిన 122 మంది నాన్–గెజిటెడ్ ఉద్యోగులను తిరిగి తెలంగాణకు రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.